www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
శుక్రవారం 16 మే 2025
సంపుటి :06 సంచిక : 345 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH

### యాదాద్రిని దర్శించుకున్న సుందరాంగులు

- పోచంపల్లిలోనూ ఇక్కత్ చీరలపై మక్కువ



2 లో..

# సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

- కాళేశ్వరం వద్ద సిఎం, మంత్రుల పుణ్యస్నానం
- సరస్వతీమాత విగ్రహాన్ని ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

**కాళేశ్వరం,మే15( వెలుతురు):**

కాళేశ్వరం వద్ద సరస్వతీ పుష్కరాలు ప్రారంభమయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో సరస్వతి నది పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరస్వతీ పుష్కరస్నానం ఆచరించారు. గురువారం సాయంత్రం కాళేశ్వరం చేరుకున్న సిఎం రేవంత్.. సరస్వతీ పుష్కర ఘాట్ ను ప్రారంభించారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పుష్కరస్నానం ఆచరించారు. ఆ తర్వాత సరస్వతీదేవి విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు.అనంతరం నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు-చేసిన 10 అడుగుల సరస్వతిదేవి విగ్రహాన్ని, భక్తుల వసతి కోసం నిర్మించిన 86 గదుల సముదాయాన్ని సీఎం ప్రారంభించారు. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు ఈ మహాక్రతువు జరగనుంది. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నదికి పుష్కరాలు మొదల య్యాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకే బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమవుతున్నా.. గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు. దీంతో గురువారం వేకువజామున 5.44 గంటలకు సరస్వతి ఘాట్ వద్ద శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా 2 లో..





## భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేలా కర్ణాటక తరహాలో రాష్ట్రంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల విధానం

- 17వ తేదీ వరకు సర్వేయర్ల నియామక దరఖాస్తుల స్వీకరణ
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ వెలుతురు మే 15:-**

రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా భూ లావాదేవీలను సమర్ధవంతంగా పారదర్శకంగా నిర్వహించడానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

ఇందుకు సంబంధించి కర్ణాటక రాష్ట్రంలో విజయవంతమైన లైసెన్స్‌డ్ సర్వేయర్ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయడానికి 3 లో..

## ఫీజురీయంబర్స్ మెంట్ బకాయిలు వెంటనే చెల్లించండి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ
- ఫీజురీయంబర్స్ మెంట్ బకాయిలపై అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాట ఏమైందని ప్రశ్నించిన బండి సంజయ్
- ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల రూ.8 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి
- ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు దిక్కుతోచని స్థితిలో పడిపోయాయి
- అధ్యాపకులకు, సిబ్బందికి జీతభత్యాలు, మెయింటెనెన్స్ ఛార్జీలు కూడా చెల్లించలేక అవస్థలు పడుతున్నా పట్టించుకోరా?

2 లో

**హైదరాబాద్ వెలుతురు మే 15:**

ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లింపు విషయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఇకపై క్రమం తప్పకుండా ఏటా నిర్ణీత వ్యవధిలోనే ఫీజు రీయంబర్స్ మెంట్ ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫీజు రీయంబర్స్ మెంట్" పథకం అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యపూరిత ధోరణి లక్షలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, నర్సింగ్ సహా వేలాది కాలేజీలు పూర్తిగా సంక్షోభంలో



## ఈ అధికారం మీకెవరు ఇచ్చారు?

- రాజ్యాంగంలో అలాంటి ప్రొవిజన్ ఉందా?
- రాష్ట్రపతి,గవర్నర్లను ఎలా ఆదేశిస్తారు
- తమిళనాడు గవర్నర్ కేసులో తీర్పుపై అభ్యంతరం
- సుప్రీం తీర్పుపై ప్రశ్నలు సంధించిన రాష్ట్రపతి
- రాజ్యాంగ ధర్మాసం సమాధానం ఇస్తుందా అన్న ఉత్కంఠ



**న్యూఢిల్లీ,మే15( వెలుతురు):**

తమిళనాడు గవర్నర్ విషయంలో తీర్పుసందర్భంగా రాష్ట్రపతిని కూడా ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం తీరుపై రాష్ట్రపతి ముర్ము ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అధికారం మీకెవరు ఇచ్చారో చెప్పాలని స్పష్టం 7 లో..

## పాక్ అణ్వాయుధాల గుట్టు తేల్చాలి

- వాటి రక్షణపై అనుమానాలు ఉన్నాయి
- అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీస్వాధీనం చేసుకోవాలి
- పాక్ కుట్రలను తిప్పికొట్టిన భారత దళాలకు సెల్యూట్
- కాశ్మీర్ పర్యటనలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

**న్యూఢిల్లీ,మే15( వెలుతురు):**

బాధ్యతలేని, దుష్ట పాకిస్థాన్ వద్ద అణ్వాయుధాలు ఉండడం ఎంత వరకు క్షేమం అని ప్రపంచ దేశాల్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్నించారు. కాశ్మీర్‌లో పర్యటించిన సందర్భంగా శ్రీనగర్‌లోని బాదామి బాగ్ కంటోన్మెంట్‌లో గురువారం ఆయన మాట్లాడారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ వద్ద న్యూక్లియర్ ఆయుధాలు ఉండడం ఎంత వరకు సమంజసం అని రాజ్‌నాథ్ అడిగారు. అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీ .. పాకిస్థాన్ అణ్వాయుధాలను తన ఆధీనంలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో జరిగిన దాడిలో.. కిరానా హిల్స్ సమీపంలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌ను భారతీయ వైమానిక దళాలు 2 లో..





### కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు

- ముందు వెళ్లి క్షమాపణలు చెప్పండి
- మధ్యప్రదేశ్ మంత్రికి సుప్రీం ఆదేశాలు

**న్యూఢిల్లీ,మే15( వెలుతురు):**

సైనికాధికారి కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు 2 లో..

## కంచెగచ్చిబౌలి భూముల్లో పర్యావరణం పునరుద్ధరించండి

- యధాతథ స్థితి కొనసాగించకుంటే జైలుకెళ్లక తప్పదు
- భూములపై మరోమారు విచారించిన సుప్రీం
- విచారణ జులై 18కి వాయిదా వేసిన ధర్మాసనం



**న్యూఢిల్లీ,మే15( వెలుతురు):**

హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా అత్యున్నత 2 లో..

## అణగారిన వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత

- ఆ భయంతోనే కులగణనకు మోడీ అంగీకారం
- బీహార్ పర్యటనలో రాహుల్ విమర్శలు





**పాట్నా, మే15(వెలుతురు):**

దేశంలో అణగారిన వర్గాల నుంచి వ్యతిరేకత ఎదురవుతుందనే భయంతోనే ప్రధాని మోదీ కులగణనకు అంగీకరించారని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. వెనుకబడిన వర్గాల తరపున పోరాడుతున్న ప్రతిపక్షానికి ప్రధాని భయపడ్డారని అన్నారు. బిహార్‌లోని దర్భంగాలో నిర్వహించిన సమావేశంలో మిథిలా యూనివర్సిటీ- విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేవలం 7 లో..

## రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు

- 76 ప్రాజెక్టుల ద్వారా రూ.4,95,796 కోట్ల పెట్టుబడులు
- 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఎస్‌పిబి సమావేశంలో సిఎం చంద్రబాబు వెల్లడి



**అమరావతి, మే15(వెలుతురు):**

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు పడుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు 7 లో..

## రెడ్ బుక్‌ను వదిలేది లేదు

- వైసిపి చేయని అనేక పనులు చేస్తున్నాం
- జగన్ నిర్వాకం వల్లనే ట్రూ అప్ ఛార్జీల వసూలు
- చంద్రబాబు చొరవతో పెద్ద కంపెనీల రాక
- నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు
- ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- కార్యకర్తలకు నారా లోకేశ్ పిలుపు

**అనంతపురం, మే15( వెలుతురు):**

రెడ్ బుక్ మరువను... కేడర్‌ను ఇబ్బంది పెట్టిన వారిని వదలనని అంటూ మంత్రి నారా లోకేష్ మరోసారి స్పష్టం చేశారు..ఐదేళ్లలో వైసీపీ 7 లో..



## రైతులను దోపిడి చేయడం రేవంత్ సర్కార్ లక్ష్యమా..?

- ధాన్యం కొనుగోలులో అనేక అవకతవకలు జరుగుతున్నాయి
- ధాన్యం కొనుగోలులో జరుగుతున్న అవకతవలు ప్రభుత్వానికి తెలిసే జరుగుతుందా..?
- లేక ప్రభుత్వానికి కనిపించడంలేదా..?
- తేమ పేరుతో తరుగు పేరుతో దోపిడి జరుగుతుంది.
- రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారు
- వరి కొనుగోలు ఐకెపి ద్వారా జరిగేది నేడు ఆది లేదు
- ఐకేపీ కాదని, పీఏసీఎస్ సెంటర్లకు ఇవ్వడం వెనక మతలబ్ ఏంటి..?
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

2 లో

**హైదరాబాద్ వెలుతురు మే 15:**

వరి ధాన్యం కొనుగోలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల అన్నదాతలు అరిగోస పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్లను కాంటా పెట్టడానికి రోజుల తరబడి జాప్యమవు తుండడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారు. ఎండ తీవ్రతకు వడదెబ్బ తగిలి అన్నదాతలు కొనుగోలు కేంద్రాల్లోనే ఏకంగా ప్రాణాలే కోల్పోతుండడం ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్ల ఏమాత్రం నిబద్ధత లేదనడానికి నిదర్శనం. ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలు, డీసీఎంఎస్ లు ఏర్పాటు చేసిన



(మొదటి పేజీ తరువాయి..)

## సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

ప్రారంభించారు. కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదులు కలిసి త్రివేణి సంగమంగా ప్రవహిస్తోంది. కాళేశ్వర క్షేత్రం వద్ద త్రివేణి సంగమ తీరంలో ఇవాల్టి నుంచి ఈనెల 26వ తేదీ వరకు సుమారుగా 12 రోజుల పాటు- సరస్వతీ నది పుష్కరాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించి, భక్తులు సాంకేతికంగా పొందే సేవల ను సైతం అందులో పొందుపరిచారు. సదరు పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చి పుష్కర స్నానం చేయడంతో పాటు- పిండప్రదానం, దంపతీ స్నానం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వార్లను దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు- చేశారు.

## పాక్ అణ్వాయుధాల గుట్టు తేల్చాలి

దాడి చేశాయి. అయితే ఆ ఎయిర్‌బేస్ వద్ద న్యూక్లియర్ వార్‌హెడ్స్‌ను పాకిస్థాన్ దాచిపెట్టినట్లు తెలుస్తోంది. దాడి జరగడం వల్ల ఆ న్యూక్లియర్ వార్‌హెడ్స్ నుంచి అణుధార్మికత రిలీజ్ అవుతున్నట్లు- ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో శ్రీనగర్ పర్యటనలో రక్షణ మంత్రి తన ప్రసంగంలో ఆ అంశాన్ని ప్రస్తావించారు. పెహల్గామ్ దాడి తర్వాత జమ్మూకశ్మీర్ ప్రజల్లో పాకిస్థాన్, ఉగ్రవాదులపై ఆగ్రహం వ్యక్తం అయ్యిందని, జమ్మూకశ్మీర్ ప్రజలకు సెల్యూట్ చేస్తున్నానని, శుత్రవులను నాశనం చేసిన శక్తి ఇక్కడ ఉందని, పాకిస్థానీ చౌకీలు, బంకర్లను ధ్వంసం చేసిన తీరుతో శత్రుదేశం షాక్‌కు గురైందన్నారు. కిష్టమైన పరిస్థితుల్లో ఇక్కడ మీతో ఉండడం గర్వంగా భావిస్తున్నానని, ఆపరేషన్ సింధూర్ సమయంలో మీరు చేసిన పని పట్ల దేశం గర్వంగా ఉందన్నారు. రక్షణ మంత్రి కన్నా ముందు తాను దేశ పౌరుడినని, ఓ మంత్రిగానే కాకుండా, ఓ పౌరుడిగా ధన్యవాదాలు చెబుతున్నట్లు రాజ్‌నాథ్ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తున్న రాజ్‌నాథ్‌కు ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది స్వాగతం పలికారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. ఉగ్ర శిబిరాలు ఎక్కడ ఉన్నా నాశనం చేస్తామని చెప్పారు. -టె-ర్రరిస్టులతో పోరాడి ప్రాణత్యాగాలు చేసిన జవాన్లకు శిరస్సు వంచి నివాళులర్పిస్తున్నట్లు- పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనేది కేవలం ఒక పేరు మాత్రమే కాదని.. అదొక కమిట్‌మెంట్ అని పేర్కొన్నారు. భారత్‌పై ఉగ్రదాడి జరిగితే.. దానిని యుద్ధ చర్యగానే పరిగణిస్తామన్నారు. మన దళాలు అద్భుతంగా పోరాడుతున్నాయని పేర్కొన్నారు. ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా వారి మధ్య ఉన్నందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి మృతులకు ఆయన నివాళులర్పించారు. ఇక ఈ పర్యటనలో భాగంగా పాకిస్థాన్ షెల్లింగ్‌లో దెబ్బతిన్న ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఇక మన దళాల సంసిద్ధతను ఆయన పర్యవేక్షించనున్నారు. దీనిలోభాగంగా చినార్ కోర్ ప్రధాన కార్యాలయాన్ని ఆయన సందర్శించి.. ఆర్మీ, వాయుసేన సిబ్బందితో మాట్లాడనున్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణ మంత్రి జమ్మూకశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. అంతకుముందు ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది కూడా జమ్మూకశ్మీర్‌లోనే పర్యటించారు. ఆయన నేడు చినార్‌కోర్‌లోని డాగర్స్ డివిజన్‌లోని అన్ని ర్యాంకుల అధికారులతో సమావేశమయ్యారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సరిహద్దుల వద్ద నిర్భయంగా, అప్రమత్తంగా ఉన్నారని అభినందించారు.

## కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు

చేసినందుకు ముందుగా క్షమాపణలు చెప్పాలని మధ్యప్రదేశ్ మంత్రిని సుప్రీం ఆదేశించింది.ముందు వెళ్లి హైకోర్టులో క్షమాపణలు చెప్పండి. ఇలాంటి అంశాల్లో కాస్త సున్నితంగా వ్యవహరించండని ఆగ్రహం వ్యక్తంచేసింది.దపాకిస్థాన్‌తో పోరుకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడిస్తూ వచ్చిన సైనికాధికారి కర్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. హైకోర్టు ఆదేశాల మేరకు ఆయనపై కేసు కూడా నమోదైంది. ప్రస్తుతం ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. హైకోర్టు ఆదేశాలపై ఆయన అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మంత్రి పిటిషన్‌ను శుక్రవారం విచారించేందుకు కోర్టు అంగీకరించింది. అంతేగాకుండా ఆయన తీరును తప్పుపట్టింది. ఎలాంటి మాటలు మాట్లాడుతున్నారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి మీడియాకు వివరాలను వెల్లడించిన కర్నల్ ఖురేషీని ఉద్దేశిస్తూ ఆమెను 'ఉగ్రవాదుల సోదరి' అని విజయ్ షా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఇదికాస్త తీవ్ర దుమారం రేగడంతో మంత్రి వ్యాఖ్యలను హైకోర్టు బుధవారం సుమోటోగా తీసుకుంది. శత్రుత్వం, విద్వేషాన్ని ప్రోత్సహించినందుకు ఆయనపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాలని జస్టిస్ అతుల్ శ్రీధరణ్, జస్టిస్ అనురాధా శుక్లాలతో కూడిన ధర్మాసనం పోలీసులను ఆదేశించింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసి తమకు నివేదించాలని రాష్ట్ర డీజీపీని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ... దేశంలో ఇంకా సమగ్రత, క్రమశిక్షణ, త్యాగం, నిస్వార్థం, గౌరవం, అజేయమైన ధైర్యం నిండి ఉన్న సంస్థ ఒక్క సైన్యం మాత్రమేనని పేర్కొన్నారు. అటు జాతీయ మహిళా కమిషన్ కూడా మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న మహిళలపై ఇటు-వంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొంది. మంత్రి చేసిన వ్యాఖ్యలపై భాజపా సీనియర్ నాయకుడు ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ స్పందించారు. విజయ్ షాను 'మూర్ఖుడు' అని ఆయన సంబోధించారు. మరోవైపు విజయ్ షాపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రధాని మోదీని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది.

## కంచెగచ్చిబౌలి భూముల్లో పర్యావరణం పునరుద్ధరించండి

న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా? అనేది స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. లాంగ్ వీకెండ్ చూసి ఎందుకు చర్యలు మొదలు పెట్టారని ధర్మాసనం మరోసారి ప్రశ్నించింది. నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలంది. కేంద్ర సాధికార సంస్థ దాఖలు చేసిన నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది సమయం కోరారు. పర్యావరణానికి జరిగే నష్టాన్ని పూడ్చే చర్యలు చేపట్టకపోతే సీఎస్ సహా కార్యదర్శులు జైలుకు పోవాల్సి ఉంటుందని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా విజిల్ బ్లోయర్స్, విద్యార్థులపై కేసుల విషయాన్ని పలువురు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసులు కొట్టివేయాలని అప్లికేషన్ దాఖలు చేసినట్లు- తెలపగా.. ఈ పిటిషన్‌తో కలిపి విచారించడం కుదరదని సీజేఐ స్పష్టం చేశారు. కావాలనుకుంటే వేరే పిటిషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు. అనంతరం తదుపరి విచారణను జులై 23కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం విచారణ జరిపింది. హెచ్‌సీయూలో 120 ఎకరాల్లో చెట్ల కూల్చివేత విధ్వంసంపై సుప్రీం కోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని మే 15 వరకు పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా కోర్టు విచారణ జరిపింది. హెచ్‌సీయూలో విధ్వంసానికి సంబంధించిన వివరాలన్నింటిని పరిశీలించడానికి ఏప్రిల్ 10న సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ- హెచ్‌సీయూ విధ్వంసాన్ని పరిశీలించింది. అక్కడి విద్యార్థి సంఘాల నాయకుల అభిప్రాయాలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, రాజకీయ నాయకుల ఒపీనియన్స్ సైతం సేకరించింది. కాగా, అక్కడ జరిగింది విధ్వంసమే.. చెట్లు-, జంతువులకు తీవ్ర నష్టం వాటిల్లిందని నివేదికను ఏప్రిల్ 15న కమిటీ- సుప్రీం కోర్టుకు సమర్పించింది. అదే రోజు ప్రభుత్వం సైతం నివేదిక ఇవ్వాలని సుప్రీం కోర్టు కోరింది. ఇదే సమయంలో మే 15 వరకు మీరు హెచ్‌సీయూ అడవుల్లో కూల్చిన చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని కోర్టు ప్రశ్నించింది. గతంలో విచారణ సమయంలోనూ తెలంగాణ ప్రభుత్వం సరైన నివేదిక ఇవ్వాలని.. అలా ఇవ్వకపోతే సీఎస్‌ను జైలుకు పంపాల్సి వస్తుందని హెచ్చరించిన విషయం విధితమే. చెట్లను నాటడానికి ఏ విధమైన పద్ధతులను అనుసరిస్తారో చెప్పాలంటూ సూచించింది. ఈ విషయంలో ప్రభుత్వం, సీఎస్‌ను ఎవరినీ కూడా ఉపేక్షించబోమని హెచ్చరించింది.

## యాదాద్రిని దర్శించుకున్న సుందరాంగులు

**యాదగిరిగుట్ట,మే15( వెలుతురు):**

మిస్‌వరల్డ్ పోటీ కోసం హైదరాబాద్ చేరుకున్న అందగత్తెలు వివిధ ప్రాంతాలను సందర్శిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ గెస్ట్‌హౌస్ నుంచి బ్యాటరీ వాహనాల్లో చేరుకున్న సుందరీమణులు అఖండ దీపారాధన మండపంలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి వెంట ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులు, జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలయ ఏఈవో భాస్కర్ తదితరులు ఉన్నారు. అక్టోపస్, తెలంగాణ స్పెషల్ పోలీస్, ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది భద్రతను పర్యవేక్షించారు. టూరిజం విలేజ్‌గా గుర్తింపు తెచ్చుకున్న పోచంపల్లిని ఆఫ్రికా ఖండానికి చెందిన 25 దేశాల మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. వారికి స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఇక్కత్ చీరల ప్రత్యేకత, తయారీ విధానాన్ని విదేశీ అతిథులు పరిశీలించారు. పలువురు భామలు స్వయంగా చీరలను నేసి సంబరపడ్డారు.

# రైతులను దోపిడి చేయడం రేవంత్ సర్కార్ లక్ష్యమా..?

- ఒక పథకం ప్రకారమే దోపిడి జరుగుతుంది
- ఉత్తమ కుమార్ రెడ్డి దృష్టికీ తీసుకెళ్తే చెవిటోడు ముందు శంఖం ఊదినట్టే ఉంది
- ప్రభుత్వం రైతులపై కక్ష్య సాధింపులు చేస్తోంది
- రాష్ట్రంలో 1.30 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుంది
- అందులో 13 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతులనుంచి అదనంగా తరుగు పేరుతో దోపిడీ చేస్తున్నారు
- ధాన్యం కొనుగోలులో రెండు సీజన్లకు 6 వేల కోట్ల దోపిడి జరుగుతోంది
- ఈ దోపిడీని ఏ ట్యాక్షితో పిలవాలో చెప్పాలి
- 6 వేల కోట్లలో ముఖ్యమంత్రికి ఎంత ముడుతుంది, ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎంత ముడుతుంది, ఢిల్లీకి ఎంత ముడుతుందో ప్రజలకు సమాధానం చెప్పాలి
- మిల్లర్లపై, పౌర సరఫరా అధికారులపై చర్యలు ఎందుకు చేపట్టడం లేదు
- ధాన్యం కొనుగోలు కుంభకోణంపై సిబిఐ విచారణకు ఆదేశాలు ఎందుకు ఇవ్వడం లేదో ప్రభుత్వం చెప్పాలి
- తరుగు పేరుతో జరుగుతున్న దోపిడి ఎవరి జేబుల్లోకి వెళ్తుంది..?
- గత కేసీఆర్ పాపాలు ప్రభుత్వం ఎందుకు మోసుకు తిరుగుతున్నదో సమాధానం చెప్పాలి
- కేసీఆర్ పాపాలపై విచారణకు ఆదేశాలివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం
- ధాన్యం కొనుగోలులో మిల్లర్ల భారీ దోపిడీ తరుగు పేరుతో మిల్లర్లు చేస్తున్న దోపిడీ రూ.మూడు వేలకోట్లు. ఇందులో సగం వాటా మంత్రి ఉత్తమ్, సీఎం రేవంత్ రెడ్డిలదే.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకునేందుకు వచ్చిన రైతులకు అనుకూల వాతావరణం లేదని, ఇవి పూర్తిగా లాభాపేక్ష తప్ప రైతుకు మేలు చేయాలన్న ఆలోచనతో లేవని, అందుకే ఐకెపి ఆధ్వర్యంలోనే ఎక్కువ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. చాలా కొనుగోలు కేంద్రాల్లో వడ్లను కాంటాకు వేయకుండా 10 నుంచి 15 రోజుల పాటు జాప్యం చేస్తున్నారు. ఒకవేళ కాంటాకు వేసినా, ఆ ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు ఉండడం లేదు. ఇలా కొనుగోలు ప్రక్రియ జాప్యమవుతోందని, కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి వసతులు ఉండటం లేదని, దాంతో రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని బిజెపి నేతలు కలెక్టర్లు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం, పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేదు. ముఖ్యమంత్రి, మంత్రుల నుంచి కింది స్థాయి అధికారుల వరకు రైతులంటేనే నిర్లక్ష్యం, చిన్నచూపు. ధాన్యం కాంటా వేయడానికి జాప్యం అవుతుండడంతో రైతులు రాత్రింబవళ్లు కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు పడాల్సి వస్తోంది. గన్నీ బ్యాగులు లేవని, లారీలు వస్తలేవనే సాకులు చెప్తూ ధాన్యం కొనుగోలు చేయకుండా జాప్యం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో వర్షమొస్తే దాన్యంపై కప్పడానికి టార్పాలిన్లు లేవు. ఆ ధాన్యం తడిస్తే మళ్లీ తేమ శాతం ఎక్కువైందని ధాన్యం కోనుగోలు చేయకుండా నిరాకరిస్తున్నారు. ఇలా అన్ని రకాలుగా రైతులను కాంగ్రెస్ సర్కారు అరిగోసపెడుతోంది. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎండ వేడికి తాలలేక సేద తీరే ఏర్పాట్లు లేక పోవడంతో వడదెబ్బ తాకిడికి తమ ధాన్యం కుప్పలపైనే చనిపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో వడదెబ్బకు చనిపోతున్న రైతుల మరణాలన్నీ రేవంత్ సర్కారు హత్యలే. ఇలా మరణించిన వారి కుటుంబాలకు రూ.30 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. కొనుగోలు కేంద్రాలలో వడ్లను కాంటాకు వేయడం జాప్యం అవుతోందని, రైతులు వడ్లను తమ కల్లాల్లోనే నిల్వపెట్టుకోవడం వల్ల అకాల వర్షాలతో ధాన్యం తడిసి పాడవుతోంది. దాంతో తేమ శాతం ఎక్కువగా ఉందని కొనుగోలు కేంద్రాల్లో వడ్లను కాంటా వేయడానికి నిరాకరిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా బస్తాలు కూడా ఉండడం లేదు. కేంద్రంలోని మోదీ సర్కారు బస్తాలకు, ఇతర అంశాలకు నిధులు ఇస్తున్నప్పటికీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులను ఏర్పాటు చేయకపోవడం దుర్మార్గం. ధాన్యం కొనుగోలు విషయంలో తేమ, తాలు పేరుతో కోనుగోలు కేంద్రాల్లోనే కాదు మిల్లర్లు కూడా కలిసి మొత్తానికి క్వింటాలుకు 10 కిలోలకుపైగా కోత పెడుతున్నారు. అదే సన్నరకం వడ్లయితే 16 కిలోల వరకు తరుగు పేరుతో కోత పెడుతున్నారు. అంటే రైతులు పండించిన వరి ధాన్యంలో పదిశాతం ఇలా తరుగు పేరుతో నష్టపోతున్నారు. తేమ, తాలు పేరుతో ఎలాంటి కోతలు ఉండవని ముఖ్యమంత్రి చెప్పినప్పటికీ అది ఆచరణలో అమలు కావడం లేదు. రైతులను దోపిడీ చేసే ప్రక్రియ యధేచ్ఛగా సాగుతోంది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి టాక్స్ ల పై ఉన్న శ్రద్ధ ధాన్యం కోనుగోలు కేంద్రాల్లో రైతులు అవస్థలు పడకుండా, దోపిడీకి గురికాకుండా నివారించడంపై లేదని తాజా పరిస్థితులను బట్టి స్పష్టమవుతోంది రాష్ట్రంలో ప్రస్తుత యాసింగి సీజనులో 130 లక్షల టన్నుల వరి ధాన్యం దిగుబడి అయితే అందులో పదిశాతం తేమ, తాలు పేరుతో కోత పెడుతుండడం వల్ల రైతులు సుమారు 13 లక్షల టన్నుల ధాన్యాన్ని కోల్పోవాల్సి వస్తోంది. మిల్లర్లు చేస్తున్న ఈ దోపిడీని రేవంత్ సర్కారు కట్టడి చేయడంలో విఫలమైంది. అందుకే రైతులు రోడ్లెక్కి నిరసన ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సి వస్తోంది. ఈ దోపిడీని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి ఎందుకని ఆపలేకపోతున్నారు. మిల్లర్లతో మంత్రి, సీఎం కుమ్మక్కయ్యారా, మిల్లర్లు ఇచ్చే కమిషన్లకు కక్కుర్తి పడి రైతులకు ద్రోహం చేస్తున్నారా తరుగు పేరుతో రైతులు సుమారు 13 లక్షల టన్నుల ధాన్యాన్ని కోల్పోతున్నారు. ధాన్యం క్వింటాలుకు రూ.2200, అంటే టన్నుకు రూ.22వేలు. 13 లక్షల టన్నులు X రూ.22 వేలు = రూ.2,860 కోట్లు. అంటే ఈ యాసింగిలో ధాన్యం తరుగు పేరుతో మిల్లర్లు చేస్తున్న దోపిడీ మొత్తం రూ.మూడు వేల కోట్లు. ఇందులో మంత్రి, సీఎంలది 50శాతం వాటా అనే అనుమానాలున్నాయి. అంటే ధాన్యం కొనుగోలులో మంత్రి, సీఎంలు కలిసి దోచుకుంటున్నది రూ.1500కోట్లు. ఇది ప్రతి సీజనుకు జరుగుతున్న దోపిడీ. అందుకే ఈ తరుగు దోపిడీపై మంత్రి ఉత్తమ్, సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం లేదు. ధాన్యం కోనుగోళ్ల అంశంలో రైతులకు న్యాయం చేయడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైంది. రైతులను దోపిడీ నుంచి కాపాడలేకపోతున్న పౌరసరఫరాల శాఖ మంత్రి ఒక్క క్షణం కూడా ఆ పదవిలో ఉండడానికి అనర్హుడు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలి.

సివిల్ సప్లయిస్ శాఖకు కొన్ని ప్రశ్నలు

నిబంధనల ప్రకారం సరైన టైముకు కస్టమ్ మిల్లింగ్ రైసును ఇవ్వని మిల్లర్లను డిఫాల్టర్ల జాబితాలో పెడుతున్నారా?... ఇప్పటి వరకు ఇలా ఎంత మంది మిల్లర్లు డిఫాల్టర్ల జాబితాలో చేరారు?. డిఫాల్టర్లయిన మిల్లర్లకు కూడా ఈ రబీ సీజన్ ధాన్యాన్ని లెవీ కోసం ఇచ్చినట్టు సమాచారం. అలా ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది. కొందరు మిల్లర్లు రెండేళ్లుగా కస్టమ్ మిల్లింగ్ రైసును ఇవ్వని విషయం వాస్తవమేనా? ఇంకా ఎన్ని లక్షల టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి రావాల్సి ఉంది? ఈ బియ్యం విలువ ఎన్ని వేల కోట్లు ఉంటుంది? జాప్యం చేసిన మిల్లర్ల నుంచి జరిమానా వసూలు చేశారా? ... చేస్తే ఎంత మేరకు చేశారు? ఎంత మంది మిల్లర్లపై కేసులు నమోదు అయ్యాయి? సరైన టైముకు సిఎంఆర్ ఇవ్వకుండా మోసాలకు పాల్పడిన మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేశారా?... ఎంత మేరకు రెవెన్యూను రికవరీ చేశారు. ఈ చట్టం నుంచి కూడా తప్పించుకునేలా మిల్లర్లు ఎలాంటి ఎత్తుగడలు వేస్తున్నారు?, అందుకు కౌంటరుగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది? మిల్లర్లు సకాలంలో కస్టమ్ మిల్లింగ్ రైసు ఇవ్వకుండా తీరిగ్గా ఏడాది తర్వాత పిడిఎస్ బియ్యాన్ని కిలో పది రూపాయలకు కొనుగోలు చేసి, వాటిని సిఎంఆర్ గా రీసైక్లింగ్ చేస్తున్నది వాస్తవం కాదా? ఇలా మిల్లర్లు ప్రభుత్వాన్ని మోసం చేస్తూ పాల్పడుతున్న కుంభకోణం ఎన్ని వేల కోట్లు ఉంటుందని అంచనా?

కొందరు మిల్లర్లు ఇలా అప్పగిస్తున్న సీఎంఆర్ బియ్యం పి.డి.ఎస్. రీసైక్లింగ్ బియ్యం కాదని చెప్పే నైపుణ్యత, టెక్నాలజీ సివిల్ సప్లయ్, ఎఫ్.సి.ఐ. అధికారుల వద్ద ఉన్నదా?

మిల్లర్లు చేస్తున్న ఈ మోసాల వల్ల సివిల్ సప్లయిస్ శాఖకు ఇప్పటి వరకు ఎంత నష్టం వచ్చింది? సివిల్ సప్లయిస్ శాఖ ప్రస్తుతం ఎంత మేరకు అప్పుల్లో ఉంది?... ఎటా ఎంత మేర వడ్డీలు చెల్లిస్తోంది?

సివిల్ సప్లయిస్ శాఖ ఇలా ఎన్నేళ్లుగా ఈ అప్పులు, నష్టాలను భరిస్తూ వస్తోంది? వీటిని తగ్గించుకునేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేంటి?...ఈ అప్పులు, నష్టాల ఊబి నుంచి సివిల్ సప్లయిస్ శాఖ ఎలా గట్టెక్కగలుగుతుంది?. ప్రభుత్వం ముందున్న యాక్షన్ ప్లానేంటి?

గత ఏడాది టెండర్లు ఖరారు అయిన 35 లక్షల మెట్రిక్ టన్నుల వేలం ధాన్యంలో ఇప్పటి వరకు బిడ్డర్లు 20 లక్షల టన్నుల ధాన్యం విలువ టన్నుకు రూ.రెండు వేల చొప్పున రూ.మూడున్నర వేల కోట్లు మాత్రమే ప్రభుత్వానికి జమ చేసినట్టు సమాచారం. మొత్తం రూ.ఏడు వేల కోట్లలో ఏడాది కాలంలో సగమే రికవరీ అయింది కదా, మరి మిగిలిన సగం రూ.మూడున్నర వేల కోట్ల సంగతేంది.

టెండర్లు దక్కించుకున్న బిడ్డర్లు నిబంధనల ప్రకారం 23 మే 2024 లోపల మెటీరియల్ ను లిఫ్టు చేయాలి. మరి గడువు ముగిసింది ఏడాదవుతోంది కదా...మెటీరియల్ లిఫ్ట్ చేయకుంటే టెండర్ నిబంధన ప్రకారం వారికిచ్చిన కాంట్రాక్ట్ ని రద్దు చేసి ఈఎండీని ఫోర్ ఫిట్ చేస్తామని ప్రభుత్వం చెప్పింది కదా. మరి చేసిందా. ఏడాది పాటు రికవరీ కాకపోవడానికి బాధ్యులు ఎవరు

బీఆర్ఎస్ తమ పదేళ్ల పాలనలో పౌర సరఫరాల శాఖను నాశనం చేసిందని, 58 వేల కోట్ల అప్పులు, 11 వేల కోట్ల నష్టాలు వచ్చాయని చెప్పిన మంత్రి ఉత్తమ్ ... మరి గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందో లేదో, భారీ స్థాయిలో అప్పులు, నష్టాలకు కారణమైన, వ్యవస్థను నాశనం చేసిన కేసిఆర్ సర్కారు వైఫల్యాలపై ఎందుకు విచారణకు ఆదేశించలేదు ... ఎందుకని కేసిఆర్ సర్కార్ పాపాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోస్తోంది ... దీని వెనకున్న మతలబేంటి....

# ఫీజురీయంబర్స్ మెంట్ బకాయిలు వెంటనే చెల్లించండి

- ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు మూతపడ్డాయి
- ప్రభుత్వం రీయంబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంతో ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు
- విద్యార్థులకు, కాలేజీ యాజమాన్యాల మధ్య గొడవలై పోలీస్ స్టేషన్ల దాకా కేసులు వెళుతున్నా పట్టించుకోరా?
- ఫీజు బకాయిలన్నీ వన్ టైం సెటిల్ మెంట్ చేస్తామని ఒకసారి, 12 వాయిదాల్లో చెల్లిస్తామని మీరు మాట ఇచ్చిన సంగతి మర్చిపోయారా?
- ఈ విద్యా సంవత్సరం నుండే విద్యార్థులకు చెల్లించే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలను ఆన్ టైంలోనే (నిర్ణీత వ్యవధిలో) చెల్లిస్తామని ఇచ్చిన హామీని విస్మరించారా?
- పవిత్రమైన శాసనసభ సాక్షిగా ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకపోతే ప్రజల్లో మీపై నమ్మకం సన్నగిల్లుతోంది
- ప్రభుత్వ నిర్లక్ష్యం లక్షలాది మంది విద్యార్థులను, కాలేజీ యాజమాన్యాలను, అందులో పనిచేస్తున్న సిబ్బందిని తీవ్రమైన మానసిక క్షోభకు గురి చేస్తున్నాయి
- డిగ్రీ కళాశాలలకు నాలుగేళ్లుగా ఫీజు రీయంబర్స్ మెంట్ చెల్లించకపోవడంతో కాలేజీలు నడపలేక చేతులెత్తేశాయి
- ఒక్క శాతవాహన వర్శిటీ పరిధిలోనే పదుల సంఖ్యలో డిగ్రీ కాలేజీలు మూతపడ్డాయి
- విద్యార్థుల భవిష్యత్తు, యాజమాన్యాల మనుగడను ద్రుష్టిలో ఉంచుకుని తక్షణమే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించండి



కూరుకుపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు సకాలంలో చెల్లించకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతో దాదాపు 8 వేల కోట్ల రూపాయలు బకాయిలుగా పేరుకుపోయాయి. ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు దిక్కుతోచని స్థితిలో పడిపోయాయి. అధ్యాపకులకు, సిబ్బందికి జీతభత్యాలు, మెయింటెనెన్స్ ఛార్జీలు కూడా చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. అప్పుల పాలయ్యారు. ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు రాక, చేసిన అప్పులు తీర్చలేక ఇప్పటికే అనేక కళాశాలలు మూతపడ్డాయి. ఫీజు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇచ్చేది లేదని ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు తెగేసి చెబుతుండటంతో విద్యార్థులు అటు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోలేక, ఇటు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం లేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే అనేక రూపాల్లో గత ప్రభుత్వ పెద్దలతోపాటు మీ ద్రుష్టికి కూడా తీసుకురావడం జరిగింది. "ప్రతి పేదవాడు కార్పొరేట్ స్థాయిలో ఉన్నత విద్యను అభ్యసించడానికి "ఫీజు రీయంబర్స్ మెంట్" ప్రవేశపెట్టిందే కాంగ్రెస్ పార్టీ. అవి రకరకాల కారణాలవల్ల వేల కోట్ల రూపాయలు మొండి బకాయిలుగా పేరుకుపోయాయి. ఈ బకాయిలను వన్ టైం సెటిల్ మెంట్ (ఓటీఎస్) కింద సెటిల్ చేసే బాధ్యతను మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తున్నా. ఇకపై ఈ విద్యా సంవత్సరం నుండే విద్యార్థులకు చెల్లించే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలను ఆన్ టైంలోనే (నిర్ణీత వ్యవధిలో) చెల్లిస్తానని మాట ఇస్తున్నా. ఈ మేరకు ఇక్కడి నుండే ఆర్థిక శాఖకు ఆదేశాలిస్తున్నా"అని గత ఏడాది జేఎన్ టీయూలో జరిగిన ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాల సమావేశంలో మీరు ఇచ్చిన హామీని గుర్తు చేస్తున్నా. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనూ "ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలను 12 భాగాలుగా విభజించి 12 నెలలపాటు చెల్లిస్తాం. ఇకపై ఈ విద్యా సంవత్సరం నుండే విద్యార్థులకు చెల్లించే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలను ఆన్ టైంలోనే (నిర్ణీత వ్యవధిలో) చెల్లిస్తాం"అని మీరు పవిత్రమైన శాసనసభ సాక్షిగా ఇచ్చిన హామీ సందర్భంగా ప్రస్తావిస్తున్నాను. మీరు హామీ ఇచ్చి నెలలు దాటినా నేటికీ ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలను చెల్లించనేలేదు. ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లిస్తామంటూ టోకెన్లు ఇచ్చి కూడా మొండి చేయి చూపడం బాధాకరం. ముఖ్యమంత్రి హోదాలో మీరు ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం అత్యంత దురద్రుష్టకరం. ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంవల్ల రాష్ట్ర ప్రభుత్వంపట్ల ప్రజల్లో నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఏర్పడింది. ఈ విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం లక్షలాది మంది విద్యార్థులను, కాలేజీ యాజమాన్యాలను, అందులో పనిచేస్తున్న సిబ్బందిని తీవ్రమైన మానసిక క్షోభకు గురి చేస్తున్నాయి. డిగ్రీ కళాశాలలకు నాలుగేళ్లుగా ఫీజు రీయంబర్స్ మెంట్ చెల్లించకపోవడంతో కాలేజీలు నడపలేక చేతులెత్తేశాయి. లక్షల మంది డిగ్రీ విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితంగా ఒక్క శాతవాహన వర్శిటీ పరిధిలోనే పదుల సంఖ్యలో డిగ్రీ కాలేజీలు మూతపడ్డాయి. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం కీలకమైన విద్యా వ్యవస్థపట్ల, విద్యార్థులపట్ల, కళాశాలల యాజమాన్యాలపట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి క్షమించరానిది. ఇకనైనా విద్యార్థుల భవిష్యత్తు, యాజమాన్యాల మనుగడను ద్రుష్టిలో ఉంచుకుని తక్షణమే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతున్నాము. లేనిపక్షంలో జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలియజేస్తున్నాం.

## పలు బీసీ సమస్యలపై కేటీఆర్ ను కలిసిన బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతల రాంమూర్తి గౌడ్



**హైదరాబాద్ వెలుతురు మే 15:**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ కమిషన్ మాజీ మెంబర్ కే, కిషోర్ గౌడ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసిన బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతల రామ్మూర్తి గౌడ్ బీసీలకు 42%రిజర్వేషన్ల ప్రక్రియను చట్టబద్ధత కల్పించకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే లాగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురవాలని కేటీఆర్ కు రామ్మూర్తి గౌడ్ విజ్ఞప్తి చేశారు, స్పందించిన కేటీఆర్ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా చట్టబద్ధత చేయకుండా ఎన్నికలు నిర్వహిస్తే బీసీలు చేయబోయే పోరాటానికి టిఆర్ఎస్ పార్టీ మద్దతు ఉంటుందని కచ్చితంగా ఎటువంటి పోరాటానికైనా టిఆర్ఎస్ పార్టీ ముందుంటుందని కేటీఆర్ చెప్పారు, ఈ కార్యక్రమంలో ఈడబ్ల్యూఎస్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుస ప్రభాకర్ రెడ్డి, కళ్యాణ్ పాల్గొన్నారు.

## రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్

- ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దురుసు
- నటుడు బెల్లంకొండ శ్రీనివాస్‌పై కేసు



**హైదరాబాద్,మే15( వెలుతురు):**
తనపై నమోదైన కేసు విషయంలో నటుడు బెల్లంకొండ శ్రీనివాస్ గురువారం పోలీసుల విచారణకు హాజరయ్యారు. అవసరం ఉన్నప్పుడు కోర్టు విచారణకు హాజరు కావాలని నటు-డికి పోలీసులు సూచించారు. శ్రీనివాస్ కారును సీజ్ చేసి, నోటీసులు ఇచ్చి పంపారు. జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టుల కాలనీలో నివాసం ఉంటున్న బెల్లకొండ శ్రీనివాస్ ఇంటికి వెళ్తున్న సమయంలో రాంగ్ రూట్‌లో కారు నడిపినట్లు- పోలీసులు గుర్తించారు. తనని అడ్డుకున్న ట్రాఫిక్ పోలీసుతో ఆయన దురుసుగా ప్రవర్తించారు. దీంతో, ఆయనపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయిన సంగతి తెలిసిందే. టాలీవుడ్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్‌కు జూబ్లీహిల్స్ పోలీసులు నోటీ-సులు ఇచ్చారు. ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడని ఇప్పటికే కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు, వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు. ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా బెల్లంకొండ శ్రీనివాస్ వ్యవహరించినట్లు ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే శ్రీనివాస్ కారును పోలీసులు సీజ్ చేసినట్లు- తెలుస్తోంది. ఈనెల 13న రోడ్ నెంబర్ 45 మీదుగా జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీలోని చౌరస్తా వద్ద హీరో బెల్లంకొండ శ్రీనివాస్ రాంగ్‌రూట్‌లో తన నివాసానికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, అదే సమయంలో అక్కడ ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న నరేష్ అనే కానిస్టేబుల్ బెల్లంకొండ శ్రీనివాస్ వాహనాన్ని అడ్డుకున్నారు. రాంగ్ రూట్‌లో వెళ్లొద్దంటూ ఆయనకు సూచించారు. అయితే, కానిస్టేబుల్ చెబుతున్నప్పటికీ కూడా బెల్లంకొండ శ్రీనివాస్ ఏమాత్రం వినకుండా రాంగ్ రూట్‌లోనే ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు బెల్లంకొండ శ్రీనివాస్‌కు మధ్య వాగ్వివాదం జరిగింది. కారును ఆపేందుకు ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రయత్నించగా.. ఆయన మీదుగానే కారును పోనిచ్చేందుకు హీరో యత్నించారు. ఇదే సమయంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో హీరోపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేలా కర్ణాటక తరహాలో రాష్ట్రంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల విధానం

ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఐదు వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోబోతున్నామని తెలిపారు. ఇందుకోసం ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసి తెలంగాణ సర్వే శిక్షణా అకాడమీలో శిక్షణ ఇస్తామని అన్నారు.

కర్ణాటక రాష్ట్రంలో అమలు అవుతున్న లైసెన్స్‌డ్ సర్వే విధానంపై ఇటీవల సర్వే విభాగానికి సంబంధించిన ఇద్దరు ఉన్నతాధికారులు అధ్యయనం చేసి నివేదిక ఇవ్వడం జరిగిందని, ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

కర్ణాటక రాష్ట్రప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్ పథకం 1999 లో కర్ణాటక ల్యాండ్ రెవెన్యూ చట్టంలో చేసిన సవరణలతో ప్రారంభమై, 2005-06 నుంచి అమలులోకి వచ్చిందని ఈపథకం ద్వారా భూముల రిజిస్ట్రేషన్‌కు ముందు మ్యూటేషన్ స్కెచ్ (PMS) తయారు చేయబడుతుందని, ప్రీ-రిజిస్ట్రేషన్ స్కెచ్‌తో కొనుగోలు చేయబోయే భూమి గురించి విస్తీర్ణం మరియు టైటిల్ వంటి స్పష్టమైన భూసరిహద్దు వివరాలు ఉంటాయని అధికారులు గురువారం నాడు మంత్రి గారికి వివరించారు.

ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలో 6000 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు ,4000 మందిప్రభుత్వ సర్వేయర్లు సేవలందిస్తున్నారని ఒక్కో లైసెన్స్‌డ్ సర్వేయర్ కు నెలకు సగటున 23 దరఖాస్తులు వస్తాయని దీని ద్వారా అతనికి నెలకు 25 వేల నుండి 30 వేల ఆదాయం వస్తుందని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు నిర్వహించి, రిజిస్ట్రేషన్ కు ముందు స్కెచ్ తయారుచేసి పోర్టల్లో అప్ లోడ్ చేస్తారు. వీరిపనులను ప్రభుత్వసర్వేయర్లు పరిశీలించి, సంబంధిత అధికారి (AD, S&LR) ఆమోదిస్తారు. ఈ పథకంద్వారా భూలావాదేవీలు మరింత సమర్థవంతంగా, శాస్త్రీయంగా సాగుతున్నాయని అధికారులు వివరించారు.

దీనిపై మంత్రి గారు స్పందిస్తూ తెలంగాణ రాష్ట్రంలో శాశ్వతంగా భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని , ఈ భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియకు భూమి సర్వే మ్యాపును జత పరచడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ విధానం అమలు జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో ఆయా మండలాల్లో భూలావాదేవీలు, భూ విస్తీర్ణాన్ని బట్టి సర్వేయర్లను నియమించాలని అధికారులకు సూచించారు.

కర్ణాటక రాష్ట్రంలో దాదాపు 20 ఏళ్ల క్రితం నియమితులైన సర్వేయర్లు కొనసాగుతునే ఉన్నారని ఇక్కడ కూడా అదే విధానాన్ని అవలంభించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలను గాలికి వదిలేసింది. అందాల భామల వెంటపడుతుంది..!?

### మీడియా సమావేశంలో మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్



**హైదరాబాద్ వెలుతురు మే 15:**
రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలను గాలికి వదిలేసి అందాల పోటీలతో , అందాల భామల వెంట పడుతుందని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఘాటుగా విమర్శించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడిన ముఖ్యంశాలు ఏమిటంటే.... అందాల పోటీలకు బిజెపి వ్యతిరేకం కాదు. చాలా దేశాల్లో, రాష్ట్రాల్లో అందాల పోటీలు జరుగుతుంటాయి, అయితే అక్కడున్న ముఖ్యమంత్రులు లేదా ప్రధాని ఆ పోటీల్లో పాల్గొనరు, కేవలం టూరిజం పరంగా మద్దతు తెలుపుతారు. కానీ తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్నదాతలను వదిలేసి, అందాల భామల పోటీలను నిర్వహిస్తోంది. కాని రాష్ట్రంలో రైతులను గాలి, ఎండ, వర్షాలకు ముప్పుపెట్టింది. రైతుల పట్ల వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని బిజెపి తీవ్రంగా ఖండిస్తోంది. ఇప్పటికైనా రైతులు కష్టపడి పండించిన పంటలను వెంటనే కొనాలని బీజేపి డిమాండ్ చేస్తోంది. రాష్ట్రంలో చాలా చోట్ల నెలల కొద్దీ, వారాల కొద్దీ ధాన్యం కుప్పలు, వర్షాలు, ఐకేపీ సెంటర్లలో రైతుల తిప్పలు, మరణాలు జరుగుతున్నాయి. వ్యవసాయ శాఖ మంత్రి చెప్పిన వివరాల ప్రకారం... రబీలో 80 లక్షల ఎకరాల్లో పంట పండింది, అందులో 60 లక్షల ఎకరాల్లో వరి పండింది. ఇప్పటివరకు 43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. 60 లక్షల ఎకరాలకు సగటుగా 2.17 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. అందువల్ల రబీ పంట ద్వారా తెలంగాణలో 1 కోటి 30 లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి జరిగింది. ప్రభుత్వం సేకరించిన ధాన్యం కేవలం 43 లక్షల మెట్రిక్ టన్నులే, ఇంకా 87 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. రైతుల ధాన్యం అకాల వర్షాలు, ఎండకు ముంచెత్తి, టార్పాలిన్లు, కాంటాలు లేక రైతులు తీవ్రమైన అవస్థలో ఉన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడదు, మొత్తం కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షిస్తుంది. కనీస మద్దతు ధర, మండీ హమాలీ ఛార్జీలు, ట్రాన్స్ పోర్టేషన్, ఐకేపీ సెంటర్లు, రైతు సంఘాలు, మార్కెట్ యార్డులు, గోడౌన్ల ఛార్జీలు, అధికారుల ఛార్జీలు, వడ్ల బస్తాలు, గన్నీ బ్యాగులు వంటి ఖర్చులు కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేవలం దళారి వంటిది. రైతు భరోసా ఇంకా ఇవ్వలేదు, 4 ఎకరాలకు పైగా పంట పండించిన రైతులకు రైతు భరోసా లేదు. బోనస్ విషయం కూడా బోగస్ అయింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతుల పంటను కొనుగోలు చేసి, మిల్లులకు తరలించాలని బీజేపి డిమాండ్ చేస్తోంది. యుద్ధం చేయకుండానే యుద్ధం గెలవడం అన్నది కౌటిల్యుడు అర్థశాస్త్రంలో చెప్పిన ఒక మహత్తర సిద్ధాంతం. ప్రధాని మోదీ గారు కూడా అదే విధంగా పాకిస్థాన్, చైనా పై ఇండైరెక్ట్ యుద్ధం సాగించారు. ఆపరేషన్ సిందూర్: ఇది సీజ్ ఫైర్ కాదు, "పాస్ ఇన్ ద ఫైర్" ఆపరేషన్. భారత సైన్యం ద్వారా పాకిస్థాన్, చైనా పై ఘన గుణపాఠం చెప్పడం జరిగింది. ఖర్చు: భారత్ రూ. 11,000 కోట్లు, పాకిస్థాన్ నష్టం రూ. 32,000 కోట్లు (రూ. లక్షకోట్ల రూపాయల నష్టం). పాకిస్థాన్ టెర్రర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ పూర్తిగా నాశనమైంది. ఆపరేషన్ సిందూర్ తో Made in India డిఫెన్స్ సామర్థ్యం, భారతీయ డిఫెన్స్ ఎక్విప్మెంట్ పై వివిధ దేశాలకు మరింత నమ్మకం పెరిగింది. భారత్ అమెరికా, రష్యా, ఫ్రాన్స్, చైనా తర్వాత ఐదు ప్రధాన డిఫెన్స్ ఎక్స్పోర్టర్ దేశాలలో ఒకటైంది. 2013లో భారతదేశం రూ. 600 కోట్లు ఎగుమతి చేస్తుండగా, ఇప్పుడు రూ. 25,000 కోట్లు. భారతదేశంలో 2014కి ముందు 1,500 మంది ఉగ్రదాడుల్లో మరణించారు. 2014 తర్వాత మోదీ గారి నాయకత్వంలో ఉగ్రవాద ఘటనలు తగ్గాయి. 2014కి ముందు జమ్ము కశ్మీర్ లో 25,000 మంది మరణించగా, 2014 తర్వాత 1,400 మంది మాత్రమే. ఆపరేషన్ సిందూర్ ద్వారా 100కు పైగా టెర్రరిస్టులు, 50కు పైగా పాక్ సైనికులు చనిపోయారు. పాకిస్థాన్ కేవలం 23 నిమిషాల లోనే కాళ్ల బేరానికి వచ్చింది. పాకిస్థాన్ అగ్రికల్చర్, ఇండస్ట్రీస్ పూర్తిగా ఇండస్ నదులపై ఆధారపడి ఉన్నాయి. భారత ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల పాకిస్థాన్ కు రూ.10,000 కోట్లకు పైగా క్రాప్ డ్యామేజ్ తగిలింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో 3 సంవత్సరాల్లో రష్యాకు రూ.1,45,00,000 కోట్లు ఖర్చు అయితే, భారత్-పాక్ మధ్య నెల యుద్ధం రూ. 8,00,000 కోట్లు. భారతదేశం ఇండస్ నదులని ఉపయోగించి 35,000 మెగావాట్ల హైడ్రో ఎలక్ట్రిసిటీ ఉత్పత్తి చేయవచ్చు. జమ్ము కశ్మీర్, పంజాబ్, హర్యానా, గుజరాత్ రాష్ట్రాలకు అదనంగా నీటిని మళ్లించవచ్చు. పాకిస్థాన్ ను నీటికి గాలిచేసి ఎడారి చేయవచ్చు. ప్రధాని మోదీ గారి నాయకత్వం.....

యుద్ధం ఆవేశంతో కాదు, ఆలోచనతో, చాణక్య నీతితో చేశారు. అందుకే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు పాకిస్థాన్ దొంగదెబ్బకు .. దెబ్బకొట్టి చాణక్య నీతితో భారత్ ను గెలిపించారు. మన జవాన్లకు మద్దతుగా, వారి త్యాగాలను గౌరవించుకునేలా... త్రివిధ దళాలకు సెల్యూట్ చేస్తూ మే 17న శనివారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద 'మనం సైతం దేశం కోసం' తిరంగా ర్యాలీ నిర్వహించబోతున్నాం. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, కులాలు, మతాలకు అతీతంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాం. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు అనేక రకాల హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించింది. ఉద్యోగులకు చట్టబద్ధంగా రావాల్సిన డీఏలు, జీపీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అడిగితే బ్లాక్మెయిల్ చేస్తున్నట్టు ప్రవర్తిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేతగాకపోతే వెంటనే దిగిపోవాలి. పవర్ కావాలి.. పైసలు అవినీతి ద్వారా సంపాదించాలి. కాని ఉద్యోగులను చూసుకునే బాధ్యత మాత్రం మర్చిపోతోంది. లేదంటే కేంద్ర ప్రభుత్వాన్ని చూసుకోమని చెప్పడం సిగ్గుచేటు. ఉద్యోగులను చూసుకోవడంలో వారి హక్కులను రక్షించడంలో బాధ్యతను మర్చిపోతున్నారు. తమ ప్రభుత్వ పరిధిలో సమస్యలు ఎదురైనా కేంద్ర ప్రభుత్వాన్ని మదతు ఇవ్వమని అడగడం సిగ్గుచేటు వ్యవహారం. మోసపూరితమైన ప్రభుత్వం ఏదో అనేదానిపై ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తే, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి వందశాతం ఫైవ్ స్టార్ రేటింగ్ వస్తుంది. కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీకి బదులు అసదుద్దీన్ ఓవైసీని ప్రెసిడెంట్ చేసుకుంటే... అంతోఇంతో పాలిటిక్స్, జాతీయవాదం, దేశభక్తి విషయంలో భావసారూప్యత కాంగ్రెస్ తెలియవస్తుంది.

# తేలని తెలంగాణ బీజేపీ గమనం

**హైదరాబాద్ వెలుతురు మే 15**
కాంగ్రెస్ ను కప్పల తక్కెడ అని విమర్శించే బీజేపీ (BJP), తెలంగాణ విభాగం పార్టీ అంతర్గత వివాదాల్లో కాంగ్రెస్‌ను మించింది. కమలంలో ఎన్ని పువ్వు రేఖలున్నాయో అంత కన్నా ఎక్కువ గ్రూపులున్నా యని పార్టీ వర్గాలే నర్మగర్భ వ్యాఖ్య చేస్తాయి. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసి ఏడాదిన్నర కావస్తున్నా ఇంకా కొత్త అధ్యక్షుడిని నియమించుకోలేని పరిస్థితి! ఉన్న ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో... అత్యధికులు పార్టీ రాష్ట్ర అధ్యక్ష స్థానానికి పోటీ పడేవారే! వీరిలో ఒకరంటే మరొకరికి పడదు.
పార్టీ జాతీయ బాధ్యులు కుదించిన రెండు, మూడు పేర్ల జాబితాల్ని అధిష్ఠానానికి సమర్పించినట్టు సమాచారం. పోయినసారి ఎన్నికల్లోనే వెనుకబడిన వర్గాల (బీసీ) వ్యక్తిని తెలంగాణ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన బీజేపీ నాయకత్వం, అదే ఒరవడిలో బలమైన బీసీ సామాజికవర్గాలను మచ్చిక చేసుకునే 'సోషల్ ఇంజినీరింగ్'కు యత్నిస్తోంది. ముదిరాజ్, మున్నూరు కాపు (బీసీ), మాదిగ (ఎస్సీ) సామాజికవర్గాలకు ప్రాధాన్యంతో 'త్రీ-ఎమ్ ఫార్ములా'ను ముందుకు తోస్తోంది. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ (కరీంనగర్) పేర్లను అధినాయకత్వం సీరి యస్‌గా పరిశీలిస్తోందని అంటున్నారు. ఒకరు ముదిరాజ్ సామాజికవర్గానికి చెందితే మరొకరు మున్నూరు కాపు సామాజికవర్గం వారు. బండి సంజయ్ ఇది వరకు అధ్యక్షులుగా ఉండి ఇప్పుడు కేంద్రమంత్రిగా ఉన్నందున ఈటల రాజేందర్ వైపు అధినాయకత్వం కొంత మొగ్గింది. పార్టీలో తరచూ రగిలే పాత (తొలి నుంచి పార్టీలో ఉన్న), కొత్త (ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి వచ్చిన) నాయకుల మధ్య ఉండే స్పర్థ ఒక అడ్డంకిగా మారింది. పార్టీ పాత నాయకులు పలువురు ఈ ఆలోచనను వ్యతిరేకించారు.

దానికి తోడు పార్టీ నియమావళి ప్రకారం పదిసార్లకు తగ్గకుండా సాధారణ సభ్యుడిగా, కనీసం మూడు పర్యాయాలు క్రియాశీల సభ్యుడిగా ఉన్న వారిని మాత్రమే అధ్యక్షుడిగా నియమించాలని ఉంది. తమిళనాడు బీజేపీ రాష్ట్రాధ్య క్షుడిగా అన్నామలైని నియమించే విషయంలో లోగడ ఇటువంటి అడ్డంకే వచ్చింది. ఆయన 2017లో ఏఐఏడీఎంకే పార్టీ నుంచి బీజేపీలోకి వచ్చారు. పార్టీ నియమావళిని సడలించడం, పాత నాయకులకు నచ్చజెప్పడం ద్వారా అధిష్ఠానం ఒక నిర్ణయం చేయవచ్చు. అలా చేస్తుందా? అన్నది ప్రశ్న. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాన కార్యదర్శి సంతోష్ (సంస్థాగత వ్యవహారాలు), సునీల్ బన్సల్ (రాష్ట్ర ఇంచార్జీ) వారివైన నివేదికలు పై వారికి (మోదీ-షా ద్వయం) ఇచ్చారు.



తెలంగాణలో బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ, ఒక్క రాష్ట్రాధ్యక్ష ఎన్నిక మినహా దాదాపు పూర్తయింది. మండల, జిల్లా స్థాయి అధ్యక్షులు ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షులు ఎన్నికై రెండు, మూడు మాసాలవుతున్నా... రాష్ట్ర అధ్యక్ష ఎన్నికతో ముడివడి ఉండటం వల్ల జిల్లా కమిటీలు ఏర్పాటు కాలేదు. మండల స్థాయి కమిటీలు కూడా పూర్తిస్థాయిలో ఏర్పాటు కావాల్సి ఉంది. ఇవన్నీ పూర్తయితేనే సంస్థాగతంగా బలోపేతం చేసి, గ్రామ స్థాయి వరకు పార్టీని పటిష్ఠపరచి, స్థానిక సంస్థలకు సమాయత్తం చేయడానికి వీలవుతుంది. అన్ని స్థాయిల్లో మూడోవంతు మహిళలుండాలి. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కమిటీల్లోనూ 'త్రీ ఎమ్ ఫార్ములా'కు ప్రాధాన్యం ఇవ్వాలని నాయకత్వం భావిస్తోంది. రాష్ట్రాధ్యక్ష నియామకపు చిక్కుముడి వీడితే ఈ అన్నీ ఓ కొలిక్కివస్తాయి.
అంచనాల స్థాయిలో బీఆర్ఎస్ రాష్ట్రంలో పుంజు కోవట్లేదని భావిస్తున్న బీజేపీ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్రంలో తామే ప్రత్యామ్నాయమని భావిస్తున్నాయి. నిజంగానే ప్రజలు ఆ దిశలో ఆలోచించినా ఆ పరిస్థితిని సానుకూలంగా మలచుకునే స్థితిలో పార్టీ లేదని బీజేపీ వర్గాలే అంగీకరిస్తున్నాయి. 'త్రీ ఎమ్ ఫార్ములా'లో భాగమైన మాదిగలను ఆకట్టుకోవడానికి గత ఎన్నికల్లోనే మంద కృష్ణ మాదిగ ను అక్కున చేర్చుకొని ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణకు సానుకూలత ప్రకటించారు. సుప్రీంకోర్టు తీర్పు దరిమిలా, సదరు బాధ్యతను రాష్ట్రాలకు అప్పగిస్తూ కేంద్రం నిర్ణయించడం, రాష్ట్రంలో ఆ మేర చట్టం తీసుకురావడం జరిగిపోయాయి.
పార్టీని గెలిపిస్తే బీసీని సీఎంగా చేస్తామని ఎన్ని కల ప్రకటన చేస్తూ, సరిగ్గా ఎన్నికల ముందు బీసీ రాష్ట్రాధ్యక్షుడిని కారణం చెప్పకుండా అధిష్ఠానం పక్కకు తప్పించడాన్ని ఇప్పటికీ తప్పుబట్టేవారు పార్టీలో ఉన్నారు. అదే సమయంలో నాటి అసెంబ్లీ ఎన్నికల్లో ముక్కోణపు పోటీని నివారించి బీఆర్ఎస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయేలా చేసి, ఏడాది తర్వాత వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ముఖాముఖి తలపడి ఆధిక్యత తీసుకోవడం పార్టీ వ్యూహమని, అందుకే అలా చేశారని చెప్పేవాళ్లూ ఉన్నారు. వ్యూహాలు ఎత్తుగడల సంగతెలా ఉన్నా ఢిల్లీ నాయకత్వం స్థాయిలో రాష్ట్ర పార్టీ పని చేయటం లేదనే భావన బలంగా ఉంది. పార్లమెంటు కమిటీ హాలులో ప్రత్యేక సమావేశం పెట్టి ప్రధాని మోదీ మందలించిన తర్వాత రాష్ట్ర ఇంచార్జీ బన్సల్ మందలించింది కూడా అందుకే! 'గోడమీద రాతల నుంచి చిన్న పోస్టర్ అతికించడం వరకు అన్నీ డబ్బుమయం అయిపోయాయి తప్ప తెలంగాణలో ఆశించన ఫలితాలు రావట్లేద'ని ఆయన మండిపడటం వెనుక ఎంత నిజముందో పార్టీ రాష్ట్ర నాయకత్వం బేరీజు వేసుకోవాలి

## అతివల రామప్ప పర్యటనపైనా రాజకీయమా

- కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్న బిఆర్ఎస్ నేతలు
- సబితమ్మకు ఇప్పుడు తెలంగాణ గుర్తుకు వచ్చిందా
- మండిపడ్డ మంత్రి సీతక్క

**ములుగు,మే15( వెలుతురు):**
మిస్ వరల్డ్ కంటేస్టెంట్ల ములుగు, రామప్ప దేవాలయ పర్యటనను వివాదాస్పదం చేస్తున్నారని బిఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రతి అంశాన్నీ వక్రీకరించడం బిఆర్ఎస్‌కు పరిపాటిగా మారిందని అంటూ ఫైర్ అయ్యారు. ప్రతి చిన్న విషయానికి తెలంగాణ సెంటిమెంటును రుద్ది తెలంగాణ ప్రతిష్టను దిగజార్చవద్దని మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈ సందర్భంగా నిన్న మిస్ వరల్డ్ కాంటెస్ట్ వరంగల్ వేయి స్తంభాల గుడి, రామప్ప గుడి వద్ద హెరిటేజ్ వాక్ పర్యటన ఏర్పాట్లు- చేసిన ఉన్నతాధికారులకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. హెరిటేజ్ వాక్ సక్సస్ కావడంతో బిఆర్ఎస్ నేతలు కళ్లలో నిప్పులు పోసుకున్నారని, కోడిగుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని సె-టైర్లు వేశారు. ఇవంకా ట్రంప్ వచ్చినప్పుడు తోక పట్టుకొని తిరిగిన నాయకుడు.. ఎలాంటి సంస్కృతి సంప్రదాయాలు పాటించారో అందరికీ తెలుసన్నారు. గుళ్లలోకి కాళ్ళు కడుక్కొని వెళ్ళడం గిరిజన సంప్రదాయం.. అదే అక్కడ పాటించారు. అందులో ఒక ఈవెంట్ మేనేజ్మెంట్ అమ్మాయి కాళ్ళకు నీళ్ళు పోసింది. దానిని పట్టు-కొని తెలంగాణ ప్రభుత్వం చేసిందని బద్నాం చేస్తున్నారని, నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రభుత్వం కాళ్ళు కడిగితే అందరి కాళ్ళు కడిగించాలి కదా..? దానిని ప్రభుత్వానికి అంటగట్టడం సిగ్గు అనిపించడం లేదా? కవితమ్మ కాళ్ళ దగ్గర కలెక్టర్‌ను కూర్చోబెట్టినప్పుడు.. కేసీఆర్ కలెక్టర్లతో కాళ్ళు మొక్కించుకోవడం మీ దురహంకారం కదా.. దానికి వ్యతిరేకంగానే కదా ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారు. తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత మీకుందా..? అంటూ నిప్పులు చెరిగారు. ఈమధ్య సబితా ఇంద్ర రెడ్డి ములుగు మీద పచ్చి అబద్ధాలు చెబుతున్నారని, ఆమె మంత్రిగా ఉన్నప్పుడు ఏం మానవత్వం చూపిందో తెలుసని.. అబద్ధాలు కాకుండా వాస్తవాలు మాట్లాడితే బాగుంటు-ందని సూచించారు. అబద్దాలకు అంబాసిడర్ గా సబితమ్మ మారకూడదన్నారు. అధికారం పోయాక.. ప్రజలు, ఆత్మగౌరవం మీకు గుర్తుకు వచ్చిందా..? అని ప్రశ్నించారు.

# సంపాదకీయం..

## శాంతి మంత్రాలకు చింతకాయలు రాలవు!

భారత్‌తో యుద్ధం గెలిచామని తమ సొంత ప్రజలను నమ్మించేందుకు పాక్ చేయని ప్రయత్నం లేదు. చివరకు విజయోత్సవాలను కూడా నిర్వహించుకుంది. ట్రంప్ కూడా తనవల్లనే యుద్ధం ఆగిందని ప్రచారం చేసుకుంటున్నారు. ప్రచార కండూతి ఇద్దరిలోనూ కనిపిస్తోంది. అయితే ఇందులో ఏది నిజమో భారత్‌ను చూస్తే తెలుస్తుంది. పాక్ ఎందుకు కాళ్లబేరానికి వచ్చిందో చెప్పాలి. ప్రపంచాన్ని బెదిరించి పబ్బం గడుపు కునే దుస్థితిలో ట్రంప్ ఉన్నారు. అడుక్కుతినే దుస్థితిలో పాక్ ఉంది. పాక్ ముందు నుంచి నిజాయితీ ఉన్ దేశంగా పేరు సంపాదించుకోలేదు.యుద్ధాన్ని తానే ఆపానని ఓ వైపు డొనాల్డ్ ట్రంప్ ప్రచారం చేసుకుం టుంటే...మరో వైపు పాకిస్తాన్ తామే యుద్ధంలో గెలిచామని ప్రచారం చేసుకుంటోంది. డొనాల్డ్ ట్రంప్, పాకిస్తాన్‌లు చేసుకుంటున్న ప్రచారంపై అమెరికాతో సహ ప్రపంచ దేశాలు నివ్వెరపోయి చూస్తున్నాయి. భారత్ దెబ్బకు దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయిన పాక్..నిజాయితీగా బతకాలన్న ఆలోచన చేయడం లేదు. ఇండియా పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం కాల్పులు మొదలైన మూడు రోజులకే ముగిసిన సంగతి తెలిసిందే. ఎందుకు ముగిసాయన్నది పాక్‌కు బాగా తెలుసు. భారత్ కొట్టిన దెబ్బకు పాక్ కూసాలు కదిలిపోయాయి. మిస్సైల్స్, డ్రోన్ల దాడి కారణంగా భారీ ఆస్తినష్టం సంభవించింది. ఒకరకంగా పాక్‌పై కోలుకోలేని దెబ్బ పడింది. యుద్ధం ఇలాగే కొనసాగితే దేశం సర్వ నాశనం అవుతుందని పాక్ భావించింది. వెంటనే కాళ్ల బేరానికి వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సాయంతో కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీంతో కాల్పుల కొనసాగింపు ఆగిపోయింది. అయితే భారత్ మాత్రం ఆపరేషన్ సింధూర్ నిలిచి పోయిందని, ఎప్ఉడైనా కొనసాగుతుందని గట్టిగా హెచ్చరించింది. మోడీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగం తరవాత దేశంతో పాటు, ప్రపంచానికి కూడా భారత్ సత్తా ఏమిటో మరోమారు తెలిసిపోయింది. ఇండియా దెబ్బకు తోకముడిచిన కుక్కలా పాకిస్తాన్ బిక్కచచ్చిపోయింది. దాడులు, కాల్పుల విరమణ కోసం పరుగులు తీసింది. యుద్ధంలో పాకిస్తాన్ దారుణంగా దెబ్బతింది. ఇండియా డిప్లమేటిక్‌గా.. మిలటరీ పరంగా విజయం సాధించింది. ఇండియా ఎందుకు విజయం సాధించిందనే దానికి పటిష్టమైన నాయకత్వం, మిటిటరీ ఆధునీకరణ అని చెప్పక తప్పదు. గత కొన్ని వేల సంవత్సరాలుగా పరాయి పాలనలో మగ్గిన భారత్ స్వయం సమృద్ధి సాధించి, సైనికంగా బలోపేతం అయ్యింది. ఎదుటి వారు దాడిచేస్తే దెబ్బ కొట్టాల్సిందేనన్న లక్ష్యంతో పనిచేస్తోంది. చెంపకుచెంప కాదు...కాల్లు విరగ్గొడతామన్న ధైర్యాన్ని చూపిస్తోంది. ఈ విషయం పాకిస్తాన్‌కే బాగా తెలుసు. వరుసగా ఉగ్రదాడులతో భారత్‌ను దెబ్బకొట్టాలని చూసిన పాక్ ఇప్పుడు దెబ్బతింది. ఇక జీవితంలో మరువలేని అనుభవాన్ని సంపాదించింది. ఇకనుంచి ఉగ్రదాడులకు దాడులతోనే భారత్ సమాధానం చెబుతుందన్న విషయం ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఇకపోతే ఇప్పుడు అందరి చూపు.. పాకిస్తాన్ టెర్రరిస్టులను పెంచి పోషిస్తున్న విషయం వైపే ఉంది. టెర్రరిస్టులు చనిపోయినపుడు ఆర్మీ అధికారులు యూనిఫామ్‌లో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంటే దానర్థం.. అక్కడి టెర్రరిస్టులకు.. ఆర్మీ వాళ్లకు తేడా లేదని. పాక్ చరిత్ర గురించి బాగా తెలిసిన వారు..ఈ రెంటికీ విడదీయరాని సంబంధం ఉందని గుర్తించారు. ఇండియాతో యుద్ధం చేసి ఓడిపోయిన ప్రతీసారి తామే గెలిచామని పాకిస్తాన్ జబ్బలు చరుచుకుంటోంది. అందుకే ఉగ్రవాదులకు ఊతమిచ్చే చర్యలను పక్కన పెట్టి పాకిస్తాన్ తన సొంత ఇంటిని శుభ్రం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక బంగ్లా యుద్ధంనాటి 1971తో పోల్చితే మన దేశం ఆర్థికంగా ఎన్నో రెట్లు బలపడింది. మన సైనిక శక్తి పాటవాలు కూడా అనేక రెట్లు పెరిగాయి. అందుకే డ్రోన్లు, క్షిపణులతో పాకిస్థాన్ దాడులు చేసినప్పటికీ సమర్థంగా తిప్పి కొట్టాం. అలాగే ప్రతిదాడితో దాని పక్కటెముకలను విరగొట్టాం. మనవైపు చెప్పుకోదగిన నష్టం ఏమీ జరగలేదు. అంతర్జాతీయ సమీకరణాలు... 1971లో పాక్‌కు దన్నుగా అమెరికా, బ్రిటన్, చైనా వంటి దేశాలు నిలవగా... మన దేశానికి సమైక్య రష్యా మాత్రమే అండగా ఉండింది. ఇప్పుడు వాతావరణం మారింది. భారత్ శాస్త్ర సాంకేతికరంగంలో దూసుకు పోతోంది. భారతదేశం కూడా బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. దీంతో భారత్ నుంచి ముప్పు తప్పదని భావించిన చైనా మనతో శత్రుత్వం పెంచుకుంటోంది. చైనాకు సామంత దేశంగా ఉండటానికి భారత్ ఎప్పటికీ అంగీకరించదు. ఈ కారణంగా చైనా వ్యూహాత్మకం గా పాకిస్థాన్‌ను చేరదీస్తోంది. దాయాది దేశానికి వివిధ రూపాల్లో సహాయం చేస్తోంది. మొన్నటికి మొన్న కూడా సైనికి సాయం చేసి భంగపడింది. అందుకే అరుణాల్ విషయంలో పేచీలు పటెట్ఇ కెలక్కుంటోంది. ఇక అమెరికా కూడా చైనా ఎదుగుదలను నిరోధించే క్రమంలో దానితో సై అంటోంది. భవిష్యత్తులో చైనాతో తలపడాల్సి వస్తే భౌగోళికంగా పాక్ భూభాగం అమెరికాకు కావాలి. ఈ కారణంగా ఉగ్రవాదంపై తమది రాజీ లేని పోరు అంటూనే అమెరికా దొడ్డి దారిన పాకిస్థాన్‌కు సహాయం చేస్తోంది. ఈ నేపథ్యంలో సైనికపరంగా అత్యంత శక్తిమంతంగా ఉన్న రష్యా మాత్రమే ఎప్పటికైనా మనకు అంతో ఇంతో అండగా నిలవొచ్చు. పశ్చిమ దేశాలతో ఉన్న వైరం కారణంగా రష్యా కూడా చైనాకు పూర్తి వ్యతిరేకంగా వ్యవహరించే పరిస్థితి లేదు. ఈ కారణంగానే ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌కు ఆర్థిక సహాయం చేయవద్దని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థకు భారత్ విజ్ఞప్తి చేసినా..డే వంద కోట్ల డాలర్ల సహాయం అందించడానికి అంగీకారం తెలిపింది. యుద్ధాలను భరించే స్థితిలో ప్రపంచ దేశాలు ఇప్పుడు లేవు. ఐదు దశాబ్దాల క్రితం పరిస్థితులు వేరు. అప్పుడు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కూడా లేవు. 1971 యుద్ధ సమయంలో అంతర్జాతీయ పరిణామాలు మన దేశ ప్రజలపై ప్రభావం చూపలేదు. ఇప్పుడు మన దేశం నుంచి ఎగుమతులు, దిగుమ తులు కూడా పెరిగాయి. ఇప్పుడంతా అభివృద్ధి, అర్థిక వృద్ధిపైనే అన్ని దేశాలు దృష్టి సారిస్తున్నాయి. పాక్ ఇందుకు భిన్నంగా ఉగ్రవాదులను ఎగదోస్తోంది. ఇలా ఎంతకాలం చేసినా అది మనుగడ సాగించదని గుర్తిస్తే మంచిది. అలా అని పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పకుండా ఉండలేం. మన దేశంతో యుద్ధం చేసి నెగ్గలేని పాకిస్థాన్ ఉగ్ర మూకలను పెంచి పోషించి మనపైకి ఉసిగొల్పుతోంది. తృతీయ ఆర్థిక శక్తిగా ఎదగాలను కుంటున్న భారత్‌కు ఈ యుద్ధం ప్రతిబంధకమే అవుతుంది. అలా అని చేతులు ముడుచుకొని కూర్చోలేని స్థితి. కశ్మీర్ అందాలను ఆస్వాదించడానికి వెళ్లిన పర్యాటకులను వారి భార్యల కళ్లెదుటే కాల్చి చంపిన ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం ద్వారా మన దేశాన్ని పాకిస్థానే యుద్ధ రంగంలోకి లాగింది. పాముకు పాలు పోసి పెంచితే అది ఏదో ఒకరోజు మనల్నే కాటేస్తుంది. పాకిస్థాన్‌కు కూడా ఈ పరిస్థితి ఎదురవుతోంది.

# పాక్ అదుపులో 21 రోజులపాటు నరకం

- కళ్లకు గంతలు కట్టి మాటలతో హింస

**న్యూఢిల్లీ,మే15(ఆర్ఎన్ఎ):**



పాక్ రేంజర్ల నిర్బంధంలో గత 21 రోజులుగా ఉన్న సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్ జవాన్ పూర్ణమ్ కుమార్ షా విడుదలైన సంగతి తెలిసిందే. పాక్ అదుపులో ఉన్నప్పుడు ఆయనను నిద్ర పోనివ్వలేదని, దూషించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నిర్బంధంలో ఉన్నన్ని రోజులు పాక్ అధికారులు పూర్ణమ్‌ను మూడు ప్రాంతాల్లో తిప్పి ఒక లొకేషన్‌లో జైలు సెల్‌లో ఉంచారు. వారివద్ద ఉన్నన్ని రోజులు చాలావరకు కళ్లకు గంతలు కట్టే ఉంచారని సమాచారం. ఆయనను శారీరకంగా హింసకు గురిచేయలేదు కానీ.. మాటలతో మాత్రం వేధింపులకు గురిచేశారని ఆ వర్గాలు వెల్లడించాయి. కనీసం నిద్ర పోనివ్వలేదని, బ్రష్ చేసుకోవ్వలేదని తెలిపాయి. అలాగే సరిహద్దులో మోహరింపు గురించి, అక్కడ ఉండే సీనియర్ అధికారుల గురించి వివరాలు రాబట్టేందుకు ప్రయత్నించారని పేర్కొన్నాయి. కాంటాక్ట్ వివరాలు ఇవ్వాలని ఆ అధికారులు ఒత్తిడి చేశారని తెలుస్తోంది. అయితే బీఎస్ఎఫ్ నిబంధనల ప్రకారం ఆయన వద్ద ఎలాంటి ఫోన్ లేకపోవడంతో వారికి వివరాలు అందలేదు. ఇక ఈ ప్రశ్నలన్నీ అడిగిన అధికారులు సివిల్ దుస్తుల్లో ఉన్నారని సమాచారం. పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ సెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి రైతులకు రక్షణగా గత నెల 23న గస్తీ నిర్వహిస్తున్న సమయంలో పూర్ణమ్ అస్వస్థతకు గురయ్యారు. సమీపంలో ఓ చెట్టు– కనబడటంతో దానికింద విశ్రాంతి తీసుకున్నారు. అది పాక్ భూభాగం అన్న విషయాన్ని గుర్తించలేకపోయారు. పాకిస్థాన్ రేంజర్స్ ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారు. జవాన్ విడుదల కోసం రెండు దేశాల భద్రతా దళాలు ఆరు సార్లు చర్చలు జరిపాయి. మరోవైపు పూర్ణమ్ కుటుంబసభ్యులు తీవ్రంగా ఆందోళన చెందారు. గర్భిణి అయిన ఆయన భార్య.. భర్త విడుదల కోసం కేంద్రాన్ని వేడుకున్నారు. కొన్నాళ్లపాటు– భారత్ అధికారుల అభ్యర్థనలు పట్టించుకోకుండా పాక్ రేంజర్లు కాలయాపన చేశారు. అయితే ఈనెల మొదటివారంలో రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ సమీపంలో మన భూభాగంలోకి ప్రవేశించిన పాక్ రేంజర్ మహమ్మదుల్లాను బీఎస్ఎఫ్ అదుపులోకి తీసుకుంది. దీంతో పాకిస్థాన్ పైనా ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలోనే పూర్ణమ్‌ను విడుదల చేసింది. బీఎస్ఎఫ్ కూడా పాక్ రేంజర్‌ను అప్పగించింది.

# నేను మంత్రిగా ఉన్నప్పుడు పుష్కరాలు రావడం చాలా సంతోషంగా ఉంది

- భక్తుల మనోభావాలు దృష్టిలో ఉంచుకొని చాలా పక్కగా ఏర్పాట్లు చేసినం.
- సరస్వతి పుష్కరాల సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు
- భక్తులకి సరస్వతి దేవి మంచి చేయాలని... రాష్ట్రంలోని పిల్లలకి విద్య ఇవ్వాలని సరస్వతి కటాక్షం పొందేలా సరస్వతి అమ్మవారిని కోరుకున్నం.
- 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పుష్కరాలు తెలంగాణ వాళ్ళే కాకుండా పక్క రాష్ట్రాలు వచ్చేలా మంచి ఏర్పాట్లు చేసినం.
- సరస్వతి కటాక్షం తెలంగాణ విద్యార్థులందరి మీద ఉండాలని ఆ సరస్వతి వేడుకున్న.
- సరస్వతీ పుష్కరాల తొలిరోజున 80 వేల మంది పుణ్యస్నానాలు ఆచరించారు
- కాళేశ్వరం సరస్వతి పుష్కరాలు సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

## సరస్వతి తల్లి అనుగ్రహం ఇది







**కాళేశ్వరం వెలుతురు మే 15:**

రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి దేవాదాయ శాఖ మంత్రి ప్రత్యేక కృషి వల్ల గురువారం రోజున పుష్కరాలను అంగ రంగ వైభవంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. మొట్టమొదటి సారి కాశిలో ఏవిధంగా హారతి ఇస్తారో సరస్వతి హారతి కాళేశ్వరంలో చేయాలని ముఖ్యమంత్రి సూచన మేరకు కాశి నుండి పండితులను ప్రత్యేకంగా రప్పించడం జరిగిందని అన్నారు. భక్తుల సౌకర్యార్థం టెంట్ సిటీ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని శాఖల సమన్వయంతో రాబోవు 11 రోజుల పాటు జరిగే పుష్కరాలను విజయ వంతంగా నిర్వహించ బోతున్నామని అన్నారు. మాదవానంద సరస్వతి సూచన మేరకు దేవాలయాల పవిత్రను కాపాడాలని కోరారు. ముఖ్య మంత్రి సూచనల మేరకు ఈరోజు కాళేశ్వరం లో సరస్వతి పుష్కరాలను నిర్వహిస్తున్నామని, పెద్ద చరిత్ర కలిగిన కాళేశ్వరానికి మాస్టర్ ప్లాన్ ద్వారా నిధులు కేటాయించాలని కోరారు. గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు చేయాలని సీఎంను కోరారు. మారుమూల ప్రాంతం అయిన కాళేశ్వరం టూరిజం హబ్ గా అభివృద్ధి చేయాలని కోరారు. 20 సంవత్సరాల కాలంలో పెండింగ్ ఉన్న చిన్న కాళేశ్వర ప్రాజెక్ట్ పనుల ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ వల్ల విజయ వంతంగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, మళ్ళీ ఒక్క సారి ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి రావాలని కోరుతున్నామని తెలిపారు. తన తండ్రి శ్రీపాదరావు ఆశయాల మేరకు నియోజక వర్గం అభివృద్ధి చేస్తున్నామని, సీఎం ప్రత్యేక చొరవతో ఇంకా అభివృద్ధి చేస్తామని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో 3 కోట్ల రూపాయలుతో బస్టాండ్ నిర్మాణానికి నిధులు విడుదల చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ పుష్కరాలను అంగరంగ వైభవంగా జరగాలని గొప్ప సంకల్పంతో గురువారం రోజున పుష్కరాలను నిర్వహించుకుంటున్నామని తెలిపారు. దేశంలో ఇతర రాష్ట్రాలు తెలంగాణను చూస్తున్నాయని, గతంలో ఎన్నడు లేని విధంగా గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్య ల్మంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషి వల్ల భక్తుల సౌకర్యార్థం సరస్వతి పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. దేవాదాయశాఖ తో పాటు ఇతర శాఖల అధికారులు ఎంతో గొప్పగా ఏర్పాట్లు చేశారని అభినందించారు. తెలంగాణ రాష్ట్రంలో సరస్వతి పుష్కరాలను గగనంగా నిర్వహించి కుంటున్నామని, ఇదే స్పూర్తితో రాబోయే రోజుల్లో వచ్చే గోదావరి, ప్రాణహిత , కృష్ణ పుష్కరాలు, మేడారం జాతరలను ఘనంగా నిర్వహించబోతున్నామని అన్నారు. భక్తుల వేసవి దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా ఉండాలని గోదావరి పరిసరాల్లో భక్తులు స్నానాలు చేసి వ్యర్థాలను గోదావరిలోను, పరిసరాల్లో వేయకుండా పరిశుభ్రత పాటించాలని కోరారు. అధికారులు మిగిలిన 111 జరగబోయే కార్యక్రమాలను నిబద్ధతతో పని చేసి పుష్కరాలను విజయవంతం చేయాలని.సూచించారు. భక్తుల పుష్కర స్నానం చేసి క్షేమంగా ఇంటికి చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంత పెద్ద పెద్ద ఎత్తున పుష్కరాలకు ఏర్పాట్లు చేసిన అధికారులను అభినందించారు. రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా ఈ రోజు ఇంత ఘనంగా సరస్వతి పుష్కరాలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. దేశ ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్ర ప్రజల క్షేమాన్ని కాంక్షించి ఈ పుష్కరాలను నిర్వహించడం శుభ సూచకమని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్న ఈ పుష్కరాలను ఘనంగా నిర్వహించడానికి కృషి చేసిన ముఖ్య మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాకాళీ, మహాలక్ష్మీ కటాక్షాలతో తెలంగాణ రాష్ట్రంలో సరస్వతి కటాక్షంతో మంచి విద్యను విద్యార్థులను అందించాలని సరస్వతి అమ్మ వారి కటాక్షం ఉండాలని కోరుతూ ఎంత పెద్ద ఎత్తున పుష్కరాలకు ఏర్పాట్లు చేసిన ముఖ్య మంత్రి గారికి ధన్యవాదాలు తెలుపారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ఏర్పాట్లు చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, లక్ష్మణ్, శాసన సభ్యులు మక్కడ్ ఠాకూర్, నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, మక్కన్ సింగ్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ వినయ్ క్రిష్ణా రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్ రావు, ఎస్పి కిరణ్ ఖరే తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాశీ పండితులు 45 నిమిషాల పాటు నిర్వహించిన సరస్వతి నవరత్న హారతి కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా పేల్చిన బాణాసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

### కాళేశ్వరం సరస్వతి నవరత్నమాల స్తోత్రంతో తొమ్మిది హారతులు.

ఓంకార హారతి..సర్వ దోష నివారిణి
నాగ హారతి – సర్పదోషాని పోగొట్టి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది
పంచ హారతి – దీర్ఘాయుష్షుకు



సూర్య హారతి రోగాలను మాపి ఆరోగ్యాన్ని ఇస్తుంది.
చంద్ర హారతి – పాడి పంటలను, మన: శాంతినిస్తుంది.
నంది హారతి – ధర్మ బుద్ధిని, శక్తిని, విద్య బుద్ధినిస్తుంది.
సింహ హారతి. నాయకత్వాన్ని ధైర్యాన్నిస్తుంది.
కుంభ హారతి –సంపదను ఇచ్చి, కోటి సుఖాలను అందిస్తుంది.
నక్షత్ర హారతి – నిర్మలమైన మనస్సును, కీర్తిని అందిస్తుంది.
పై హారతులు వారణాసి కాశీలో గంగా హారతి లుఇచ్చే 7 గురు పండితులచే చేయడం జరిగింది. దాదాపు అరగంటపాటు జరిగిన ఈ 9 హారతులు ఆహుతులను మైమరపింప చేశాయి

## సిరిపురం గ్రామంలో మరణించిన గోవర్ధన్ కుంటుంబానికి సిపిఎం ఆర్థిక సహకారం



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 15**

సిరిపురం గ్రామానికి చెందిన ఆటో యూనియన్ మాజీ అధ్యక్షుడు, మాజీ విద్యా కమిటీ ఛైర్మెన్ తుంగ గోవర్ధన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాగా వారి కుటుంబానికి సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో 33500/-రూ. ఆర్థిక సహకారం రైతు సంఘ జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి చేతుల మీదగా వారి కూతుళ్ళకు అందజేయడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అందరితో కలివిడిగా, ఉండి సేవా గుణం కలిగిన గోవర్ధన్ మృతి వారి కుటుంబానికి తీరని లోతని అన్నారు.సిపిఎం కార్యకర్తల ఆర్థిక సహకారంతో కుటుంబానికి అందిచటం జరుగుతుందని.గోవర్ధన్ కుంటుంబానికి సిపిఎం ఎల్లవేళలా, అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బల్గురి అంజయ్య, శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ బడుగు రమేష్, రాపోలు ప్రభాకర్,నాయకులు అంబటి సురేందర్ రెడ్డి,భారత మృత్యుంజయ, కునూరు వెంకటేశం,దోమలపల్లి నర్సింహా, సిల్వేరు సత్తయ్య,గాదె కృష్ణ, ఏళ్ల సంతోష్ రెడ్డి,గుంజె సైదులు తదితరులు పాల్గొన్నారు.

## దశదినకర్మకు హాజరైన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 15**

మండలం సిరిపురం గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బండ శ్రీనివాస్ రెడ్డి తండ్రి బండ గోపాల్ రెడ్డి మరణించగా ఈరోజు దశదిన కార్యక్రమమునకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై గోపాల్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి పూల మాలలు వేయడం జరిగింది. కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లు బందెల రాములు, కంభంపాటి శ్రీనివాస్, మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు బొక్క మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీలు సాల్వేర్ అశోక్, పున్న వెంకటేశం, ఎండి ఆమీర్, జిల్లా నాయకులు బద్దుల రమేష్, అంతటి రమేష్, మాజీ ఉపసర్పంచ్ దాసిరెడ్డి శ్రవణ్ రెడ్డి, నాయకులు కోనూరు ముత్తయ్య, జాడ సంతోష్, కోళ్ల స్వామి, జెట్టి సైదులు, బొలుగుల కృష్ణ, ఎండి మోసబ్, గాదె శంకరయ్య, యాదయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ రాష్ట్ర దళిత మహిళలతో ప్రపంచ సుందరీమనుల కాళ్లు కడిగించి దళిత మహిళల పరువు తీసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై కేసు నమోదు చేయాలి

- నాగర్ కర్నూల్ జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు బల్మూరి జానకి

**వెలుతురు న్యూస్, అచ్చంపేట:**



మన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో నెలరోజుల నుండి ప్రపంచ సుందరీ మనులంటూ హంగామా చేస్తూ తెలంగాణ పరిసర ప్రాంతాలలో తిప్పుతూ వాళ్లకు సకల సౌకర్యాలను కల్పిస్తూ 250 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ ప్రజల సొమ్మును దుబార చేస్తున్నారని నాగర్ కర్నూల్ జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు బల్మూరి జానకి ఫైర్ అయ్యారు. అదే సుందరి మనలను నాగార్జునసాగర్ బుద్ధ క్షేత్రమునకు తీసుకొచ్చి హైదరాబాదు నుంచి నాగార్జునసాగర్ వరకు ఉన్న చిరు వ్యాపారులపై రక్ష సాధింపుగా వారి దుకాణాలను జెసిబి లతో తొలగించి వారి పొట్టలో మట్టి కొట్టారని ఇది ఆ సుందరి మణులు ఎక్కడ సందర్శిస్తే అక్కడ ఇదే తత్తంగము చేస్తున్నారని మండిపడ్డారు. ఆ ముచ్చట అలా ఉంచితే మరి కర్కాశంగా తెలంగాణ దళిత మహిళల చేత సుందరీమణుల కాళ్లు కడిగించడమేంటని ఇది ముమ్మాటికీ దళిత మహిళల మనోభావాలకు భంగం కలిగించడమేనని అందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆమె ధ్వజమెత్తారు.

## దోమల పెంటలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం



**వెలుతురు న్యూస్, అమ్రాబాద్:**

అమ్రాబాద్ మండలం దోమల పెంట గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మచారం గ్రామంలో నల్లమల ముద్దుబిడ్డ తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు శ్రీ యనుముల రేవంత్ రెడ్డి ఈనెల 18న విచ్చేసి ఇందిర సౌర గిరి జల వికాస పథకం ప్రారంభించనున్నారని అందుకు భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని. జన సమీకరణ కొరకై గ్రామ,గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలు ఏర్పాటు చేయుటకై సీనియర్ నాయకులు, యూత్ నాయకులతో కలిసి గ్రామంలో కమిటీలను వేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త చేయి చేయి కలుపుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సిబిఎం ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ చిక్కుడు అనురాధ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మే 20 సమ్మె జయప్రదం కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ

### ట్రాక్టర్ భారీ ర్యాలీలో యూనియన్ కేంద్ర కమిటి సభ్యులు కల్లూరి మల్లేశం డిమాండ్

**వెలుతురు న్యూస్,చౌటుప్పల్ మే 15 :**

మండల పరిధిలో మే 20 న జరిగే జాతీయ కార్మిక సమ్మెలో ట్రాన్స్ పోర్ట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని అల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (AIRTWF-CITU) కేంద్ర కమిటి సభ్యులు కల్లూరి మల్లేశం కార్మికులకు పిలుపునిచ్చారు గురువారం రోజున చౌటుప్పల్ మండలం మల్కాపురంలో ట్రాన్స్ పోర్ట్ యూనియన్ ఆధ్వర్యంలో మల్కాపురం గ్రామంలోని దేవుని గుడి నుండి ఇండస్ట్రియల్ పార్క్ మీదుగా పారిశ్రామిక ప్రాంతంలో ట్రాక్టర్స్ తో , మినీ గూడ్స్ తో మే 20 సమ్మె జయప్రదం చేయాలని ,లేబర్ కోడ్ లు రద్దు చేయాలని నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ ట్రాక్టర్ ర్యాలీని ట్రాన్స్ పోర్ట్ యూనియన్ కేంద్ర కమిటి సభ్యులు కల్లూరి మల్లేశం , యూనియన్ జిల్లా అధ్యక్షులు యండి పాషా గారితో కలిసి



జెండా ఊపి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కల్లూరి మల్లేశం మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన నుండి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్ అనుకూల విధానాలు అమలుచేస్తున్నదని విమర్శించారు 29 కార్మిక చట్టాలను రద్దు చేసి మోడీ కార్మిక వ్యతిరేక విధానాలు అమలుచేస్తున్నాడని ,కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని సిఐటియుతో పాటు జాతీయ కార్మిక సంఘాలు , స్వతంత్ర ఫెడరేషన్ లు ,రాష్ట్ర వ్యాపిత కార్మిక సంఘాలు మే20 జాతీయ సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని ఈ సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు, 10 సంవత్సరాలు జైలు శిక్ష , ఏడు లక్షల జరిమానా ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్లకు కఠినంగా శిక్ష విధించే భారత న్యాయ సంహిత సెక్షన్ 106(1)(2) ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.డ్రైవర్ ల లైసెన్స్ లు , వాహన రిజిస్ట్రేషన్ లను సైతం నూతన మోటార్ వాహన చట్టం -2019 ప్రకారం ప్రైవేట్ ఏజెన్సీ లకు ఇస్తారని ,అధిక ఫైన్ లు వేస్తారని డ్రైవర్ లకు నష్టం చేసే ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు ఈ చట్టం రద్దు అయ్యేవరకు జరగబోయే పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని మే 20 సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలి పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో ట్రాన్స్ పోర్ట్ యూనియన్ ( సిఐటియు )జిల్లా అధ్యక్షులు యండి పాషా , నాయకులు బత్తుల దాసు, శ్రీనివాస్ రెడ్డి, ఎస్డీ ఉమర్, రమేష్, బాలరాజు అందోల్ మాత ట్రాక్టర్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష ,కార్యదర్శులు స్వామి గౌడ్, జావీద్, నాయకులు దేవయ్య, సుంకరి రమేష్ గౌడ్, కృష్ణ, మధుసూదన్ రెడ్డి , లింగస్వామి,శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సంజీవరెడ్డి, మీసాల రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు .

## పేదలకు సేవా మార్గంలో వైద్యం అందించాలి.

- డిఎస్పీ రెహమాన్
- ట్రాఫిక్ బారికేడ్లను ప్రారంభించిన డిఎస్పీ
- 20 బారికేడ్లను అందించిన ఆదిత్య న్యూరో గ్యాస్ట్రో ఆసుపత్రి



**కొత్తగూడెం వెలుతురు మే 15:**

భద్రాద్రి కొత్తగూడెం. సేవా మార్గంలో పేదలకు సామాన్య ప్రజలకు వైద్యాన్ని అందించాలని కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ అన్నారు. గురువారం కొత్తగూడెంలోని ఆదిత్య న్యూరో అండ్ గ్యాస్ట్రో ఆసుపత్రి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ కొత్తగూడెం వారికి 20 బారిఖేడ్లను అందజేశారు. ఈ బారికేట్లను డిఎస్పి అబ్దుల్



రెహమాన్ ప్రారంభించి కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులకు అందించారు. అనంతరం ఆయన ఆదిత్య న్యూరో అండ్ గ్యాస్ట్రో విభాగాలకు సంబంధించిన ప్రముఖ డాక్టర్లు దేవి రెడ్డి ప్రసూన డాక్టర్ షిండే లను అభినందించారు. న్యూరో మరియు గ్యాస్ట్రో విభాగాలకు సంబంధించి పూర్తి సమయం ఉండే డాక్టర్లు కొత్తగూడెంలో అందుబాటులో ఉండడం విశేషమని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చుట్టుపక్కల ప్రాంతాలు ఏజెన్సీ ప్రాంతాలు కావున పేదలు ఎక్కువగా ఉంటారు వారందరికీ అందుబాటులో ఉండే విధంగా వైద్యాన్ని అందించాలని యాజమాన్యాన్ని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ , హాస్పిటల్ యాజమాన్యం మారుతి, మణి, సతీష్ మారుతి తదితరులు పాల్గొన్నారు.



## డివిజన్ లో చాలా చోట్ల ట్రాన్స్ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు ఇతర సమస్యలను ఏడి, ఏఈ దృష్టికి తీసుకెళ్లిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి రామన్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు మే 15:**

గురువారం రోజున జలమండలి కార్యాలయం వైపు వెళుతుండగా అక్కడే ఉన్నా ఒక ట్రాన్స్ఫార్మర్ మొత్తం శీలా స్థితిలో ఉండడం చూసి వెంటనే కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి రామన్ గౌడ్ అక్కడి నుంచి సుల్తాన్ బజార్ ఏడి మరియు ఏఈ ఫోన్ చేసి దాన్ని వెంటనే సరి చేయాలని కోరారు అదేవిధంగా డివిజన్లో చాలా చోట్ల ట్రాన్స్ఫార్మర్లకు ఫెన్సింగ్ లేకపోవడం మరియు ఇతర సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.

## సమాచార శాఖ కమిషనర్ నియామకాలలో బీసీలకు అన్యాయం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం ఒకే కులానికి ప్రాధాన్యత ఇస్తున్నాడు
- జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు మే 15:**

56% ఉన్న బీసీలలో రాష్ట్ర సమాచార కమిషనర్లకు అప్లై చేసుకున్న వారిలో ఒకరు కూడా రాష్ట్ర సమాచార కమిషనర్ పదవికి అర్హులైన వారు లేరా అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారినీ ప్రశ్నించారు. ఆయన కేవలం ఒకే కులానికి కొమ్ము కాస్తున్నారనీ విమర్శించారు..ఇటీవల నియమించిన రాష్ట్ర సమాచార కమిషనర్లలో ఒక బీసీ కూడా లేకపోవడం చాలా బాధాకరం.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న సీఎం సొంత రాష్ట్రంలో రాష్ట్ర సమాచార కమిషనర్లుగా ఒక బీసీ ని కూడా నియమించకపోవడం చాలా సిగ్గుచేటు.

## త్రాగునీటి సమస్యను తీర్చిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



భక్త మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు



గ్రామంలో తాగునీటి సమస్య తీర్చడానికి 40 హెచ్ పి మోటర్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**వెలుతురు న్యూస్, అమ్రాబాద్:**

అమ్రాబాద్ మండలం దోమల పెంట గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ చెక్కుడు వంశీకృష్ణ గ్రామంలో కొలువు తీరిన భక్త మార్కండేయ దేవాలయాన్ని దర్శించుకుని తన సతీమణి డాక్టర్ అనురాధ తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిచారు. అనంతరం గ్రామంలో గత కొన్ని రోజుల నుండి త్రాగునీటి సమస్య ఏర్పడింది వెంటనే అట్టి సమస్యని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా అట్టి సమస్యపై వెంటనే ప్రత్యేక చొరవ తీసుకుని ఇరిగేషన్ కంట్రోల్ డిపార్ట్మెంట్ వారితో మాట్లాడి అట్టి త్రాగునీటి సమస్యను పరిష్కరించి ఈరోజు 40 హెచ్ త్రాగునీటి మోటార్ ను ప్రారంభించి ప్రజల దహర్తిని తీర్చారు గ్రామంలో పెద్ద గ్రామపంచాయతీ అయినందున త్రాగునీటి సమస్యను తీర్చినందుకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి డాక్టర్ అనురాధ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

### బీజేపీ పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్

**ఇబ్రహీంపట్నం వెలుతురు మే 15:**



భారతీయా జనతా పార్టీ వీరపట్నం మండల ముఖ్యనాయకుల సమావేశం గురువారం రోజున వీరపట్నం వైష్ణవి గార్డెన్లో బీజేపీ మండల అధ్యక్షులు గోదల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా వీరపట్నం మండల ఇంచార్జ్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్ మరియు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోరెడ్డి నర్సింహా రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి పోరెడ్డి అర్జున్ రెడ్డి రావడం జరిగింది బూత్ స్థాయి నుండి గ్రామ గ్రామాన పార్టీ కార్యక్రమాలను నిర్వహించి పార్టీని బలోపేతం చేయాలనీ కార్యకర్తలకు దిశనిర్దేశం చేయడం జరిగింది, ఈసమావేశంలో మండల నూతన కార్యవర్గం ఎన్నిక గురించి చర్చించడం మరియు భవిష్యత్తు కార్యక్రమాల కార్యాచరణ గురించి మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దొండ రమణ రెడ్డి, బీజేపీ మహిళమోర్చ జిల్లా ఉపాధ్యక్షురాలు కంబాలపల్లి శ్వేత రెడ్డి, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## క్యాన్సర్‌తో మృతిచెందిన కుటుంబానికి బాసట

- రూ.7లక్షల ఆర్థిక సాయం అందించిన సిఎం రేవంత్

**హైదరాబాద్,మే15( వెలుతురు):**

అల్లారుముద్దుగా పెంచుకున్న పాప ఒక్కసారిగా అనారోగ్యానికి గురైంది. ఆసుపత్రికి తీసుకెళితే బ్లడ్ క్యాన్సర్ అని పరీక్షల్లో తేలింది. పాపను రక్షించుకునేందుకు తల్లిదండ్రులు రూ.లక్షలు వెచ్చించారు. విషయం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి రావడంతో పాప చికిత్సకు రూ. 8 లక్షలు మంజూరు చేశారు. వ్యాధి ముదరడంతో పాప ప్రాణాలు కోల్పోయింది. ఆమె చికిత్సకు గతంలో చేసిన వ్యయానికి సంబంధించి మరో రూ.7 లక్షలను సీఎంఆర్ఎఫ్ నుంచి విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించడంతో అధికారులు ఆ మొత్తాన్ని విడుదల చేశారు. హైదరాబాద్ ఎల్బీ నగర్‌కు చెందిన రఘు, మంజుల దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె వేదవల్లికి (5) 2022లో తీవ్ర జ్వరం రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆమెకు బ్లడ్ క్యాన్సర్ అని తేల్చారు. పాపను రక్షించుకునేందుకు రెండేళ్ల పాటు తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల చుట్టూ తిప్పారు. చికిత్స వ్యయం నానాటికీ భారమవడంతో 2024లో ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో వేదవల్లి చికిత్సకు



అవసరమైన రూ.8 లక్షలను మంజూరు చేశారు. చికిత్స అందించినప్పటికీ అప్పటికే వ్యాధి తీవ్రత పెరగడంతో గతేడాది చివరలో వేదవల్లి మరణించింది. ఆమె చికిత్సకు గతంలో ఆ కుటుంబం పెద్ద మొత్తంలో ఖర్చు చేసింది. దీంతో ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు రూ.7 లక్షలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు మంజూరు చేసిన రూ.7 లక్షల చెక్కును సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు వేదవల్లి తండ్రి రఘుకు గురువారం సచివాలయంలో అందజేశారు.

# శాతవాహన వర్సిటీలో న్యాయ కళాశాలకు బార్ కౌన్సిల్ అనుమతి రావడం పట్ల బిజెపి శ్రేణుల హర్షం

- ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అర్జున్ రామ్ మేగ్వాల్, బండి సంజయ్ కుమార్ ల చిత్రపటానికి పాలాభిషేకం..
- న్యాయ కళాశాల మంజూరు కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎనలేని కృషి
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి.....

**కరీంనగర్ వెలుతురు మే 15:**

కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ పరిధిలో న్యాయ కళాశాలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి రావడం పట్ల కరీంనగర్ బిజెపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం రోజున యూనివర్సిటీ ప్రాంగణం వద్ద ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అర్జున్ మెగ్వాల్, బండి సంజయ్ కుమార్ ల చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూశాతవాహన యూనివర్సిటీ పరిధిలో





లా కాలేజీ మంజూరు కోసం కరీంనగర్ పార్లమెంటు సభ్యులు , కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎంతో కృషి చేశారని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో లా కళాశాల అనుమతికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపినందుకు , లా కాలేజీ నీ మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీ , కేంద్ర మంత్రులు అర్జున్ రామ్ మేగ్వాల్, బండి సంజయ్ కుమార్ కు భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా పక్షాన ధన్యవాదాలు తెలియజేసినట్లు చెప్పారు. ప్రధానంగా 120 మంది విద్యార్థులతో(రెండు సెక్షన్లు) ఎల్ఎల్ బి కోర్సుకు, ఈ సంవత్సరం నుండే అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఇది లా విద్యను అభ్యసించే వారి భవిష్యత్తుకు ఎంతో ప్రయోజనం మేలు చేసే విషయమన్నారు.న్యాయ కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా యువత న్యాయవిద్యను అభ్యసించి సమాజానికి దేశానికి సేవ చేసే అవకాశం లభిస్తుందని దానికోసం ఈ న్యాయ కళాశాల వర్గం కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా గతంలో శాతవాహన వర్సిటీలో లా కళాశాల మంజూరు చేయాలని కోరుతూ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కోరారని, ఈ నేపథ్యంలో గత నెల మొదటి వారంలో ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్, మాజీ మేయర్ సునీల్ రావును వెంటబెట్టుకుని బండి సంజయ్ న్యూఢిల్లీలోని కేంద్ర న్యాయశాఖ మంత్రిత్వ కార్యాలయానికి వెళ్లి, సంబంధిత శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ను కలిసి లా కాలేజీని మంజూరు చేయడంతోపాటు ఈ ఏడాది నుండే అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా చూడాలని కోరుతూ బండి సంజయ్ కుమార్ వినతి పత్రం సమర్పించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ విషయంపై శాతవాహన వర్సిటీని వర్చువల్ గా తనఖీ చేయడంతోపాటు వివరణలతో కూడిన నివేదిక కోరిందన్నారు. లా కాలేజీ కోసం కేంద్రమంత్రి బండి సంజయ్ పట్టు పట్టి సాధించారని, ముఖ్యంగా బండి సంజయ్ కృషికి, వినతులకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్ శాతవాహన వర్సిటీకి లా కాలేజీకి అనుమతి ఇవ్వడంతోపాటు, విద్యా సంవత్సరం(2025-26) నుండి ఎల్.ఎల్.బి కోర్సు ప్రారంభమయ్యే విధంగా తగిన చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రోగ్రాం అనంతరం శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ను బిజెపి శ్రేణులందరూ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పుష్ప గుచ్చాన్ని అందించారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ మేయర్ సునీల్ రావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు , మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల్లపు రమేష్, సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు , లీగల్ సేల్ జాయింట్ కన్వీనర్ చంద్రమౌళి, లీగల్ సెల్ బాధ్యులు కిరణ్ సింగ్,వెన్న ఆనందం, కామారపు విశ్వప్రసాద్, సందూరి భూమి రెడ్డి

బండారి శ్రీనివాస్ ,చంద్రపాటి కిరణ్ కుమార్ ,తిరునహరి ప్రవీణ్ కుమార్ , ఆంజనేయులు, ఎస్ .దత్తాత్రేయ ,కొట్టే వంశీకృష్ణ , చంద్ర ప్రకాష్ రెడ్డి ,ఆనంద భాస్కర్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, స్టేట్ కౌన్సిల్ మెంబర్లు దండు కొమురయ్య, నాంపల్లి శ్రీనివాస్, ఏన్నం ప్రకాష్, దూలం కళ్యాణ్ , జాడి బాల్ రెడ్డి, నరహరి లక్ష్మారెడ్డి, నాగసముద్రం ప్రవీణ్, పొన్నాల రాము, అడిచర్ల రాజు, మామిడి చైతన్య, బండారి గాయత్రీ దేవి , మల్లేశం, వాసు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ వ్యాఖ్యలను పట్టించుకోవద్దు

- అన్నీ తన ఘనతే అని చాటుకునే రకం
- మాజీ అధికారి మైఖేల్ రూబిన్ సంచలన వ్యాఖ్యలు

**వాషింగ్టన్,మే15( వెలుతురు):**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆ దేశానికి చెందిన మాజీ అధికారి మైఖేల్ రూబిన్ సంచలన కామెంట్లు చేశారు. ట్రంప్ ఓ కామెడీ పీస్ అని, భారతీయులు అతడ్ని పట్టించుకోవాల్సిన పని లేదని అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం ఆపింది తానేనని ట్రంప్ ప్రచారం చేసుకుంటున్న సంగతి తెలిసిందే. భారత్, పాకిస్తాన్‌లు కలిసి భోజనం కూడా చేయాలని ట్రంప్ అన్నారు. ట్రంప్ ప్రచారంపై పెంటగాన్ మాజీ అధికారి మైఖేల్ రూబిన్ మాట్లాడుతూ.. ప్రతీ దానికి తానే కారణమని ట్రంప్ గొప్పలు చెప్పుకుంటూ ఉంటాడు. మీరు గనుక ట్రంప్‌ను అడిగితే.. ఒంటి చేత్తో వరల్డ్ కప్ సాధించానంటాడు. ఇంటర్‌నెట్‌ను కనిపెట్టింది తానేనంటాడు. క్యాన్సర్‌ను నయం చేసింది కూడా తానేనంటాడు. ఈ విషయంలో భారతీయులది కూడా అమెరికన్ల పరిస్థితే. భారతీయులు ట్రంప్ మాటల్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. పాకిస్తాన్ మీద కూడా ఆయన దారుణమైన కామెంట్లు చేశారు. పాకిస్తాన్‌ను కుక్కతో పోల్చారు. ఇండియా దెబ్బకు పాకిస్తాన్ తోక ముడిచిన కుక్కలా పారిపోయిందని అన్నారు. భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం ఆగిపోవటంలో తన పాత్ర ఎంతో ఉందని డొనాల్డ్ ట్రంప్ ప్రతీ చోటా చెప్పుకుని తిరుగుతున్నారు. వీలు చిక్కినప్పుడల్లా యుద్ధం గురించే మాట్లాడు తున్నారని



మండిపడ్డారు. మేము అణుయుద్ధాన్ని ఆపాము. లేదంటే అదో దారుణమైన అణు యుద్ధం అయి ఉండేది. యుద్ధం కారణంగా లక్షల మంది ప్రాణాలు పోయి ఉండేవి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబిన్‌లకు నా కృతజ్ఞతలు. గత శనివారం నా కారణంగానే రెండు దేశాల మధ్య యుద్ధం వెంటనే ఆగిపోయింది. రెండు దేశాల దగ్గర చాలా అణు బాంబులు ఉన్నాయి. రెండు దేశాలు యుద్ధం ఆపడానికి మేము ఎంతో సాయం చేశాము. వ్యాపార పరంగా కూడా సాయం చేస్తున్నాము. యుద్ధం ఆపితేనే వ్యాపారం చేస్తామని చెప్పాము. లేదంటే వ్యాపారం చేయము అని స్పష్టం చేశామని అన్నారు. అంతర్జాతీయంగా ఎవరి ప్రయోజనాలు వారికి ఉంటాయి. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం కారణంగా ఉభయ దేశాలూ నష్టపోయాయి. రష్యాకు తిరుగులేని సైనిక శక్తి, ఆయుధ సంపద ఉన్నప్పటికీ... పశ్చిమ దేశాలు, ముఖ్యంగా అమెరికా అండతో ఉక్రెయిన్ ఎదురొడ్డి నిలబడగలుగుతోంది. రష్యాతో తలపడటానికి అవసరమైన సహాయం కోసం ఉక్రెయిన్ తమ దేశంలోని సహజ వనరులు, ముఖ్యంగా ఖనిజ సంపదపై హక్కులను అమెరికాకు ధారాదత్తం చేయాల్సి వచ్చింది. మరోవైపు రష్యా కూడా పూర్వం ఉన్నట్టుగా ఆర్థికంగా పటిష్ఠంగా లేదు. ఈ క్రమంలో రూబిన్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇంటర్నెట్ కనిపెట్టడం నుంచి క్యాన్సర్‌ను నయం చేసేవరకు అన్నింటికీ క్రెడిట్ తీసుకోవడం ట్రంప్‌నకు అలవాటేనని రూబిన్ ఎద్దేవా చేశారు. డొనాల్డ్ ట్రంప్ ప్రతిదానికీ క్రెడిట్ పొందేందుకు ఇష్టపడతారు. మీరు ఆయన్ను అడిగితే.. ప్రపంచ కప్‌ను గెలుచుకున్నానని, ఇంటర్నెట్ కనుగొన్నానని, క్యాన్సర్‌ను నయం చేశానని చెప్పుకుంటారు. భారత్- పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో కూడా ఆయన అదే చేస్తున్నారు. ఈ విషయంలో అమెరికన్లలాగానే భారతీయులు ఆయన మాటలు పట్టించుకోవద్దు' అని రూబిన్ పేర్కొన్నారు. ఈసందర్భంగా భారత్- పాక్‌ల మధ్య వివాదం తలెత్తినప్పుడల్లా అమెరికా తెరవెనుక మధ్యవర్తిత్వం వహించడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఇరుదేశాల మధ్య శాంతి పక్రియలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియోలు పాలుపంచుకున్నారని కొనియాడారు.

# అహల్యా భాయి హోల్కర్ త్రిశత జయంతి వేడుకలు

- ఆమె ముందుచూపుతో అనేక సంస్కరణలు చేపట్టారు
- నివాళి అర్పించిన దగ్గుబాటి పురంధేశ్వరి

**విజయవాడ,మే15( వెలుతురు):**

ఆర్థిక శక్తిగా భారతదేశాన్ని తీసుకెళ్లాలంటే మౌలిక సదుపాయాలు సమకూర్చుకోవాలని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. అలాంటి ఆలోచనలు ఆనాడు అహల్య భాయి హోల్కర్ ఆలోచించి వాటిని అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేశారని చెప్పారు. పరిశ్రమలకు పెట్టుబడులు రావాలంటే ఇలాంటి మౌలిక సదుపాయాలు ఎంత అవసరమో గమనించి వాటిపై ఆనాడే దృష్టి పెట్టారని అన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అహల్యా భాయి హోల్కర్ త్రిశత జయంతి వేడుకల ఏర్పాటు-కు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు మీనాక్షి లేఖీ, బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ ..మహిళల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం అహల్య భాయి హోల్కర్ చట్టసవరణలు చేశారని గుర్తుచేశారు. భర్తలు చనిపోయిన మహిళలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో భర్త ఆస్తిలో.. ఆ భార్యకు హక్కు ఉంటుందని చట్టసవరణ చేసి మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. దళితులకు భూములు కేటాయించటం వారికీ సంక్షేమం అందించటంలో అహల్య భాయి ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. 1795వ సంవత్సరం ముందే ఇవన్నీ చేశారంటే అహల్య భాయికు ఎంత ముందు చూపు ఉందో అర్థమవుతుందని తెలిపారు. చేనేత రంగం వెనుకబడుతున్న పరిస్థితుల్లో మహేశ్వర్ అనే ప్రదేశంలో వారి ఉనికిని కాపాడారని అన్నారు. మహిళల్లో ధైర్యాన్ని అహల్య భాయి నింపారని దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. అహల్య భాయి సేవా కార్యక్రమాల కోసం రాష్ట్ర ఖజానా నుంచి ఎప్పుడు ఒక్క రూపాయి తీసుకోలేదని దగ్గుబాటి పురందేశ్వరి గుర్తుచేశారు. పాశ్చాత్య దేశాలు మన దేశంలోని గుడులు గోపురాలపై దాడులు చేశాయని చెప్పారు. ఆలయాలను పరిరక్షించటానికి గర్భగుడి ఉండాలనే ఆలోచనలతో అహల్య భాయి నిర్మించారని అన్నారు. ఉత్తర భారతదేశం నుంచి దక్షిణ భారతదేశం వరకు ఎన్నో ఆలయాలను అహల్యభాయి నిర్మించారని చెప్పారు. మణికర్ణిక ఘాట్లు- వ్యాపారానికి ఉపయోగపడేలా ఒక ఆలోచనతో పరిపాలన ఉండేదని అన్నారు. ఇలాంటి చాలా గొప్ప నిర్ణయాలు ఆలోచనలతో అహల్య భాయి పాలన ఉండేదని చెప్పారు. ఇలాంటి వ్యక్తుల ఆలోచన ఆదర్శంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళు



_న్నారని ఉద్ఘాటించారు. 11వ ఆర్థిక శక్తిగా ఉండే భారత్.. మోదీ హయాంలో 4వ ఆర్థిక శక్తిగా ఎదిగిందని గుర్తుచేశారు. జపాన్ దేశం కంటే ఆర్థిక శక్తిగా ముందుండే రోజులు రాబోతున్నాయని దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. అహల్య భాయి ఒక మహిళగా సమాజం కోసం ఎంతగానో కృషి చేశారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు, కేంద్ర మాజీ మంత్రి మీనాక్షి లేఖీ తెలిపారు. ఈ సందర్భంగా మీనాక్షి లేఖీ మాట్లాడారు. 30సంవత్సరాల పరిపాలనలో అహల్య భాయి వినూత్న ఆలోచనలతో మహారాష్ట్రను వికసిత్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని అన్నారు. పీశ్వాలకు ఉత్తర ప్రత్యుత్తరాలతో అహల్య భాయి చాతుర్యతను ప్రదర్శించారని చెప్పారు. మహిళ పీశ్వాలకు సైతం సమాధానం చెప్పి సమాజం కోసం అహల్య భాయి నిలబడ్డారని ఉద్ఘాటించారు. -ట్రైబల్ మహిళల అభ్యున్నతి కోసం అహల్య భాయి ఆలోచనలు చేశారని తెలిపారు. కాశీ, రామేశ్వరం, శ్రీశైలం లాంటి దేవాలయాల నిర్మాణాలను అహల్య భాయి చేపట్టారని గుర్తుచేశారు. అహల్య భాయి దూర దృష్టితోనే మందిరాల పున:నిర్మాణాలు చేపట్టారని మీనాక్షి లేఖీ పేర్కొన్నారు.

## అందాల పోటీలను నిరసిస్తూ మండల పరిషత్ కార్యాలయం వద్ద సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ నిరసన




**భూదాన్ పోచంపల్లి వెలుతురు మే 15:**

ప్రపంచ సుందరిలతో తెలంగాణ రాష్ట్రానికి అందాల పోటీలతో రాష్ట్రానికి ఏమైనా ప్రయోజనం ఉందా ?ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రజలకు తెలియ చెప్పాలి, తెలంగాణా సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య లు మాట్లాడుతూ ఓ ప్రభుత్వమా మా సర్పంచులు గ్రామాలలో అభివృద్ధి పనులు చేసి వడ్డీలకు డబ్బులు తెచ్చి అప్పుల పాలై బాధలతో ఆత్మహత్యలు చేసుకుని మరణిస్తుంటే అందాల పోటీలు అవసరమా ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు అవుతున్న స్టేట్ ఫైనాన్స్ నుండి పెండింగ్ బిల్లులు చిల్లి గవ్వ ఇవ్వకపోవడం చాలా అన్యాయం సర్పంచుల పదవీకాలం అయిపోయి 14 నెలలు గడుస్తున్నా కనీసం మా సమస్యను పరిష్కరించ పోవడం చాలా బాధాకరం ఇప్పుడు రాష్ట్రంలో ఖజానా లేదని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు బహిరంగ ప్రకటనలు చేస్తున్నాడు .మరి ఇప్పుడు ప్రపంచ సుందరిల అందాల పోటీలకు 200 కోట్లు ఎక్కడికెళ్లి వచ్చాయి అప్పుచేసి ఖర్చు పెట్టడం అవసరమా రాష్ట్రంలో ఇప్పటికి సర్పంచులు అనేకమంది ఆత్మహత్యలు చేసుకున్నారు కనీసం సర్పంచుల మరణాలపై కూడా ప్రభుత్వం స్పందించకపోవడం చాలా అన్యాయం , తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు నెరవేర్చపోవడం 6 గ్యారంటీలు సక్రమంగా అమలుపరచపోవడం ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు ,కావున ప్రభుత్వం పరిపాలన మీద దృష్టి పెట్టాలి స్థానిక సంస్థలు ఎన్నికలు ఇప్పటికీ నిర్వహించకపోవడం వలన కేంద్రం ప్రభుత్వం నుంచి 15 వ ఆర్థిక సంఘం నిదులు సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రానికి రాకపోవడంతో గ్రామల అభివృద్ధి కి నష్టం జరిగింది ప్రజాధనాన్ని దుర్వినియోగ పరచకుండా ఇప్పటికైనా రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సాధించాలని కోరుతున్నాం ఇప్పటికైనా సర్పంచ్ల పెండింగ్ బిల్లులు మంజూరు చేసి గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ప్రభుత్వాన్ని కోరినారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ సహాయ కార్యదర్శి మన్నే పద్మా రెడ్డి జేఏసీ నాయకులు గోడల ప్రభాకర్ గౌడ్ నోముల ఎల్లారెడ్డి రేణుక నర్సింగ్ రావు మట్కా బాలమణి సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంక్ బండ్ అంబెడ్కర్ స్టాచ్యూ నుండి వివేకానంద స్వామి స్టార్చ్ వరకు భారత సైన్యం సైన్యానికి ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు మనం సైతం దేశం కోసం ర్యాలీ

- కొమ్మిడి శోభా దామోదర్ రెడ్డి బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్



**మేడ్చల్ రూరల్ జిల్లా వెలుతురు మే 15:**

చలో ట్యాంక్ బండ్ మనం సైతం దేశం కోసం భారతీయ జనతా పార్టీ మేడ్చల్ రూరల్ జిల్లా తిరంగ యాత్ర ఇటీవల జమ్మూకాశ్మీర్ లోని పెహల్గాంలో జరిగిన పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల దాష్టీకానికి బదులుగా భారత ప్రధాని శ్రీ నరేంద్రమోదీ గారి నాయకత్వంలో త్రివిధ దళాల శౌర్య పరాక్రమంతో 'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాకిస్తాన్లోని ఉగ్రవాద శిబిరాలు, సైనిక, వైమానిక స్థావరాలను, భారీగా దెబ్బతీసి భారత్ ప్రపంచ దేశాలు నివ్వెరపోయే విధంగా పూర్తి ఆధిపత్యాన్ని చాటిన సందర్భంగా.. త్రివిధ దళాల గౌరవార్థం, ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని మేడ్చల్ రూరల్ జిల్లాలోని వివిధ మండలాల, మున్సిపాలిటీల, కార్పొరేషన్లలో కుల మత రాజకీయ పార్టీలకు అతీతంగా మన భారత పౌరులు ప్రతి ఒక్కరు అధిక సంఖ్యలో పాల్గొని మనం సైతం - దేశం కోసం కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని మనవి. గమనిక: 17/05/25 శనివారం సాయంత్రం 5.00PM ట్యాంక్ బండ్.. అంబెద్కర్ స్టాచ్యూ నుండి వివేకానంద స్వామి స్టార్చ్ వరకు, భారత సైన్యం సైన్యానికి ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు మనం సైతం దేశం కోసం ర్యాలీ, భారత్ మాతా కీ జై సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ

## అభ్యంతరకరంగా శ్రీవారి గోవింద నామాలు

- డీడీ నెక్స్ట్ లెవెల్ చిత్రంపై భాను ప్రకాశ్ అభ్యంతరం

**తిరుమల,మే15( వెలుతురు):**

డీడీ నెక్స్ట్ లెవెల్ చిత్రంలో శ్రీవారి గోవింద నామాలను అభ్యంతరకరంగా వాడారని టీటీడీ సభ్యులు, అధికారుల దృష్టికి రావడంతో వారు సీరియస్ అయ్యారు. శ్రీవారి గోవింద నామాలను అభ్యంతరకరంగా వాడుకున్న ఆ చిత్ర బృందంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి డీడీ నెక్స్ట్ లెవెల్ చిత్ర బృందానికి సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. శ్రీవారి గోవింద నామాలకు పెటేంట్ హక్కులు తీసుకునే విధంగా రాబోవు బోర్డు సమావేశంలో తీర్మానం చేస్తామని భానుప్రకాష్ రెడ్డి తెలిపారు. స్వామి వారి గోవింద నామాలతో ర్యాప్ సాంగ్ చేయడం దారుణమని భానుప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం తిరుమలలో భానుప్రకాష్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. హిందూ భక్తుడిగా, బోర్డు సభ్యుడిగా ఆ చిత్ర బృందాన్ని తాను ప్రశ్నిస్తున్నానని చెప్పారు. దమ్ముంటే ఇప్పుడు తిరుమలకు రండి.. అలిపిరి వద్దే స్వామి వారీ భక్తులంటే ఏంటో గా ఆ చిత్ర బృందానికి చూపిస్తామని హెచ్చరించారు. తమిళనాడులోని భక్తులంతా ఆ చిత్ర బృందంపై దాడి చేయాలని అన్నారు. చిత్ర బృందం వెంటనే భక్తులకు క్షమాపణ చెప్పి..పాటను తొలగించాలని డిమాండ్ చేశారు. భక్తులకు క్షమాపణ చెప్పకుండా చిత్ర బృందంలోని ఎవరైనా తిరుమలకు వస్తే.. అలిపిరి వద్దే వారికి తగ్గిన బుద్ధి చెబుతామని వార్నింగ్ ఇచ్చారు. సెన్సార్ బోర్డుపై కూడా క్రిమినల్ కేసు పెడతానని భానుప్రకాష్ రెడ్డి హెచ్చరించారు.

## అణగారిన వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత

5శాతం మంది ప్రజల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దళితులు, ఓబీసీలు, ఆదివాసీలకు ఈ ప్రభుత్వంలో స్థానం లేదని, కార్పొరేట్ వ్యక్తులకే మోదీ గవర్నమెంట్ వత్తాసు పలుకుతోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో చేపట్టిన విధంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని, ప్రైవేటు- కళాశాలలు, యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం కేటాయించిన నిధులను విడుదల చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం మెడలు వంచైనా వీటిని సాకారం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. తాను ఇక్కడికి రాకుండా అడ్డుకునేందుకు స్థానిక నేతలు, అధికారులు ఎంతో ప్రయత్నించారని అన్నారు. అన్ని అడ్డంకుల్నీ అధిగమించి వచ్చానని చెప్పారు. ఈ ఏడాది చివర్లో బిహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే ఎన్నికల వ్యూహాలను అమలు చేస్తోంది. అందులో భాగంగానే బిహార్‌లో యువతతో మమేకమయ్యేందుకు తలపెట్టిన 'శిక్షా న్యాయ్ సంవాద్' కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మిథిలా యూనివర్సిటీ- ప్రాంగణంలో ఏర్పాటు- చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు అధికారపార్టీ నాయకులు, అధికారులు ఎంతో ప్రయత్నించారు. యూనివర్సిటీ- గేటు- బయటే నా కారును నిలిపివేశారు. అయినా, నేను వెనకడుగు వేయలేదు. నడుచుకుంటూ సభా వేదిక మీదికి చేరుకున్నాను. బిహార్ ప్రభుత్వం నన్ను ఎందుకు ఆపలేకపోయిందో తెలుసా? మీ అందరి అభిమానమే నన్ను ముందుకు నడిపించింది. ఇదే శక్తి నరేంద్ర మోదీని గద్దె దించుతుంది. ప్రతిపక్షాల డిమాండ్ మేరకే కులగణను మోదీ అంగీకరించారు. ఈ విషయం దేశ ప్రజలందరికీ తెలుసని రాహుల్ అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కాకుండా...అంబానీ, అదానీల కోసమే పని చేస్తోందని రాహుల్ విమర్శించారు.

## రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు

అన్నారు. కూటమి ప్రభుత్వం పాలసీలతో పెట్టు-బడులకు దేశ, విదేశీ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఇప్పటి వరకు ఆరు ఎస్ఐపీబీల్లో 76 ప్రాజెక్టుల ద్వారా రూ.4,95,796 కోట్ల పెట్టు-బడులకు ఆమోదం తెలిపామని వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఒప్పందాలు చేసుకున్న సంస్థల పనుల పురోగతిపై డాష్ బోర్డు ద్వారా పర్యవేక్షణ జరగాలన్నారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 6వ ఎస్ఐపీబీ సమావేశం ముగిసింది. 19 ప్రాజెక్టులకు సంబంధించి రూ.33వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. దాదాపు 35 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పెట్టుబడులకు సమావేశంలో ఆమోదం లభించింది. ఎనర్జీ, టూరిజం, ఐటీ-, ఎలక్ట్రానిక్స్ శాఖలకు సంబంధించి పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలు ముందుకువచ్చాయి. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ముందుకొచ్చి ఒప్పందాలు చేసుకున్న సంస్థలకు సంబంధించి... ప్రాజెక్టుల శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. ఆయా సంస్థల పెట్టు-బడులు, క్షేత్రస్థాయి పనుల స్థితిగతులను తెలుసుకునేందుకు డాష్ బోర్డు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. టూరిజం సెక్టార్‌లో హోటళ్లు, గదుల కొరత ఉందన్న ముఖ్యమంత్రి.. పెద్దఎత్తున టల్ రూమ్‌లు వస్తే పర్యాటకానికి ఊపు వస్తుందని వ్యాఖ్యానించారు. 50 వేల రూమ్‌లు అందుబాటు-లోకి తేవాలి అనేది తమ ముందున్న లక్ష్యమని తెలిపారు. హోటల్ రూమ్‌ల ధరలు అందుబాటు-లో ఉంటే పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో బస చేస్తారని వెల్లడించారు. ఈ సమావేశానికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అచ్చెన్నాయుడు, కందుల దుర్గేశ్, వాసంశెట్టి సుభాష్, సీఎస్ కె. విజయానంద్, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## వక్ఫ్ సవరణ బిల్లు చెల్లుబాటు కేసు

- మే20కి వాయిదా వేసిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ,మే15( వెలుతురు):**

వక్ఫ్ సవరణ చట్టం 2025 రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై మే 20న విచారణ చేపడతామని సుప్రీంకోర్టు గురువారం వెల్లడించింది. ఈ కేసులో మధ్యంతర ఉపశమనం అవసరమా కాదా అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఎ.జి.మసిహ్‌లతో కూడిన ధర్మాసనం పరిశీలించనుంది. అప్పటివరకు, కేంద్ర ప్రభుత్వం చట్టంలోని నిబంధనలు అమలు చేయదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఇచ్చిన హామీ కొనసాగుతుందని ధర్మాసనం తెలిపింది. ఈ పిటిషన్‌ల విచారణ నుండి భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా తప్పుకున్న సంగతి తెలిసిందే. ఈ నెల 13న తాను పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ అంశంపై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయాలనుకోవడం లేదని లేదా రిజర్వ్ చేయాలని కూడా అనుకోవడం లేదని మే 5న విచారణ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. ఈ వక్ఫ్ సవరణ చట్టాన్ని సవలు చేస్తున్న పిటిషన్‌లపై తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బి.ఆర్.గవారు నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపడుతుందని అన్నారు. విచారణను నేటికి వాయిదే వేశారు.

## ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిలిపివేయాల్సిందే

- అప్పడే సింధూజలాల గురించి ఆలోచిస్తాం
- విదేశాంగశ్శాఖ మంత్రి జైశంకర్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ,మే15( వెలుతురు):**

ఆపరేషన్ సిందూర్ తర్వాత, భారత్‌కు అంతర్జాతీయ సమాజం నుంచి మంచి మద్దతు లభిస్తుందని భారత విదేశాంగమంత్రి ఎస్ జై శంకర్ అన్నారు. పహల్గామ్ దాడి తర్వాత, భారతదేశం సింధు జల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ నిర్ణయంపై మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిలిపివేసే వరకూ ఈ ఒప్పందం నిలిపివేయబడుతుందన్నారు. ఈ క్రమంలో కశ్మీర్‌పై చర్చించాల్సిన ఒకే ఒక అంశం ఉందన్నారు. అది పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించిన భారత భూభాగాన్ని ఖాళీ చేయడం. దీని గురించి చర్చకు మేము సిద్ధంగా ఉన్నామని జైశంకర్ మరోసారి స్పష్టం చేశారు. కశ్మీర్ సమస్యపై ఎస్.జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో మూడో దేశం జోక్యం అవసరం లేదని, ఇది భారత్-పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక అంశమని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం పాకిస్థాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినట్లు కేంద్రమంత్రి చెప్పారు. పాకిస్థాన్ సైన్యాన్ని కాకుండా,ఉగ్రవాద కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నామని ముందే హెచ్చరించినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ, పాకిస్థాన్ ఈ సలహాను పట్టించుకోలేదన్నారు. భారతదేశంపై చేసిన దాడికి మా సైన్యం గట్టి ప్రతీకారం తీర్చుకుందన్నారు. శాటిలైట్ చిత్రాలు ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్‌కు జరిగిన భారీ నష్టాన్ని, భారతదేశానికి అతి తక్కువ నష్టాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని జైశంకర్ గుర్తు చేశారు. ఈ ఆపరేషన్ ద్వారా భారత సైన్యం తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిందన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత తీవ్రవాద రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉగ్రవాద సంస్థను నిషేధించాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ డిమాండ్ చేసింది. ఈ సంస్థకు వ్యతిరేకంగా ఆధారాలను సమర్పించేందుకు భారత్ సిద్ధంగా ఉంది. జైశంకర్ ఈ విషయంపై మాట్లాడుతూ పహల్గామ్ దాడిలో దోషులకు కఠిన శిక్ష విధించాలని ఐక్యరాజ్య సమితి సభ్యులు స్పష్టం చేశారు. ఈ విషయంలో భారత్‌కు అంతర్జాతీయ మద్దతు లభిస్తోందన్నారు. భారత్ దాడి తర్వాత పాకిస్థాన్ కూడా చైనా డ్రోన్‌లను ఉపయోగించినట్లు- జైశంకర్ వ్యాఖ్యానించారు. ప్రపంచం ఈ దాడిని చూసిందని అన్నారు.

# ఈ అధికారం మీకెవరు ఇచ్చారు?

చేశారు. ఈ మేరకు పలు ప్రశ్నలను సంధించారు. శాసనసభలో ఆమోదించిన బిల్లులను పరిశీలన పేరుతో గవర్నర్లు, రాష్ట్రపతి నెలల తరబడి జాప్యం చేస్తుండటంపై ఇటీవల సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న రాష్ట్రపతి, గవర్నర్లు గడువులోగా బిల్లులు ఆమోదించాల్సిందేనని ధర్మాసనం ఆదేశించింది. అయితే, తాజాగా అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాన్ని భారత ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము తీవ్రంగా ఖండించారు. ఈ ఆదేశాలు రాజ్యాంగం ప్రకారం ఎలా చెల్లుబాటు అవుతాయని సుప్రీంను ప్రశ్నిస్తూ 14 ప్రశ్నలను సంధించారు. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు రాష్ట్ర బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని తీర్పు వెలువరించింది. గడువులోగా ఆమోదించడమో, వెనక్కి తిప్పిపంపడమో ఏదొకటి చేయాలని స్పష్టం చేసింది. బిల్లులు ఆమోదించకపోతే ఎందుకనే కారణాలు కచ్చితంగా చెప్పాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా ఇలాగే చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని, రాజ్యాంగ అధికరణం 142 ప్రకారం గవర్నర్ల నిష్క్రియాపరత్వాన్ని న్యాయ సమీక్ష చేసేందుకు సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జేబి పార్దీవాలా, ఆర్ మహదేవన్ ధర్మాసనం వెల్లడించింది. అయితే, సుప్రీం ఇలా కాలపరిమితి విధించడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేది లేనప్పుడు ఈ తీర్పు ఎలా ఇవ్వగలరని రాష్ట్రపతి ముర్ము అత్యున్నత న్యాయస్థానాన్ని ప్రశ్నించారు. జస్టిస్ జేబి పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ఇచ్చిన 415 పేజీల తీర్పును సమీక్షించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) కింద రాష్ట్రపతికి ఉన్న అరుదైన అధికారాలను ఉపయోగించి 14 ప్రశ్నలపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. నూతన సీజేఐగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాష్ట్రపతి ముర్ము ఈ తీర్పుపై స్పందించడం గమనార్హం. ఆర్టికల్ 200 కింద బిల్లును ప్రవేశపెట్టినప్పుడు గవర్నర్‌కు అందుబాటులో ఉన్న రాజ్యాంగ ఎంపికలు ఏమిటి? ఈ ఎంపికలను అమలు చేయడంలో గవర్నర్ మంత్రి మండలి సలహాకు కట్టుబడి ఉంటారా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ విచక్షణాధికారం వినియోగించడం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ చర్యలను న్యాయపరంగా పరిశీలించడానికి ఆర్టికల్ 361 పై సంపూర్ణ నిషేధాన్ని విధిస్తారా? రాజ్యాంగం ప్రకారం కాలపరిమితి లేకపోయినప్పటికీ ఆర్టికల్ 200 కింద గవర్నర్లు తమ అధికారాలను వినియోగించు కునేటప్పుడు కోర్టులు గడువులు విధించవచ్చా, విధానాలను సూచించవచ్చా? ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి విచక్షణాధికారం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందా? ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి విచక్షణాధికారం వినియోగించడానికి కోర్టులు కాలపరిమితిని, విధానపరమైన అవసరాలను నిర్ణయించగలవా? గవర్నర్ రిజర్వ్ చేసిన బిల్లులపై నిర్ణయం తీసుకునేటప్పుడు రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరాలా? ఒక చట్టం అధికారికంగా అమల్లోకి రాకముందు గవర్నర్, రాష్ట్రపతి ఆర్టికల్ 200, 201 ప్రకారం తీసుకునే నిర్ణయాలు న్యాయబద్ధమైనవేనా? ఆర్టికల్ 142 ద్వారా రాష్ట్రపతి లేదా గవర్నర్ వినియోగించే రాజ్యాంగ అధికారాలను న్యాయవ్యవస్థ సవరించగలదా లేదా అధిగమించగలదా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ అనుమతి లేకుండా రాష్ట్ర చట్టం అమలులోకి వస్తుందా? సుప్రీంకోర్టులోని ఏదైనా బెంచ్ ముందుగా ఒక కేసుకు గణనీయమైన రాజ్యాంగ వివరణ అవసరమా అని నిర్ణయించి దానిని ఆర్టికల్ 145(3) ప్రకారం ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌కు నివేదించాలా? ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు రాజ్యాంగ లేదా చట్టబద్ధమైన నిబంధనలకు విరుద్ధంగా ఆదేశాలు జారీ చేయడం సబబేనా? ఆర్టికల్ 131 కింద దావా వేయడం ద్వారా కాకుండా వేరే మార్గాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి సుప్రీంకోర్టును రాజ్యాంగం అనుమతిస్తుందా? అంటూ ప్రశ్నలు సంధించారు. కాగా, రాజ్యాంగం ప్రకారం కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలకు గల అధికారాల పరిమితిపై రాష్ట్రపతి ముర్ము సంధించిన ప్రశ్నలకు సర్వోన్నత న్యాయస్థానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ముర్ము ప్రశ్నించినట్లు సమాచారం. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. రాజ్యాంగంలోని 143 ఆర్టికల్ కింద ఉన్న ప్రత్యేక అధికారాలను వినియోగించుకొని సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రపతి పలు ప్రశ్నలు సంధించినట్లు- ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రశ్నలపై న్యాయస్థానం తమ అభిప్రాయాలను తెలియజేయాలని అడిగినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై స్పందించేందుకు భారత ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన వద్దే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. దీనికి సంబంధించి 415 పేజీల తీర్పు వెలువరించింది. వర్నర్ గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని నిర్దేశించింది. బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపిస్తున్నట్లయితే అందుకు గల కారణాలనూ జత చేయాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా గవర్నర్లు బిల్లులపై జాప్యం చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని నేరుగా ఆశ్రయించవచ్చని, గవర్నర్ల నిష్క్రియాపరత్వం న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని స్పష్టంచేసింది. రాజ్యాంగ అధికరణం 142 ద్వారా అటువంటి సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం తేల్చి చెప్పింది.

# రెడ్ బుక్‌ను వదిలేది లేదు

ప్రభుత్వం చేయలేనిది 11నెలలో చేసి చూపించాం అని లోకేష్ అన్నారు.. కరెంటు చార్జీలు పెంచమని చెప్పాం. జగన్ నిర్వాకం వల్లే ట్రూ అప్ చార్జీలు వేయాల్సి వస్తోంది. దీనిపై మనం మాట్లాడకపోతే దెబ్బతింటాం. 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ ఇచ్చాం. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రానికి పెద్దఎత్తున కంపెనీలు వస్తున్నాయి. అనంతపురానికి రూ. 22వేల కోట్ల విలువైన భారీ సోలార్ విండ్ ప్రాజెక్టు వస్తోంది. విశాఖకు టీసీఎస్ డెవలప్ మెంట్ సెంటర్ వస్తోంది. రాబోయే ఐదేళ్లలో మనపిల్లలకు ఉద్యోగాలు వస్తాయన్నారు.. ప్రతి కార్యకర్త మన ప్రభుత్వం చేసింది చెప్పుకోవాలి, భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా 4వేల పెన్షన్ ఇవ్వడం లేదు. అవ్వతాతలకు అండగా నిలిచేందుకే పెన్షన్ పెంచాం, ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నాం. వాటిగురించి పార్టీ కార్యకర్తలంతా ప్రజల్లోకి వెళ్లి మాట్లాడాలని పిలుపునిచ్చారు.. గుంతకల్లు నియోజకవర్గం గుత్తి సమీపంలోని రామరాజుపల్లిలో ఉత్తమ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న లోకేష్.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే కసితో పనిచేయాలి. బాబు సూపర్ - 6, బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ-లో పార్టీ తరపున పలు హామీలు ఇచ్చాం. ఒక్కొక్కటిగా వాటిని అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటు-న్నాం. 11 నెలల ప్రజాప్రభుత్వంలో వృద్ధాప్య పెన్షన్ 4వేలకు, వికలాంగ పెన్షన్ 6వేలకు పెంచాం. రాష్ట్రవ్యాప్తంగా పేదల ఆకలితీర్చే అన్నక్యాంటీ-న్లు ప్రారంభించాం. ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేస్తున్నాం. ఈ పథకంలో నిబంధనలు సడలించి లబ్ధిదారుల ఎకౌంట్ లో నేరుగా డబ్బులు చేయాలని నిర్ణయించాం. మత్స్యకారులకు ఆర్థికసాయం అందించాం, చేనేతలకు 200 యూనిట్ల విద్యుత్ ఇచ్చాం. రోడ్లపై గుంతలన్నీ పూడ్చుకుంటూ వస్తున్నాం. జూన్ మాసంలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు ఇస్తాం. ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ముందుకెళు న్నాం అని తెలిపారు.. అయితే, మన ప్రభుత్వం స్కూళ్లు మూసివేస్తుందని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు నారా లోకేష్. ఒక్క పాఠశాలను కూడా మూయడం లేదు. అది మన లక్ష్యం కాదు. ఒక క్లాస్ కు ఒక టీచర్ ఉండాలన్నదే మన ధ్యేయం. మన ప్రభుత్వంలో వచ్చేనాటికి కేవలం 1200 స్కూళ్లలో క్లాసుకో టీచర్ ఉంటే, ఇప్పుడు 9800 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఉన్నాయి. గతంలో ప్రభుత్వ స్కూళ్లలో 45లక్షల మంది విద్యార్థులు ఉండగా, ఇప్పుడు 33లక్షలకు పడిపోయారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతాం. మంత్రి నారాయణ సహకారంతో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మంచి ఫలితాలు వచ్చాయి. మన ప్రభుత్వం జూన్ మాసానికి సంవత్సరం అవుతుంది. జూన్ నుంచి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఇస్తాం. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా అన్నీచేస్తాం. బీజేపీ, జనసేన పార్టీతో కలిసి పొత్తుతో పోటీ-చేశాం. నామినేటెడ్ పదవుల విషయంలో వారితో మాట్లాడి పదవులు ఇస్తున్నాం. కొందరు వైసీపీ వాళ్లు అపోహలు సృష్టిస్తున్నారు, వక్ఫ్ సవరణలు ప్రతిపాదించి ముస్లిం సోదరులకు అండగా నిలిచాం. ఎవరికీ ఇబ్బంది లేకుండా చూసుకునే బాధ్యత టీడీపీ చూసుకుంటుంది. జనసేనతో కలిసి పోటీ- చేశాం, భవిష్యత్తులో కలిసే ప్రయాణం చేస్తాం, మా మధ్య ఎలాంటి అరమరికలు లేవు అని స్పష్టం చేశారు..దేశవ్యాప్తంగా విశాఖ స్టీల్ తప్ప అన్ని ప్రైవేటీకరిస్తున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు సాయం చేస్తున్నారు. వైసీపీ వాళ్లు చిచ్చుపెట్టాలని చూస్తారు, సమర్థవంతంగా తిప్పికొట్టండి అని లోకేష్ పిలుపునిచ్చారు.. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎప్పుడూ లేనివిధంగా ప్రజలు కూటమికి 94శాతం సీట్లు- ఇచ్చారు. సునామీ మాదిరి ప్రజలు ఇచ్చిన తీర్పుతో చరిత్ర తిరగరాశాం, దీనివెనుక కార్యకర్తల కష్టం, త్యాగాలు ఉన్నాయి. నాలుగున్నర దశాబ్దాల్లో అధికారం, ప్రతిపక్షం రెండూ చూశాం. అయితే గత అయిదేళ్ల లాంటి అరాచక పాలన ఇదివరకెన్నడూ చూడలేదన్నారు.. ఇక, టీడీపీ రెండేళ్లకోసారి చేపట్టే సభ్యత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా చేసి చూపించారు. భారత్ లో ఏ పార్టీకి లేనివిధంగా కోటి సభ్యత్వాలు టీ-డీపీకే సొంతం. దానికి కార్యకర్తల కష్టమే కారణం. కార్యకర్తల బీమాను అయిదులక్షలకు పెంచాం, పేదపిల్లలకు నిరంతరం ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచిత విద్య అందిస్తున్నాం. కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం అన్నారు...ఇక, పార్టీ కేడర్ ఎర్ర బుక్ గురించి అడుగుతున్నారు. మన కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన వారిని వదలను.. నా అంతట నేనుగా ఎవరితో గొడవపెట్టు-కోను, మన జోలికి వస్తే మాత్రం వదలను అంటూ హెచ్చరించారు నారా లోకేష్. గత ప్రభుత్వంలో మద్యంలో ఎంత కుంభకోణం జరిగిందో రాష్ట్రమంతా చూస్తున్నారు. ప్రజలను చైతన్య వంతులను చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో కొంచెం సమయం ప-÷-టటొ-చ్చు. కార్యకర్తలు అహంకారం లేకుండా ప్రజల్లోకి వెళ్లి వారి చుట్టూ తిరగాలన్నారు.. పార్టీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు కేడర్ కు చేరవేసేందుకు మహానాడు తర్వాత కొత్త యాప్ పై టీడీపీ పేరుతో కొత్త యాప్ విడుదల చేస్తాం. కెఎస్ఎస్, బూత్, క్లస్టర్, అందరికీ ఒకే యాప్ ద్వారా కార్యక్రమాలపై సందేశాలు పంపిస్తాం. ఈనెల 18,19,20 నియోజకవర్గ స్థాయిలో మినీ మహనాడు జరుగుతుంది. 27,28, 29 కడపలో మన పెద్దపండుగ మహనాడు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో కార్యకర్తలంతా ఉత్సాహంగా పాల్గొనాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు..

## రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన తప్ప ఏమీ లేదు

- చట్టాన్ని అతిక్రమించే పోలీసులపై చర్యలు తప్పవు
- మాజీమంత్రి అంబటి రాంబాబు హెచ్చరిక



**గుంటూరు,మే15( వెలుతురు):**

కొంతమంది పోలీస్ అధికారులు చట్టాన్ని అతిక్రమిస్తున్నారు.. వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదు.. నిబంధనలు అతిక్రమించిన పోలీసు అధికారులను ఎవర్ని వదలం.. కచ్చితంగా చట్టం ముందు దోషులుగా నిలబెడతామని మాజీ మంత్రి అంబటి రాంబాబు హెచ్చరించారు.. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి కొద్ది రోజుల్లో సంవత్సరం కావస్తుంది.. వైసీపీ గత 5 ఏళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి, విశ్వసనీయత, ప్రజల కొనుగోళ్లు అన్ని బాగున్నాయి.. రాష్ట్రం అభివృద్ధి చెందింది.. కూటమి ఏడాది పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రం తిరోగమనం దిశగా అడుగులు వేస్తుందని విమర్శించారు.. వైఎస్ జగన్ ను ఏ విధంగా ఇబ్బంది పెడదాం అనే ధ్యాస తప్ప ప్రభుత్వానికి ఏమీ లేదు.. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన తప్ప ఏమీ లేదు.. ప్రజలు సూపర్ సిక్స్ హామీలు ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారని అంబటి అన్నారు.. వైఎస్ జగన్ మొదట బిజినెస్‌లో భాగంగా భారతి సిమెంట్ ను ప్రారంభించారు. లేని పోనీ కారణాలు చూపించి భారతి సిమెంట్ సంస్థ సెక్రెటరీ బాలాజీ గోవిందప్పను విజయవాడ జైలుకు పంపిస్తున్నారని ఆరోపించారు అంబటి రాంబాబు.. దేశంలో ఎక్కడ లేని విధంగా ఐజీ స్థాయి వ్యక్తిని అరెస్ట్ చేస్తున్నారు. ఈ విధంగా ఇండస్ట్రీ ప్రతినిధులను భయపెడితే ఏ విధంగా ఏపీకి పరిశ్రమలు వస్తాయి.? అని ప్రశ్నించారు.. రౌడీ మాములు ఇవ్వకపోతే పరిశ్రమలకు అనుమతులు ఇవ్వమని కూటమి ప్రజా ప్రతినిధులు తెగేసి చెప్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రజా ప్రతినిధులు బరితెగించి మరి దోచుకుంటు-న్నారు. కప్పం కట్టలేదని పల్నాడు జిల్లాలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రెండు సిమెంట్ కంపెనీలు మూసేయించాడు అని ఫైర్ అయ్యారు.. జాతీయ రహదారి కాంట్రాక్ట్ ల కోసం సీఎం రమేష్ , నారాయణరెడ్డి లాంటి పెద్ద పెద్ద నాయకులు కొట్టుకుంటున్నారు. దౌర్జన్యాలు, దుర్మార్గాలు చేసి, ఏడాది పాలన పూర్తి చేశారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఎందుకు ఓటు- వేశామని బాధ పడుతున్నారు.. గత ఐదేళ్ల వైసీపీనే బాగుంది అని ప్రజలు చెప్పుకుంటు-న్నారని వ్యాఖ్యానించారు.. ఇక, రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధి రెవిన్యూ తగ్గిపోయిందన్న రాంబాబు.. మోసానికి మారుపేరు చంద్రబాబు. అసలు ఒక పథకం అమలు చేయడానికి ఎంత బడ్జెట్ కావాలి, మీరు కేటాయిస్తుంది ఎంత..? అని ప్రశ్నించారు.. ప్రజలు మిమ్మల్ని ఎందుకు నమ్మాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు నిలదీశారు..

## రెండోరోజూ సిట్ ముందుకు ధనుంజయ్ రెడ్డి

**విజయవాడ,మే15( వెలుతురు):**

ఏపీ లిక్కర్ స్కాం కేసులో ధనుంజయ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి రెండో రోజు గురువారం సిట్ ముందు విచారణకు హాజరయ్యారు. లిక్కర్ స్కాంకు సంబంధించి ఇరువురిని సిట్ అధికారులు ప్రశ్నించారు. విచారణలో ఇద్దరిని వివిధ రూపాలలో సిట్ ప్రశ్నించింది. అయితే బుధవారం సరైన సమాధానాలు చెప్పకపోవడంతో గురువారం మరోసారి విచారణకు రావాల్సిందిగా సిట్ అధికారులు నోటీ-సులు ఇచ్చారు. ఈ క్రమంలోనే ఉదయం 10 గంటలకు ధనుంజయ్, కృష్ణ మోహన్ రెడ్డి సిట్ విచారణకు హాజరయ్యారు. కృష్ణ మోహన్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డిలను వేరు వేరుగా విచారించారు. అయితే మద్యం కుంభకోణంలో తమ పాత్ర లేదని వారు చెబుతుండగా.. ప్రమేయం ఉన్నట్లు- ఆధారాలు ఉన్నాయని సిట్ అధికారుల మాటగా ఉంది..మద్యం కుంభకోణం కేసులో సిట్ విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు. ముఖ్యంగా రెండు రోజుల క్రితం ఈ కేసులో ఏ33గా ఉన్న గోవిందప్ప బాలాజీని మైసూర్‌లో సిట్ అధికారులు అదుపులోకి తీసుకుని విజయవాడకు తరలించి విచారించారు. గోవిందప్పకు ఈనెల 20 వరకు రిమాండ్ విధించడంతో వెంటనే జైలుకు తరలించారు. అంతేకాకుండా గోవిందప్ప రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెల్లడించింది సిట్. గత ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ కుంభకోణంలో బాలాజీ గోవిందప్ప కీలక పాత్ర పోషించారని, జగన్ కుటు-ంబానికి సన్నిహితంగా ఉండే వ్యక్తి కాబట్టే ఈ స్కాంలో ఆయన కీలకంగా వ్యవహరించినట్లు- రిమాండ్ రిపోర్టులో తెలిపారు. మద్యం కంపెనీల నుంచి వచ్చిన ముడుపులతో బాలాజీ వ్యక్తిగతంగా లబ్ధి పొందారని.. భారీగా స్థిరాస్తులు సంపాదించినట్లు సిట్ వెల్లడించింది. ఈ కేసులో మరింత సమాచారం తెలుసుకోవాల్సి ఉన్నందున బాలాజీ గోవిందప్పను కస్టడీకి ఇవ్వాలని కోర్టును సిట్ అభ్యర్థించింది. నిన్న గోవిందప్పను కోర్టులో హాజరుపరిచిన సమయంలోనే అనూహ్యంగా ధనుంజయ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి.. సిట్ విచారణకు హాజరయ్యారు.

## విజయవాడ శ్మశానవాటిక కేసు

- 13మందిపై కేసు కొట్టివేత



**విజయవాడ, మే15( వెలుతురు):**
విజయవాడ అజిత్ సింగ్ నగర్ పోలీసులు... స్మశాన వాటిక అభివృద్ధికై–శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సిపిఎం, తెలుగుదేశం కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసును విచారించి ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ కోర్టు, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గురువారం కేసును కొట్టివేస్తూ, 13 మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పునిచ్చారు. విజయవాడ అజిత్ సింగ్ నగర్‌లోని హిందూ స్మశాన వాటిక అభివృద్ధి చేయాలని, దెబ్బతిన్న రేకుల షెడ్డు పునర్ నిర్మించాలని, దహన సంస్కారాలైనా సక్రమంగా జరుపుకునే అవకాశం కల్పించాలని కోరుతూ ... 2022 సంవత్సరం అక్టోబర్ 7వ తేదీన సిపిఎం ఆధ్వర్యంలో శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. దహన సంస్కారాలు నిర్వహించే రేకుల షెడ్డు దెబ్బతిని రేకులన్నీ పోయాయి. వర్షంలోనే దహన సంస్కారాలు చేసుకోవలసిన దుస్థితి ఏర్పడింది. దహన సంస్కారాలకు అటంకం కలుగుతున్నది. అనేక నెలలుగా విజ్ఞప్తులు, ఆందోళనలు చేసినా ఆనాటి వైసిపి ప్రభుత్వం, నగరపాలక సంస్థ ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. గత్యంతరం లేక స్మశాన వాటిక వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. బాబురావు, రాష్ట్ర కమిటీ– సభ్యుడు కాశీనాథ్, సెంట్రల్ సిటీ–నాయకులు రమణారావు, దుర్గారావు తదితరుల నేతృత్వంలో ఆందోళన నిర్వహించారు. నాటి వైసిపి ప్రభుత్వం స్మశాన వాటిక అభివృద్ధి చేయకపోగా, శాంతియుతంగా నిరసన తెలిపిన సిపిఎం, కార్యకర్తలపై అక్రమ కేసులు మోపింది. గత మూడు సంవత్సరాల నుండి 13 మంది నేతలు, కార్యకర్తలు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. తెలుగుదేశం నేతలు ప్రత్యేకంగా ఆందోళన చేయగా వారిపై కూడా కేసు నమోదు చేశారు. సిపిఎం ఇతర సంఘాలు, పార్టీలు దశలవారీగా చేసినప్పటికీ ఆందోళన ఫలితంగా స్మశాన వాటిక అభివృద్ధి పనులు ఆలస్యంగానైనా చేపట్టక తప్పలేదు. తెలుగుదేశం ప్రభుత్వం అక్రమ కేసులు రద్దు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, దాదాపు 11 నెలలు గడిచినా ఏ కేసులు ఎత్తివేయలేదు. ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ సూచనలతో న్యాయవాదులు సప్పొ రమేష్, కొండలరావు, ప్రేమ న్యాయ సహాయం అందించారు. విచారణ జరిపిన విజయవాడ, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నేడు కేసును కొట్టివేస్తూ తీర్పు ఇచ్చారు. 13 మందిని నిర్దోషులుగా ప్రకటించారు.న్యాయ సహాయం అందించిన న్యాయవాదులకు నేతలు అభినందనలు తెలిపారు.

## విజయవాడ బస్టాండ్‌లో రెచ్చిపోయిన గ్యాంగ్

- అధికారిపై పిడిగుద్దులు గుద్ది పరార్



**విజయవాడ , మే15( వెలుతురు):**
విజయవాడ బస్టాండ్‌లో గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. శ్రీశైలం పవర్ ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ సెక్రటరీ కృష్ణారావుపై విచక్షణారహితంగా ఆ గ్యాంగ్ దాడికి పాల్పడ్డారు. గురువారం ఉదయం శ్రీశైలం నుంచి విజయవాడ విద్యుత్ సౌదాకు విధి నిర్వహణపై వచ్చిన కృష్ణారావుపై గంజాయి బ్యాచ్ పిడిగుద్దులతో దాడి చేసి అక్కడి నుండి పారిపోయారు. వీరి నుంచి తప్పించుకుని ప్రాణాలు దక్కించుకున్న కృష్ణారావు అక్కడి నుంచి బస్టాండ్‌లోకి పరుగులు తీశారు. అనంతరం కొండపల్లిలోని తన నివాసానికి చేరుకున్నారు. కృష్ణారావు బస్ దిగి వస్తుండగా సిటీ బస్ టెర్మినల్ దగ్గర ఈ ఘటన జరిగింది. అయితే దాడి చేసిన వారు ఎవరో తనకు తెలియదని, నగదు, వస్తువులు ఏవీ అడగలేదని కేవలం దాడి చేసి పారిపోయారని చెప్పారు. బాధితుడు కృష్ణారావు మాట్లాడుతూ ... 'బస్టాండ్ నుంచి ఆటో కోసం వచ్చాను. వెనక నుంచి ఇద్దరు వ్యక్తులు వచ్చి నన్ను బాగా కొట్టారు. చంపేయబోయారు. వాళ్లు ఎవరో నాకు తెలీదు. ఎందుకు కొట్టారో కూడా తెలియదు. డబ్బులు ఏమీ అడగలేదు. సైలెంట్‌గా వచ్చి బాగా కొట్టి వెళ్లిపోయారు. వాళ్లు బాగా మత్తులో ఉన్నట్టున్నారు. మొహంపై దెబ్బలు తగిలాయి. గుండెలపై తన్నారు. వారిని నుంచి తప్పించుకుని పారిపోయారు. దాడి జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేరని వివరించారు.

## వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ స్కామ్

- ముంబై, హైదరాబాద్‌లలో ఇడి సోదాలు
- భారీగా నగదు, ఆభరణాలు స్వాధీనం

**హైదరాబాద్,మే15( వెలుతురు):**
హైదరాబాద్‌లో మరోసారి ఈడీ సోదాలు కలకలం సృష్టించాయి. ముంబయి వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ స్కామ్‌లో దర్యాప్తును ఈడీ ముమ్మరం చేసింది. ముంబయి వసాయి విరార్ మున్సిపల్ కార్పోరేషన్ స్కామ్‌లో భాగంగా ఈడీ అధికారులు.. ముంబై, హైదరాబాద్‌తో పాటు 12 ప్రాంతాల్లో గురువారం సోదాలు నిర్వహించారు. ముంబైలో టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ– డైరెక్టర్‌గా పనిచేస్తున్న వైఎస్ రెడ్డి నివాసంలో ఈడీ అధికారులు తనిఖీలు చేసి.. భారీగా నగదును గుర్తించినట్లు సమాచారం. మొత్తం రూ.9 కోట్లకు పైగా నగదుతో పాటు రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తులో భాగంగా గురువారం ముంబయి, హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. రూ.9.04 కోట్ల నగదు, రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ తెలిపింది. ముంబయిలోని మిరా భయాందర్ కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు– స్థలాల్లో అక్రమ నిర్మాణాలకు 2009 నుంచి అనుమతులు ఇచ్చారు. ఈ కేసులో సీతారాం గుప్తా, అరుణ్ గుప్తా కీలక నిందితులుగా ఉన్నారు. నిందితులు అధికారులతో కలిసి ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టి ప్రజలకు విక్రయించినట్టు– దర్యాప్తులో తేలింది. ఇందులో భాగంగా వీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ– డైరెక్టర్ వైఎస్ రెడ్డి నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించింది. సోదాల్లో నిందితుల ఇళ్లలో నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ తెలిపింది.

# గిగ్ వర్కర్స్ కోసం చట్టం సిద్ధం



**హైదరాబాద్, మే15( వెలుతురు):**
గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్స్ కోసం ప్రత్యేక బిల్లును తీసుకొస్తున్నట్లు ప్రకటించింది తెలంగాణ ప్రభుత్వం.ముసాయిదా బిల్లును విడుదల చేసి, దానిపై అభ్యంతరాలు తీసుకుంటోంది.వీటి ఆధారంగా తుది బిల్లును తయారు చేసి అమల్లోకి తీసుకువస్తామని చెబుతోంది ప్రభుత్వం.అయితే, తాము ఆశించిన మేరకు బిల్లు తీసుకురాలేదంటున్నారు తెలగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు.2022 జూన్‌లో నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం... 2020–21 నాటికే భారత్‌లో 77లక్షల మంది గిగ్ రంగంలో ఉపాధి పొందుతున్నట్లుగా గుర్తించారు. ప్రస్తుతం ఈ సంఖ్య ఇంకా ఎక్కువ ఉండవచ్చని అంచనా.దేశ శ్రామిక రంగంలో గిగ్ వర్కర్స్ వాటా 1.5 శాతంగా ఉందని నీతి ఆయోగ్ తన నివేదికలో పేర్కొంది.2029–30 నాటికి గిగ్ వర్కర్లు సుమారు 2.35 కోట్లకు చేరుతారని, శ్రామిక రంగంలో వీరి వాటా 6.7శాతానికి చేరుకుంటుందని అంచనా.గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్‌కు సామాజిక భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది నీతి ఆయోగ్.తెలంగాణలో 4.20 లక్షల మంది గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ ఉన్నారని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ బీబీసీతో చెప్పారు.స్విగ్గీ, జొమాటో, ర్యాపిడో, ఓలా లాంటి యాప్ బేస్డ్ ట్యాక్సీ డ్రైవర్స్ లేదా మోటార్ సైకిల్ రైడర్స్, డెలివరీ ఏజంట్స్‌తో పాటు గిగ్ అండ్ మార్కెట్ ప్లాట్‌ఫాంలలో పనిచేసే ఫ్రీలాన్స్ లేదా పార్ట్ టైం వర్కర్లందరూ గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్స్ కిందకు వస్తారు.తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్స్ (రిజిస్ట్రేషన్, సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్) యాక్ట్, 2025 పేరుతో ముసాయిదా బిల్లు ఉంది.ప్రస్తుతం ఈ ముసాయిదా బిల్లుపై అభ్యంతరాలు తీసుకుంటోంది తెలంగాణ కార్మిక శాఖ.ప్రత్యేకంగా తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇది చట్టం వర్తించే తేదీ నుంచి అందుబాటులోకి వస్తుంది.బోర్డు ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉంటుంది.బోర్డులో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి ఎక్స్–అఫీషియో ఛైర్‌పర్సన్‌గా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించే అధికారి కార్యదర్శిగా ఉంటారు.కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒకరు, రాష్ట్ర కార్మిక శాఖ, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేదా ముఖ్య కార్యదర్శి లేదా కార్యదర్శి, ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, రవాణా శాఖ పిన్సిపల్ సెక్రటరీ, కార్మిక శాఖ కమిషనర్ ఎక్స్–అఫీషియో సభ్యులుగా ఉంటారు.గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ తరఫున నలుగురు సభ్యులు (ఒక మహిళ), అగ్రిగేటర్స్ నుంచి నలుగురు సభ్యులు (ఒక మహిళ), పౌర సమాజం నుంచి ఇద్దరు ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.వీరిని రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. డాటా కలెక్షన్, ఐటీ సిస్టమ్స్ పరంగా సాంకేతిక నిపుణుడు ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉంటారు. వీరి పదవీకాలం మూడేళ్లు ఉంటుంది.గిగ్ వర్కర్లుగా పనిచేసే వ్యక్తులు రాష్ట్ర ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేసుకుంటే ప్రతి కార్మికుడికీ ఓ యూనిక్ ఐడీ ఇస్తారు.అగ్రిగేటర్స్ లేదా ప్లాట్‌ఫాంలు ఈ చట్టం అమల్లోకి వచ్చిన 45 రోజులలోగా వెల్ఫేర్ బోర్డులో తమ సంస్థలు లేదా కంపెనీలను రిజిస్టర్ చేసుకోవాలి.ఆయా సంస్థలు వర్కర్స్ విషయంలో మతం, జాతి, కులం, లింగం పుట్టిన స్థలం, వైకల్యం ఆధారంగా ఎలాంటి వివక్ష చూపించకూడదు.ఎవరైనా వర్కర్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలంటే ఏడు రోజుల ముందుగా రాతపూర్వక నోటీసు ఇవ్వాలి.కానీ, వినియోగదారుడు (కస్టమర్)కి హాని జరిగిందని గుర్తిసే వెంటనే తొలగించే అధికారం ఆయా సంస్థలకు ఉంటుంది.వర్కర్స్‌కు ఇచ్చే వేతనాల్లో కోత పెడితే, వాటిని వారికి చేసే పేమెంట్స్ ఇన్‌వాయిస్‌లో చూపించాలి.గిగ్ వర్కర్స్ చేసే ఫిర్యాదులు లేదా సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేకంగా ఒక వ్యక్తిని ప్రతి ప్లాట్‌ఫాం నియమించుకోవాలి. సదరు వ్యక్తి వివరాలు వర్కర్‌కు తెలిసేలా ప్లాట్‌ఫాం అప్లికేషన్‌లో ఉండాలి.రాష్ట్ర ప్రభుత్వం గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ కోసం ప్రత్యేక నిధి (తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్ ఫండ్) ఏర్పాటు చేయనుంది.నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో ఇవ్వడంతోపాటు సంస్థలు, గిగ్ వర్కర్స్ ఇచ్చే మొత్తాన్ని ఫండ్‌లో జమచేస్తారు.తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ ఫీజును అగ్రిగేటర్స్ లేదా ప్లాట్‌ఫామ్స్ నుంచి వసూలు చేస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది.గిగ్ అండ్ ప్లాట్?ఫాం వర్కర్లకు చెల్లింపుల్లో ఒకశాతం తక్కువ కాకుండా, రెండు శాతానికి మించకుండా ఫీజు ఉంటుంది. 'సంస్థల తరఫున జరిగే లావాదేవీలన్నీ వెల్ఫేర్ ఫండ్ ఫీ వెరిఫికేషన్ సిస్టమ్ (డబ్ల్యూఎఫ్ఎఫ్వీఎస్) తో మ్యాప్ చేసి ఉంటుంది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం, బోర్డు పర్యవేక్షిస్తుంది" అని బిల్లులో ప్రతిపాదించింది తెలంగాణ ప్రభుత్వం.'సంస్థలు వెల్ఫేర్ ఫండ్ ఫీజు చెల్లించని పక్షంలో ఏడాది జైలు లేదా రెండు లక్షల రూపాయల వరకు జరిమానా లేదా రెండూ విధించే వీలుంటుంది. ఆయా సంస్థలు సమాచారం, స్టేట్‌మెంట్, రిపోర్టులు ఇచ్చేందుకు నిరాకరిస్తే, రూ.50 వేల వరకు జరిమానా విధించే వీలుంటుంది" అని ప్రభుత్వం చెబుతోంది.రాష్ట్ర ప్రభుత్వం తరఫున గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ కోసం ప్రత్యేక ఫండ్ ఏర్పాటు చేస్తానని చెబుతున్నప్పటికీ, అది ఎంత అనేది చట్టంలో ప్రస్తావించలేదని చెబుతున్నారు గిగ్ వర్కర్లు."కనీస వేతనాలు, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత హక్కులు చట్టంలో పెట్టాలి. వీటిని నిబంధనలకే పరిమితం చేయకూడదు" అని బీబీసీతో చెప్పారు సలావుద్దీన్.అయితే, అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్ల పాలసీని తీసుకువస్తున్నామని, మే ఒకటో తేదీన కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రకటించారు సీఎం రేవంత్ రెడ్డి.అధికారం చేపట్టిన వెంటనే అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ.5 లక్షల ప్రమాద బీమా అమలు చేశామని ఆయన చెప్పారు.గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ నుంచి వచ్చే విజ్ఞప్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమిస్తుందని బిల్లులో ప్రభుత్వం ప్రతిపాదించింది.మరోవైపు, "ప్రభుత్వం ప్రతిపాదించిన బోర్డులో వర్కర్స్, ప్లాట్ ఫాంలు, ప్రభుత్వం నుంచి సమాన ప్రాతినిధ్యం ఉండాలి. బోర్డ్ కేవలం సలహాలివ్వడానికే పరిమితం కాకుండా జరిమానాలు విధించడం, కంపెనీలపై పర్యవేక్షణ, విచారణ నిర్వహించే అధికారం ఉండాలి" అని సలావుద్దీన్ సూచించారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023 నవంబరులో గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్లతో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సమావేశమయ్యారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక చట్టం తీసుకువస్తామని అప్పట్లో ఆయన హామీ ఇచ్చారు.తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబరులో సీఎం రేవంత్ రెడ్డి.. గిగ్ వర్కర్లతో సమావేశయ్యారు."రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలోనూ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకువస్తాం" అని చెప్పారు.ఇందులో భాగంగా తెలంగాణలో ప్రత్యేక చట్టం తీసుకువచ్చేందుకు ముసాయిదా బిల్లును తెలంగాణ ప్రభుత్వం జారీ చేసింది.ఇప్పటికే దేశంలో రాజస్థాన్, కర్ణాటకలో గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్ల సంక్షేమానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకువచ్చాయి.బీమా సదుపాయం కల్పించడంతో పాటు ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ వంటివి కల్పించాలని కోరారు.ప్రస్తుతం ముసాయిదా బిల్లు విడుదల చేసిన నేపథ్యంలో అభ్యంతరాల స్వీకరణకు ప్రభుత్వం ఏప్రిల్ 29 నుంచి మూడు వారాల గడువు ఇచ్చింది."ముసాయిదా బిల్లుపై అభ్యంతరాలను tg.gig.labour@gmail.com కు మెయిల్ చేయవచ్చు లేదా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మికశాఖ భవన్‌లో రాతపూర్వకంగా ఇవ్వచ్చు" అని కార్మిక శాఖ ప్రకటించింది.

# స్విమ్స్ కు పూర్తి స్థాయి సౌకర్యాలు




**తిరుపతి, మే15( వెలుతురు):**
తిరుపతి స్విమ్స్‌లో వైద్య సేవలను మరింత ఉన్నతంగా అందించేందుకు టిటిడి చైర్మెన్ బీఆర్ నాయుడు నేతృత్వంలో చర్యలు చేపట్టారు. బుధవారం జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో, మాజీ టిటిడి ఈవో ఐవి సుబ్బరావు అధ్యక్షతన ఏర్పాటైన ఎక్స్‌పర్ట్ కమిటీ సమర్పించిన నివేదికపై చర్చించారు. ఈ నివేదికలో మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, వైద్య పరికరాలు, ఇంజనీరింగ్ పనులు, నిధుల సేకరణ, వైద్య నిపుణుల సేవలు వంటి అంశాలపై సిఫార్సులు ఉన్నాయి. ఈ నివేదికను టిటిడి బోర్డులో చర్చించి, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని చైర్మెన్ తెలిపారు.శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్), తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తిరుపతిలో నడిచే ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థ. స్విమ్స్ ఆస్పత్రి ద్వారా ఎంతో మంది పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. 2021లో స్విమ్స్ ఆస్పత్రిని టీటీడీ తన నియంత్రణలోకి తీసుకుంది. మరోవైపు తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు టీటీడీ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన బుధవారం స్విమ్స్ సమావేశ మందిరంలో జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన టీటీడీ ఛైర్మన్ స్విమ్స్ ఆస్పత్రిలో మరింత మెరుగైన సేవలు అందిస్తామన్నారు. ఇందుకోసం మాజీ టీటీడీ ఈవో ఐవీ సుబ్బారావు నేతృత్వంలో నిపుణుల కమిటీ వేశామని.. ఈ నిపుణుల కమిటీ అధ్యయనం చేసి నివేదిక సమర్పించిందని బీఆర్ నాయుడు తెలిపారు.నిపుణుల కమిటీ అందించిన నివేదిక ఆధారంగా స్విమ్స్ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, వైద్య పరికరాలు, ఇంజనీరింగ్ పనులు చేపట్టనున్నట్లు టీటీడీ ఛైర్మన్ వెల్లడించారు. మరింత ఉన్నతంగా వైద్య సేవలు అందించేందుకు వైద్య నిపుణుల సేవలు, నిధుల సేకరణ అంశాల గురించి కూడా నిపుణుల కమిటీ పలు సూచనలు చేసిందని.. ఈ నివేదికపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు. మరోవైపు స్విమ్స్ ఆసుపత్రికి టీటీడీ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ఏటా టీటీడీ నుంచి స్విమ్స్ ఆస్పత్రికి రూ. 60 కోట్ల గ్రాంట్ అందించటంతో పాటుగా.. ఎంప్లాయిస్ హెల్క్ స్కీం, ప్రాణదాన ట్రస్ట్ , వివిధ రకాల ట్రస్టుల ద్వారా రూ. 100 కోట్లకుపైగా మద్దతుగా అందిస్తున్నామని వివరించారు.స్విమ్స్ ఆస్పత్రిలో ఏడాదికి 18,000 సర్జరీలు జరుగుతుంటాయని.. 4.50 లక్షల మందికి పైగా ఔట్ పేషంట్లు, 47 వేలమంది ఇన్‌పేషెంట్లు వైద్య సేవలు పొందుతున్నారని టీటీడీ ఈవో శ్యామలరావు వివరించారు. స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో పేదలే అత్యధికంగా ఉన్నారని.. భవిష్యత్ తరాలకు సరిపడేలా ప్లాన్ ప్రకారం స్విమ్స్ ఆస్పత్రిలో నూతన భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అంకాలజీ , చిన్న పిల్లల ఆరోగ్యం కోసం నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు.మరోవైపు స్విమ్స్ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో నిర్మితమవుతున్న క్యాన్సర్ భవనాన్ని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అంతకుముందు పరిశీలించారు. 391 పడకల సామర్థ్యంతో ఈ క్యాన్సర్ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో 5 ఆపరేషన్ థియేటర్లు ఉండనున్నాయి. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న పలువురు రోగులతో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ముచ్చటించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు

## శాతవాహనలో లా కోర్సు...

**కరీంనగర్, మే15( వెలుతురు):**
కరీంనగర్‌లోని శాతవాహన విశ్వ విద్యాలయం పరిధిలో లా కాలేజీ (న్యాయ కళాశాల) ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయగా అనుమతి కోసం కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన క్రుషి ఫలించింది. లా కళాశాల అనుమతికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. ఈ విద్యా సంవత్సరం నుండే అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి.మంది విద్యార్థులతో(రెండు సెక్షన్లు) ఎల్ఎల్ బి కోర్సు ప్రారంభం కానుంది. శాతవాహన వర్శిటీలో లా కళాశాల మంజూరు చేయాలని కోరుతూ వర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ గతంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కోరారు. ఈ నేపథ్యంలో గత నెల మొదటి వారంలో ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్, మాజీ మేయర్ సునీల్ రావును వెంటబెట్టుకుని బండి సంజయ్ న్యూఢిల్లీలోని కేంద్ర న్యాయశాఖ మంత్రిత్వ కార్యాలయానికి వెళ్లారు.సంబంధిత శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ ను కలిసి లా కాలేజీని మంజూరు చేయడంతోపాటు ఈ ఏడాది నుండే అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా చూడాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. మొత్తం 120 మందితో (రెండు సెక్షన్లతో కలిపి) లా కాలేజీని నడిపేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ విషయంపై వర్చువల్ గా శాతవాహన వర్శిటీని వర్చువల్ గా తనఖీ చేయడంతోపాటు వివరణలతో కూడిన నివేదిక కోరిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా బండి సంజయ్ గుర్తు



చేశారు. బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు వివరణాత్మక నివేదికను పంపినట్లు తెలిపారు. కాలేజీ అనుమతికి ఆమోదం తెలపడంతోపాటు వచ్చే విద్యా సంవత్సరం నుండే ఎల్ ఎల్ బీ కోర్సును ప్రారంభానికి అనుమతి ఇవ్వడం గమనార్హం. మూడేళ్ల లా డిగ్రీకి అనుమతులు లభించింది. 2025–26 అకాడమిక్ ఇయర్ నుండి తరగతులు ప్రారంభంఅవుతాయి., కొత్త కోర్సుల మౌలిక ఏర్పాటులో విశ్వవి ద్యాలయం ముందుకు సాగు తుంది. తొడ్పా టు అందించిన రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్ కి, కేంద్ర మంత్రి బండి సంజయకుమార్‌కి కేంద్ర చట్ట,న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ కి కృతజ్ఞతలు తెలిపారు.

# లభ్యం కాని మాజీమంత్రి కాకాణి ఆచూకీ

- రెండు నెలలుగా ముమ్మరంగా గాలింపు



**నెల్లూరు,మే15( వెలుతురు):**
మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. క్వార్జ్ కేసులో రెండు నెలలుగా కాకాణి తప్పించుకుని తిరుగుతున్నారు. దీంతో హైదరాబాద్, బెంగళూర్‌లో నెల్లూరు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కాకాణి బంధువుల ఇళ్లు, ఫాంహౌజ్‌లలో గాలిస్తున్నారు. మరోవైపు క్వార్జ్ కేసులో మరో 12 మందికి పోలీసులు నోటీ-సులు ఇచ్చారు. క్వార్జ్ కేసులో మాజీ మంత్రి కాకాణి ఏ4గా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి గతంలో హైకోర్టును ఆశ్రయించి బెయిల్ పొందే ప్రయత్నాలు చేశారు. అయితే ఆ ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. దాంతో రెండు నెలలుగా మాజీ మంత్రి పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నారు. హైదరాబాద్‌లో కొద్దిరోజులు, బెంగళూర్‌లో కొన్నాళ్లు ఉంటూ పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నట్లు- తెలుస్తోంది. కనీసం ఇంట్లో వాళ్లకు కూడా వాట్సప్ కాల్ మాట్లాడనట్లు- సమాచారం. నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాస్ నేతృత్వంలో రెండు పోలీసు బృందాలు బెంగళూరులో పెద్ద ఎత్తున్న విస్తృతంగా జల్లెడపడుతున్నాయి. రి-టైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారికి సంబంధించిన ఇళ్లల్లోనే కొంతకాలం వరకు తలదాచుకున్నట్లు- సమాచారం. దీంతో పోలీసులు అక్కడ కూడా తనిఖీలు చేపట్టారు. బెంగళూరులోని కాకాణి స్నేహితులు, బంధువులకు సంబంధించిన ఇళ్లు, ఫాంహౌజ్‌లు, గెస్ట్‌హౌజ్‌లలో కూడా పోలీసులు జల్లెపడుతున్నారు. కాకాణి కోసం గాలింపు ముమ్మరం చేశారు. మరోవైపు హైదరాబాద్‌లో కూడా రెండు పోలీసు బృందాలు కాకాణి కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి. అంతేకాకుండా ఈ కేసుకు సంబంధించి పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ సాగిస్తున్నారు. ఈ క్రమంలో సుప్రజ అనే మహిళ అకౌంట్‌లోకి భారీ ఎత్తున కోట్లాది రూపాయలు ట్రాన్సాక్షన్స్ జరిగినట్లు- గుర్తించారు. ఆమె ఇంటికి కూడా పోలీసులు వెళ్లి నోటీ-సులు ఇచ్చేందుకు ప్రయత్నించారు. అయితే ఆమె నోటీ-సులు తీసుకోకపోవడంతో ఇంటి గోడకు నోటీ-సులు అంటించారు. అలాగే ఈ కేసులో 12 మందిని పోలీసులు గుర్తించారు. అందులో కాకాణి అల్లుడు కూడా ఉన్నారు. వీరందరికీ నోటీ-సులు ఇచ్చేందుకు వెళ్లగా.. వారు లేకపోవడంతో ఇంటి గోడలకు నోటీ-సులు అంటించి వస్తున్నారు. రెండు మూడు సార్లు నోటీ-సులు ఇచ్చాక వారు స్పందించకపోతే వారందరినీ కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది. ప్రస్తుతం క్వార్జ్ కేసు విచారణ చాలా వేగవంతంగా సాగుతోంది. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో పోలీసులు బృందాలు యాక్టివ్‌గా పనిచేస్తూ గతంలో కంటే కూడా గాలింపును ముమ్మరం చేశాయి. ఏ క్షణమైనా కాకాణి గోవర్ధన్‌ను అరెస్ట్ చేసే అవకాశాలు ఉన్నట్లు- ప్రచారం జరుగుతోంది.

# స్వల్పంగా మెట్రో ఛార్జీల వడ్డన

- కనిష్ట ధర 12..గరిష్ట ధర 75కు పెంపు
- 17వ తేదీనుంచి అమల్లోకి వస్తున్నట్లు ప్రకటన



**హైదరాబాద్, మే15( వెలుతురు):**
మెట్రో రైలు ప్రయాణించే ప్రయాణికులకు ధరలవాత మొదలయ్యింది. ధరలను పెంచుతూ.. నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైలు ఛార్జీలు పెంచుతున్నట్లు- హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ గురువారం ప్రకటించింది. ఇకపై మెట్రో రైలు టికెట్ ధర కనిష్టంగా రూ.12 కాగా.. గరిష్టంగా రూ.75గా పెరగనుంది. ప్రస్తుతం మెట్రో రైలులో టికెట్ కనిష్ట ధర రూ. 10.. గరిష్టంగా రూ.60గా ఉంది. ఈ పెంచిన ధరలు మే 17వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించింది. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సులువుగా ప్రయాణికులను ఈ మెట్రో రైలు గమ్యస్థానాలకు చేరుస్తుంది. అటు ఎల్ బీ నగర్ నుంచి ఇటు మియాపూర్ వరకు.. అలాగే ఇటు నాగోలు నుంచి అటు రాయదుర్గం వరకు ప్రయాణించే ఈ మెట్రో రైలు నగరవాసులను అతి కొద్ది కాలంలోనే ఆకట్టు-కుంది. ప్రతి రోజు ఈ రైళ్లలో లక్షలాది మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. నగరంలో భారీ వర్షం పడినప్పుడు.. ప్రయాణికులు ఈ మెట్రో రైళ్లను ఆశ్రయిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే విశ్వ నగరం వేదికగా క్రికెట్ మ్యాచ్‌లు జరిగినప్పుడు.. మెట్రో ప్రత్యేక సర్వీసులను సైతం నడుపుతోంది. అయితే మెట్రో నష్టాల్లో నడుస్తున్న నేపథ్యంలో ఛార్జీల పెంపు ప్రతిపాదన గతంలోనే వచ్చింది. దీనిపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో నాడు ఛార్జీల పెంపు ప్రతిపాదనపై మెట్రో రైలు సంస్థ వెనకడుగు వేసింది. కానీ మెట్రో రైలు సేవల కారణంగా.. హైదరాబాద్ మెట్రో రైలు సంస్థకు భారీ నష్టం వాటిల్లుతోంది. దీంతో ఛార్జీల పెంపు అనివార్యమైందని తెలుస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రభుత్వంతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు- సమాచారం. మరోవైపు హైదరాబాద్ మెట్రో రైలు భారీ నష్టాలతో నడుస్తుందని ఇప్పటికే ఎల్ అండ్ టీ సంస్థ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మెట్రో ఛార్జీలు పెంపు అనివార్యమని స్పష్టం చేసింది. దీంతో మే 10వ తేదీ తర్వాత మెట్రో ఛార్జీలు పెంచుతామని ఇప్పటికే స్పష్టం చేసింది. అందులోభాగంగా మే 17వ తేదీ నుంచి ఈ ఛార్జీల పెంపు వర్తిస్తుందని ఆ సంస్థ వెల్లడించింది. ప్రభుత్వం అందిస్తున్న మహిళలు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన మహాలక్ష్మి పథకం వల్ల మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మెట్రో రైలు నష్టాల బాటలో నడిచేందుకు ఇది ఒక కారణమని ఎల్ అండ్ టీ- సంస్థ ఇప్పటికే అభిప్రాయపడిన సంగతి తెలిసిందే. అయినా మెట్రోలో ప్రయాణించందుకు నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు.

# గులాబీలో కుర్చీలాట

**హైదరాబాద్, మే15( వెలుతురు):**
భారత రాష్ట్ర సమితి బీఆర్‌ఎస్ చీలిక ముంగిట నిలిచిందా? ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు.. తన వారసుడి ప్రకటనకు ముహూర్తం పెట్టేసి రాజకీయ విరమణ లేదా రాజకీయ సన్యాసానికి రంగం సిద్ధం చేసేసుకున్నారా? అంటే బీఆర్‌ఎస్ లో గత కొన్ని రోజులుగా వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే ఔనన్న సమాధానమే వస్తున్నది. గత కొంత కాలంగా ఒక పద్ధతి ప్రకారం పార్టీలో హరీష్ రావు ప్రాధాన్యత తగ్గుతూ లేదా తగ్గిస్తూ వస్తున్న తీరు, అలాగే ఇటీవలి కాలంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ, పార్టీ అధినేత కుమార్తె కల్వకుంట్ల కవిత పార్టీ లైన్ కు భిన్నంగా చేస్తున్న వ్యాఖ్యలు గమనిస్తే.. పార్టీ పగ్గాల విషయంలో బీఆర్‌ఎస్ లో మూడు కుర్చీలాట జోరుగా సాగుతున్నదని పరిశీలకులు అంటున్నారు. 2023 ఎన్నికలలో బిఆర్‌ఎస్ పరాజయం తరువాత నుంచీ ఆ పార్టీ అధినేత కేసీఆర్ పొలిటికల్ గా ఏమంత యాక్టివ్ గా లేరు. ఇంత కాలం ఆయన రాజకీయాల నుంచి తాత్కాలిక విరామం మాత్రమే తీసుకున్నారని అంతా భావిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడిప్పుడే పార్టీ వర్గాలలో కూడా ఆయన తీసుకున్నది తాత్కాలిక విరామం కాదనీ, రాజకీయ విరమణేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు పూర్తిగా పగ్గాలు అప్పగించేయడమే తరువాయి అన్న వార్తలు కూడా గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అందుకు అనుగుణంగా కేసీఆర్ నెమ్మదిగా పావులు కదుపుతున్నారని అంటున్నారు. అందులో భాగంగానే ఇటీవల వరంగల్ వేదికగా జరిగిన పార్టీ పాతికేళ్ల సభలో హరీష్ రావు ప్రస్తావన, ప్రాముఖ్యత ఇసుమంతైనా లేకుండా అంతా కేటీఆరే అన్నట్లుగా నిర్వహించారంటున్నారు. అదే సమయంలో విషయాన్ని గుర్తించిన హరీష్ రావు తన దారి తాను చూసుకునేందుకు నిర్ణయించుకున్నారన్న వార్తలూ జోరుగా వినిపించాయి. అదే సమయంలో కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత కూడా తన సంగతేంటంటూ గొంతెత్తుతున్న పరిస్థితి కనిపిస్తోంది. తాజాగా ఆమె రామానుజపురంలో నాంచారమ్మ జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోది చెప్పే నాంచారమ్మలు కవిత భవిష్యత్ లో తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. వారి మాటలను చిరునగవుతో విన్న కవిత జై తెలంగాణ అంటూ నినదించారు. ఈ సంఘటన యథాలాపంగా జరిగింది కాదనిపరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కొద్ది రోజుల కిందట ఆమె సామాజిక తెలంగాణ సాధన ఇంకా మిగిలే ఉందంటూ చేసిన వ్యాఖ్యకు దీనిని జోడించి సొంత సోదరుడు కేటీఆర్ కు పార్టీ పగ్గాలు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నారంటున్నారు. అది పక్కన పెడితే.. సందర్భంతో సంబంధం లేకుండా తాను కేసీఆర్ ఎవరికి పగ్గాలు అప్పగించినా స్వాగతిస్తానంటూ హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను కూడా ఆయనలోని అసంతృప్తికి, అసహనానికీ తార్కానంగా చెబుతున్నారు. అదే సమయంలో హరీష్ పార్టీ తదుపరి అధ్యక్షుడి విషయం లేవనెత్తడాన్ని కేసీఆర్ పొలిటికల్ రిటైర్మెంట్ కు రెడీ అయిపోయారన్న సంకేతాన్ని ఇవ్వడమేనని చెబుతున్నారు. పార్టీ శాసనసభా పక్ష నేతగా కేటీఆర్ అంగీకరించని పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు.. ఇప్పుడు ఏకంగా పార్టీ అధ్యక్ష పగ్గాలనే అప్పగిస్తానని కేసీఆర్ అంటే అంగీక రిస్తారా అన్న అనుమానాలూ సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. పార్టీ అధినేతగా కేసీఆర్ ఉన్నంత వరకూ ఆయన అభిప్రాయాన్ని కాదని ఎవరూ అనరు కానీ, ఒక సారి ఆయన ఆ స్థానం నుంచి తప్పుకుంటే మాత్రం కేసీఆర్ మాట ఇక పార్టీలో ఎంత మాత్రం శిలాశాసనం అన్న పరిస్థితి ఉండదని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే పరిశీలకులు బీఆర్‌ఎస్ చీలిక అంచున ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.




# కాంట్రాక్ట్ లెక్చరర్లు తొలగింపేనా

**హైదరాబాద్, మే15( వెలుతురు):**
తెలంగాణలోని విశ్వవిద్యాలయాలలో కాంట్రాక్ట్ లెక్చరర్ల కొనసాగింపుపై నిర్ణయం ఆయా విశ్వవిద్యాలయాలకే ప్రభుత్వం వదిలేసింది. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ పేర్కొంది. అయితే.. ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని లేదా కనీసం టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తుది నిర్ణయాన్ని విశ్వవిద్యాలయాలకు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగిస్తారా లేదా తొలగిస్తారా అనే అంశం ఇప్పుడు విశ్వవిద్యాలయాల పరిధిలోకి వెళ్లిపోయింది. ఈ విషయంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ సూచించినట్లు సమాచారం. ఈసీ తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఆమోదం తెలుపుతుందని సంకేతాలు పంపినట్లు తెలుస్తోంది. అయితే.. ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని, లేదా కనీసం టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తుండటంతో.. ప్రభుత్వం ఈ అంశాన్ని విశ్వవిద్యాలయాలకు వదిలివేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగించడం లేదా వారిని తొలగించి రెగ్యులర్ సిబ్బందిని నియమించడం అనేది పూర్తిగా ప్రభుత్వ విధాన నిర్ణయానికి సంబంధించిన విషయం. అయితే విద్యాశాఖ ఈ విషయంలో విశ్వవిద్యాలయాల నిర్ణయానికి వదిలివేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టు లెక్చరర్లు చాలా సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు హఠాత్తుగా వారిని తొలగిస్తే ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే ఈ విషయంపై విధానపరమైన నిర్ణయం ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ విద్యాశాఖ మాత్రం కాంట్రాక్టు లెక్చరర్ల అంశంపై ఈసీలో చర్చించి ప్రతిపాదనలు పంపాలని విశ్వవిద్యాలయాలకు సూచించింది. దీనివల్ల ప్రభుత్వానికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే విశ్వవిద్యాలయాలు కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నా.. సమస్య పరిష్కారం కాదని, ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని కాంట్రాక్టు లెక్చరర్లు చెబుతున్నారు విద్యాశాఖలో అవగాహన లేని కొందరు అధికారుల కారణంగా అనవసర సమస్యలు వస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే ముందు.. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి విశ్వవిద్యాలయాల్లో దాదాపు 1500 మంది కాంట్రాక్టు.. అవుట్ సోర్సింగ్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే అధికారులు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లకుండా.. ఖాళీలన్నింటినీ భర్తీ చేయవచ్చని వివరించినట్లు తెలుస్తోంది. దీనితో ఆయన వెంటనే ఖాళీల భర్తీకి ఆమోదం తెలిపారు. ఆ తరువాతే కాంట్రాక్టు లెక్చరర్లు తమను క్రమబద్ధీకరించాలని.. లేకపోతే టైమ్ స్కేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలకు దిగారు.




# 19 వేల కోట్లతో మెట్రో సెకండ్ ఫేజ్

**హైదరాబాద్, మే15( వెలుతురు):**
హైదరాబాద్ మెట్రో రైలు రెండవ దశలోని రెండవ భాగం (2బి) 86.5 కిలోమీటర్ల మేర మూడు మార్గాల్లో విస్తరించనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ను హెచ్‌ఏఎంఎల్ ఆమోదించింది. త్వరలో మంత్రివర్గ ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తారు. ఈ ప్రాజెక్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు బ్యాంకుల రుణాలు, పీపీపీ విధానం ద్వారా కూడా నిధులు సేకరించనున్నారు. మెట్రో రైలు రెండవ దశలోని రెండవ భాగం (2బి) విస్తరణ ప్రణాళిక దాదాపు 19 వేల కోట్ల రూపాయల వ్యయంతో రూపొందించబడింది. ఈ ప్రతిపాదిత విస్తరణలో భాగంగా, మూడు ప్రత్యేక మార్గాల్లో మొత్తం 86.5 కిలోమీటర్ల మేర మెట్రో రైలు సేవలను విస్తరించనున్నారు. ఈ కొత్త మార్గాల్లో జేబీఎస్ నుండి మేడ్చల్ వరకు, జేబీఎస్ నుండి శామీర్‌పేట వరకు, అలాగే శంషాబాద్ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో రైలు మార్గాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్‌ఏఎంఎల్) బోర్డు ఆమోదించింది, దీనికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షత వహిస్తున్నారు. ఆమోదం పొందిన నివేదికను ఇప్పుడు ప్రభుత్వం పరిశీలిస్తోంది, మరియు త్వరలో జరగబోయే మంత్రివర్గ సమావేశంలో ఆమోదం పొందిన తర్వాత, ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రతిపాదించిన మూడు మార్గాల కోసం ప్రత్యేక డీపీఆర్ లను రూపొందించారు. మునుపటి ప్రణాళికల్లో జేబీఎస్-శామీర్‌పేట , జేబీఎస్-మేడ్చల్ మార్గాల్లో డబుల్ డెక్ నిర్మాణాన్ని చేపట్టాలని భావించారు, ఇక్కడ ఒకే స్తంభంపై రెండు అంతస్తుల్లో రవాణా సౌకర్యాలు ఉండేలా డిజైన్ చేయాలనుకున్నారు..ఒక అంతస్తులో రహదారి, మరొకటి మెట్రో రైలు కోసం. అయితే, స్టేషన్లు అధిక ఎత్తులో ఉండటం వలన ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుందని భావించి, హెచ్‌ఏఎంఎల్ ఈ ప్రతిపాదనను విరమించుకుంది. కొత్త ప్రతిపాదనల ప్రకారం, జేబీఎస్ నుండి కారా?నా, అల్వాల్, హకీంపేట, తూంకుంట మీదుగా శామీర్‌పేట వరకు 22 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు. ఇక్కడ.. హకీంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్ రన్‌వే రహదారికి సమీపంలో ఉండటంతో.. భద్రతా కారణాల దృష్ట్యా ఎలివేటెడ్ మార్గానికి రక్షణ సంస్థలు అభ్యంతరం తెలిపాయి. దీని కారణంగా.. ఈ మార్గంలో దాదాపు కిలోమీటరున్నర దూరం వరకు భూగర్భ మార్గంలో మెట్రో రైలును నిర్మించాలని నిర్ణయించారు. రన్‌వే కింద నుండి మెట్రో రైలు వెళ్లేలా తుది డిజైన్‌ను రూపొందించారు. జేబీఎస్ నుండి తాడ్ బండ్, బోయిన్ పల్లి, సుచిత్ర, కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు 24.5 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ కొన్ని ఆంక్షలు విధించడంతో, ఈ మార్గంతో పాటు శామీర్‌పేట మార్గం కూడా జేబీఎస్ నుండి ప్రస్తుతం ఉన్న మెట్రో మార్గం కంటే తక్కువ ఎత్తులో వెళ్లేలా ప్రణాళిక చేశారు. జేబీఎస్ ను మూడు మార్గాలకు అనుసంధానం చేస్తూ ఒక ప్రధాన రవాణా కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ మార్గాలను రూపొందించారు. శంషాబాద్ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ వరకు 40 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. ఇక్కడ విమానాశ్రయంలోని టెర్మినల్ స్టేషన్ భూగర్భంలో ఉంటుంది. ఈ మార్గంలో, రావిర్యాల ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఎలివేటెడ్ మార్గంలో మెట్రో రైలు వెళ్తుంది. అక్కడి నుండి, ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలో 18 కిలోమీటర్ల మేర భూగర్భ మార్గంలో వెళ్లేలా డీపీఆర్ ను రూపొందించారు. ఈ ప్రతిష్టాత్మక రెండవ దశలోని రెండవ భాగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేపట్టేలా డీపీఆర్ ను రూపొందించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధుల్లో రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం, కేంద్ర ప్రభుత్వం 18 శాతం భరించేలా ప్రతిపాదించారు. మిగిలిన 48 శాతం నిధులను బ్యాంకుల నుండి రుణాలుగా సేకరిస్తారు. మరో 4 శాతం నిధులను పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ (పీపీపీ) విధానంలో సేకరించాలని యోచిస్తున్నారు.



# రేషన్ కార్డుల ఏరివేత

**హైదరాబాద్, మే15( వెలుతురు):**
తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యల్లో నిజముంది. ఎందుకంటే రెండు రాష్ట్రాల్లో పథకాలను పొందుతూ, రెండు రాష్ట్రాల రేషన్ కార్డులు ఉన్న వారు అనేక మంది ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వచ్చి స్థిరపడినా అక్కడ సొంత ఇల్లు.. ఇక్కడ ఉపాధి కోసం వచ్చిన వారు రెండు చోట్ల రేషన్ కార్డులు తీసుకుంటున్నారు. రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అందించే పథకాలు అందుకుంటున్నారు. నిజంగా ఇది దురదృష్టకరమే. ప్రజాధనం పక్కదోవపట్టడమే అవుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. దీనిపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు సీరియస్ గా తీసుకుని కేవలం ఒక రాష్ట్రంలోనే రేషన్ కార్డులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు మాత్రమే ఉచిత పథకాలు అందాలన్నారు. అప్పుడే ప్రభుత్వ పథకాలకు సార్థకత చేకూరతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే బియ్యం అమ్ముకునే వారికి ఎందుకు ఇవ్వాలని ఆయన వేసిన ప్రశ్నలో కూడా అర్థం ఉంది. తెలంగాణలో కోటి పది లక్షల కుటుంబలు ఉంటే పొరుగు రాష్ట్రానికి చెందని వారికి కూడా ఇక్కడ రేషన్ కార్డులన్నాయన్నారు. దీనివల్ల అక్కడా, ఇక్కడా బియ్యం తీసుకోవడంతో అవి పక్కదారి పట్టే అవకాశముంది. అదే సమయంలో రెండు చోట్ల పథకాలను అందుకుంటుంటే ప్రభుత్వ ఖజానాపై కూడా భారం పడే అవకాశముంటుంది. ఒకరు ఒక రాష్ట్రంలోనే సంక్షేమ పథకాలను పేదలు అందుకోవాల్సి ఉంటుందికానీ అర్హతలులేని వారు కూడా అనేక మంది ఉచితాలు పొందుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో రెండుచోట్ల రెండు ఓట్లు ఉన్నాయి. వేర్వేరు సార్లు ఎన్నికలు జరుగుతుండటంతో అక్కడకు వెళ్లి ఓటేస్తారు. ఇక్కడా తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఎన్నికల కమిషన్ ఒకే రాష్ట్రంలో ఒకేచోట మాత్రమే ఓటు హక్కు ఉండాలన్ననిబంధన పెట్టింది. ఇప్పుడు అలాగే పథకాలను కూడా ఎక్కడో ఒకచోట మాత్రమే తీసుకునే అవకాశం కల్పిస్తే నిజమైన పేదలకు పథకాలు అందుతాయి. ప్రభుత్వాలకు కూడా కొంత వెసులుబాటు లభిస్తుందని భావిస్తున్నారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్ గా తీసుకుని విచారణ జరపాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండేలా చర్యలు తీసుకుంటే చాలా వరకూ ఖజానా పై భారం తగ్గుతుందని ఉన్నతాధికారులు కూడా చెబుతున్నారు.

## సౌదీలో తెలంగాణ వాసి అనుమానాస్పద మృతి

**సూర్యాపేట,మే15( వెలుతురు):**
సౌదీ అరేబియాలో కోదాడకు చెందిన వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. షేక్ తాజుద్దీన్ సౌదీలో పదేళ్లుగా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 8న కాలిన గాయాలతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయాన్ని సౌదీ పోలీసులు ఆలస్యంగా తాజుద్దీన్ కుటు-ంబసభ్యులకు తెలియజేశారు. సౌదీలో కపిల్ అనే వ్యక్తితో తాజుద్దీన్‌కు కొద్ది రోజులుగా గొడవలున్నాయని, అతడే కాల్చి చంపి ఉంటాడని కుటు-ంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని కోదాడకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సాయం చేయాలని కోరుతున్నారు.

## వీరయ్య చౌదరి హంతకులకు కఠిన శిక్ష

- కుటుంబ సభ్యులను పరామర్శించిన లోకేశ్



**ఒంగోలు, మే15( వెలుతురు):**
ఇటీవల ఒంగోలులో దారుణ హత్యకు గురైన తెదేపా నేత, మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. యువగళం పాదయాత్ర సమయంలో తనతో పాటు-అడుగులు వేశారని, పార్టీ పటిష్టత కోసం కృషిచేసిన వీరయ్య చౌదరి దారుణహత్య బాధాకరమని అన్నారు. హత్య నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు. వీరయ్య చౌదరి కుటుంబానికి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులోని మాజీ ఎంపీపీ నివాసానికి మంత్రి వెళ్లారు. వీరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వీరయ్య చౌదరి సతీమణి, కుమారుడు, ఇతర కుటు-ంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మాజీ ఎంపీపీతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా లోకేశ్ గుర్తు చేసుకున్నారు. యువగళం పాదయాత్ర సమయంలో వీరయ్య చౌదరి తనతో పాటు- అడుగులు వేశారని లోకేశ్ తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషిచేసిన ఆయన దారుణహత్యకు గురవడం బాధాకరమని తెలిపారు. హత్య కేసు నిందితులకు కఠినంగా శిక్ష పడేలా చేస్తామని అన్నారు. వీరయ్య చౌదరి కుటు-ంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటు-ందని భరోసా ఇచ్చారు. కుటు-ంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. లోకేశ్ వెంట మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్ర నరసింహా రెడ్డి, బీఎన్ విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు ఉన్నారు

## హుస్నాబాద్,సిరిసిల్ల జిల్లాలో సైనిక్ స్కూల్

- రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చించా: బండి



**హైదరాబాద్, మే15( వెలుతురు):**
సైనిక్ స్కూల్ వివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. హుస్నాబాద్,సిరిసిల్ల జిల్లాలో సైనిక్ స్కూల్ కోసం గత నెల 15న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ను కలిశానని వివరించారు. ఈ సంద్భరంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సైనిక్ స్కూల్ ఏర్పాటు- కోసం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారన్నారు. తన విజ్ఞప్తికి రాజ్‌నాథ్ సానుకూలంగా స్పందించడం సంతోషంగా ఉందన్నారు. దీనిపై రాజకీయం చేయడం తగదని బండి హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి సహకరించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా కలిసిరావాలని కోరుతున్నామన్నారు.

## కాటన్ ముందుచూపు మరువలేనిది: బాబు



**అమరావతి,మే15(ఆర్ఎన్ఎ):**
సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు నిర్మించి, స్థిరమైన వ్యవసాయ అభివృద్ధికి సర్ ఆర్థర్ కాటన్ చేసిన కృషిని ఎవరూ మర్చిపోలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. సర్‌ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా మహానుభావుని స్మృతికి నివాళులర్పిస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. ఒక వ్యక్తి తలుచుకుంటే ఎన్ని అద్భుతాలు చేయవచ్చో కాటన్ మహాశయుడు రుజువు చేశారని ప్రశంసించారు. రాజమహేంద్రవరంలో 1852లో గోదావరి నదిపై ధవళేశ్వరం బ్రిడ్జిని ఇంజినీర్ సర్ ఆర్థర్ కాటన్ నిర్మించారు.

## చెరువులో దూకి ఎయిమ్స్ విద్యార్థి ఆత్మహత్య

**యాదాద్రి భువనగిరి, మే15( వెలుతురు):**



యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ పెద్దచెరువులో దూకి ఎయిమ్స్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎయిమ్స్‌లో అబిజిత్ జాయ్ అనే విద్యార్థి ఎంబిబిఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఉదయం అభిజిత్ చెరువుతో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని చెరువులోని నుంచి బయటకు తీశారు.మృతుడి అభిజిత్ జాయ్ గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో భాగస్వాములు కావాలి

**హైదరాబాద్, మే15( వెలుతురు):**
తెలంగాణలో తరతరాలుగా వాయిదాలు పడుతున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న చిత్తశుద్ధితో పని చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నీటి పారుదల శాఖలో కొత్తగా నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగులను ఉద్దేశించి చెప్పారు. తెలంగాణ రైతులు ఆత్మగౌరవంతో బతకడానికి అవసరమైన నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో భాగస్వాములై ప్రజల భావోద్వేగానికి ప్రతీకలుగా నిలబడాలని సూచించారు. కొలువుల పండుగలో భాగంగా నీటి పారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 244 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, (AEE), 199 జూనియర్ టెక్నికల్ ఆఫీసర్స్ (JTO) లకు జలసౌధ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ప్రసంగిస్తూ, తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములవుతున్న ఉద్యోగులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. “గత నలభై యాభై ఏళ్లుగా రావలసిన నీళ్లు రాకపోగా, పూర్తి కావలసిన ప్రాజెక్టులు పూర్తి కాని కారణంగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది, వాయిదా పడుతున్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. నీళ్లు ఎంత అవసరమో అందుకు ఎంతగా పరితపించామో, ఏ నీటి కోసమైతే పోరాటం మొదలైంతో ఆ నీళ్లే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టాయి. అందుకే నీటి పారుదల శాఖకు ప్రభుత్వం అంత



ప్రాధాన్యత ఇస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో నాలుగైదు దశాబ్దాలు వాయిదా పడిన ప్రాజెక్టులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లలో కూడా పూర్తి కాలేదు. జలయజ్ఞంలో భాగంగా ప్రారంభమైన ప్రాజెక్టులు తెలంగాణ వచ్చిన తర్వాత పదేళ్లలో ఏదీ పూర్తి కాలేదు. ఈనాటికీ వాయిదాలు పడుతూనే ఉన్నాయి. తెలంగాణ ప్రజలకు అతిపెద్ద సెంటిమెంట్ నీళ్లు. ప్రాజెక్టులను మొదటి ప్రాధాన్యత కింద పూర్తి చేస్తాం. ఇంజనీర్లుగా మీరు చేపట్టే ప్రాజెక్టులు భవిష్యత్తు తరాలకు అందించాల్సిన భాధ్యత ఉంది. ఇది నెలనెలా జీతం తీసుకునే ఉద్యోగంగా కాకుండా ఒక బాధ్యతగా, ప్రజల భావోద్వేగంగా తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములై రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలి. పదేళ్లుగా ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. గత సెప్టెంబర్ లో ఇదే వేదిక నుంచి 738 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను, జూనియర్ అసిస్టెంట్లకు నియామాక పత్రాలు అందించి భుజం తట్టాం. మళ్లీ ఈరోజు 443 ఉద్యోగాలను నియమించాం. 14 నెలల కాలంలో ఈ ఒక్క శాఖలోనే 1121 మందిని నియమించామంటే ఈ శాఖకు ఇస్తున్న ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలి. ఉమ్మడి రాష్ట్రంలో పదేళ్లు, ప్రత్యేక తెలంగాణలో పదేళ్లు నోటిఫికేషన్ల కోసం కొట్లాడాం. ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యత ఉద్యోగ నియామకాలు. 14 నెలల్లో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం. ప్రైవేటు రంగంలో లక్ష ఉద్యోగాలు కల్పించాం. 3 లక్షల కోట్ల రూపాయల మేరకు పెట్టుబడులను తీసుకొచ్చాం. యువతకు విద్య, ఉద్యోగాల కల్పన ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత. అడ్డంకులను అధిగమించి తొందరలోనే గ్రూప్ I, II, III, IV నియామకాలు పూర్తి చేస్తాం...” అని ముఖ్యమంత్రి గారు ఉద్యోగులను ఉద్దేశించి వివరించారు.ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, , పొన్నం ప్రభాకర్, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి, , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తో పాటు నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గాలి జాతకం అలా అయిపోయిందే..?

**హైదరాబాద్, మే15( వెలుతురు):**
కోట్లు ఉన్నప్పటికీ ప్రయోజనం ఏముంది? జీవితంలో ఎక్కువ భాగం జైలుకే పరిమితమయితే ఇక సంపాదించింది అనుభవించడం కూడా లేని అది దరిద్రమైన జాతకం గాలి జనార్ధన్ రెడ్డిది. అక్రమంగానో.. ఎలాగోనో గాలి జనార్ధన్ రెడ్డి కోట్లాది రూపాయలు కూడబెట్టారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన గాలి కుటుంబం కర్ణాటకు వెళ్లి సెటిలయింది. కర్ణాటకలో అనేక వ్యాపారాలు చేసి కోట్లాది రూపాయలను కూడబెట్టింది. గాలి జనార్ధన్ రెడ్డికి ఎన్ని కోట్ల రూపాయలు ఉన్నాయో ఆయన కుమార్తెకు చేసిన వివాహంలో చేసిన హంగూ ఆర్భాటాలు చూస్తేనే



అర్థమవుతుంది. బంగారు పళ్లేలు, నగలు, నట్రా.. ఇలా ఒకటేమిటి.. బంగారంతో పొదిగిన అన్నీ విలువైన వస్తువులు.కాలుకదిపితే ఏ కారు వస్తుందో ఆయనకు కూడా తెలియదు. ఇక ఇంట్లో ఉన్నా బయట ఉన్నా ఏసీల్లోనే గాలి సేదతీరతారు. అలాంటి గాలి జనార్ధన్ రెడ్డి ఇప్పుడు చంచల్ గూడ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. ఓబులాపురం అక్రమ మైనింగ్ కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టు గాలి జనార్ధన్ రెడ్డితో పాటు మరో నలుగురికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షను విధించింది. వీరిపై ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానాను కూడా విధించింది. గతంలోనూ కొన్నేళ్ల పాటు గాలి జనార్ధన్ రెడ్డి శిక్ష అనుభవిస్తూ జైలు జీవితం గడిపారు. అయితే ఆ శిక్షను మినహాయించాలని కోరినా న్యాయస్థానం ఒప్పుకోలేదు. దీంతో గాలి జనార్ధన్ రెడ్డి చంచల్ గూడ జైలులో నిందితుడిగా ఉంటూ ఉన్నారుఇంట్లోనే మనం ఉండలేకపోతున్నాం. ఇక బిజినెస్ మాగ్నెట్ అయిన గాలి జనార్ధన్ రెడ్డి జైల్లో ఉక్కపోతకు మగ్గిపోతున్నారట. తనకు జైల్లో అదనపు సౌకర్యాలు కల్పించాలంటూ గాలి జనార్ధన్ రెడ్డి పిటీషన్ వేశారు. అయితే గాలి పిటీషన్ ప్రస్తుతం రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది. ఈ కేసులో విచారించి ఏ నిర్ణయం తీసుకుంటుందో తెలియదు కానీ గాలి జనార్ధన్ రెడ్డి జైలు జీవితం గడపలేకపోతున్నారని అర్థమవుతుంది. తనకు ఇంటి నుంచి భోజనంతో పాటు నిద్రించడానికి బెడ్, ఫ్యాన్ తో పాటు మరికొన్ని సౌకర్యాలు కోరుతున్నారు. పాపం చేసిన గాలికి ఈ శిక్ష సరిపోతుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అక్రమాలకు అనుభవించాల్సిందేనంటూ కామెంట్స్ వినపడుతున్నాయి. రాజకీయాల్లో పోటీ చేసే అవకాశం కూడా లేనట్లే.అందుకు జనార్దన్ రెడ్డి స్పందిస్తూ.. తన వయసును, తాను చేసిన సామాజిక సేవలను గుర్తించి, శిక్షను తగ్గించాలని కోరారు. ఆయన విన్నపై జడ్జి స్పందిస్తూ..'ఈ కేసులో పదేళ్ల శిక్ష ఎందుకు వేయకూడదు' అని ప్రశ్నించారు. తాను ఇప్పటికే నాలుగేండ్లకు పైగా సామాజిక సేవ చేస్తున్నానని.. బళ్లారితో పాటు గంగావతిలో కూడా ప్రజలు తనను అఖండ మెజారిటీతో గెలిపించారని ఈ సందర్భంగా గాలి జనార్దన్ రెడ్డి కోర్టుకు తెలిపారు. తన సేవలను గుర్తించినందుకే ప్రజలు గెలిపించారని చెప్పారు. ఆయన వాదనలు విన్న న్యాయస్థానం.. చివరకు ఆయనకు ఏడేళ్ల శిక్షను ఖరారు చేస్తూ తీర్పు వెల్లడించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో.. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) అక్రమ తవ్వకాల కేసు సంచలనం సృష్టించింది. ఏపీ అనంతపురం జిల్లాలోని ఓబుళాపురం మైనింగ్ కంపెనీలో అక్రమ తవ్వకాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. ఈ వ్యవహారం అప్పట్లో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. సీబీఐ ఈ కేసును విచారించి.. పలువురిపై ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. విచారణలో భాగంగా గాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాస్ రెడ్డి, వీడీ రాజగోపాల్, మెహఫజ్ అలీ ఖాన్, ఓఎంసీ కంపెనీని దోషులుగా నిర్ధారించింది. వీరికి ఏడేళ్ల పాటు జైలు శిక్ష విధించింది. అలానే ఈ కేసుకలో ఆరోపణలు ఎదుర్కొన్న సబితా ఇంద్రారెడ్డి, కృపానందంలను నిర్దోషులుగా ప్రకటించింది. గతంలో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మిని హైకోర్టు నిర్దోషిగా తేల్చిన సంగతి తెలిసిందే.

# ట్రంప్ టవర్స్ కు ఎసరు...

**హైదరాబాద్,మే15( వెలుతురు):**
హైదరాబాద్ రియాల్ ఎస్టేట్ మార్కెట్‌లో గ్లోబల్ బ్రాండ్‌గా పేరొందిన ట్రంప్ రియాల్టీ సంస్థ కోకాపేటలో అత్యంత విలాసవంతమైన టవర్స్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తోంది. అయితే, ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కాకముందే స్థల యాజమాన్య వివాదంలో చిక్కుకుంది. ఈ వివాదం ట్రంప్ టవర్స్ నిర్మాణ ప్రణాళికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చెందిన ట్రంప్ ఆర్గనైజేషన్ భారతదేశంలో ఇప్పటికే ముంబై, కోల్‌కతా, గుర్‌గావ్, పుణెలలో విలాసవంతమైన రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లను విజయవంతంగా నిర్మించింది. ఇప్పుడు హైదరాబాద్‌లోని కోకాపేట గోల్డెన్ మైల్ ప్రాంతంలో రూ3,500 కోట్ల విలువైన ట్రంప్ టవర్స్ నిర్మాణానికి సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్ట్‌లో మూడు టవర్లు, 66 అంతస్తులు, 243 మీటర్ల ఎత్తుతో నిర్మాణం జరగనుంది. ఈ ప్రాజెక్ట్‌కు భారతీయ భాగస్వామిగా ఐరా రియాల్టీని ఎంచుకున్నారు. కోకాపేటలోని గోల్డెన్ మైల్ ప్రాంతంలో ఐరా రియాల్టీకి చెందిన స్థలంలో ఈ టవర్ల నిర్మాణం జరగనుంది. అనుమతుల ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు ప్రచారం జరిగింది, మరియు ఈ ఏడాది చివరలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.ఈ భారీ ప్రాజెక్ట్ మొదలు కాకముందే స్థల యాజమాన్య వివాదం తలెత్తింది. నాందెల రామ్‌రెడ్డి అనే వ్యక్తి తాను కూడా ఈ స్థలంలో సహ యజమాని అని, తనకు తెలియకుండానే ట్రంప్ టవర్స్ నిర్మాణ ప్రకటనలు జరిగాయని ఆరోపిస్తూ బహిరంగ లీగల్ నోటీసు జారీ చేశారు. రామ్‌రెడ్డి తరపు న్యాయవాది జారీ చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, గోల్డెన్ మైల్ ప్రాంతంలోని 12,602 గజాల స్థలంలో రామ్‌రెడ్డికి 425 గజాల వాటా




ఉంది. ఈ స్థలాన్ని ఐరా రియాల్టీతోపాటు పది మందికి పైగా వ్యక్తులు కలిసి కొనుగోలు చేశారని, అందులో రామ్‌రెడ్డి ఒకరని వారు పేర్కొన్నారు.రామ్‌రెడ్డి తనకు సమాచారం ఇవ్వకుండా ఈ స్థలంపై ట్రంప్ టవర్స్ నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం తన హక్కులను కాలరాసినట్లు భావిస్తున్నారు. ఈ విషయంలో తాను ఊరుకునేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.ఈ స్థల యాజమాన్య వివాదం ట్రంప్ టవర్స్ ప్రాజెక్ట్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. రియల్ ఎస్టేట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇటువంటి చట్టపరమైన సమస్యలు పరిష్కారం కాకపోతే, ప్రాజెక్ట్ ఆలస్యం కావచ్చు లేదా పూర్తిగా రద్దయ్యే ప్రమాదం ఉంది. గతంలో కూడా హైదరాబాద్‌లోని కొన్ని రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లు స్థల వివాదాల కారణంగా ఆగిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఐరా రియాల్టీ, ట్రంప్ ఆర్గనైజేషన్ ఈ వివాదాన్ని ఎలా పరిష్కరిస్తాయనేది ఇప్పుడు కీలకం. ఒకవేళ రామ్‌రెడ్డితో చర్చలు జరిపి, ఆయన వాటాను కొనుగోలు చేయడం లేదా ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించగలిగితే, ప్రాజెక్ట్ పురోగతిలోకి వెళ్లే అవకాశం ఉంది. అలా కాకపోతే, ఈ వివాదం చట్టపరమైన పోరాటంగా మారి, ప్రాజెక్ట్‌ను వెనక్కి నెట్టవచ్చు.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ గత కొన్నేళ్లుగా వేగంగా వృద్ధి చెందుతోంది. కోకాపేట, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాలు విలాసవంతమైన నివాస ప్రాజెక్ట్‌లకు కేంద్రంగా మారాయి. ట్రంప్ టవర్స్ వంటి గ్లోబల్ బ్రాండ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపును తెచ్చిపెట్టే అవకాశం ఉంది. అయితే, స్థల వివాదాలు వంటి సమస్యలు ఈ అవకాశాలను అడ్డుకోవచ్చు. రియల్ ఎస్టేట్ నిపుణులు ఈ వివాదం ఇతర డెవలపర్లకు కూడా ఒక హెచ్చరికగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. స్థల కొనుగోళ్లలో సహ యజమానులతో స్పష్టమైన ఒప్పందాలు, అనుమతులు, మరియు చట్టపరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవడం ఎంత ముఖ్యమో ఈ ఘటన తెలియజేస్తోంది.

## ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో జిల్లాకు ర్యాంకుల పంట

**పెద్దపల్లి , మే15( వెలుతురు):**
పెద్దపల్లి గత ఏప్రిల్ నెలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సెక్షన్, సబ్ డివిజన్, డివిజన్ కార్యాలయా లకు, ఉద్యోగులు, జిల్లాలకు ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి పూర్వపు జిల్లాల వారిగా ర్యాంకులను ప్రకటించారు. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లాకు అత్యధిక ర్యాంకులు పొందిన పలువురికి ఎస్ ఈ మాధవరావు అభినందనలు తెలిపారు. ఈ విజయం అందరి సమష్టి కృషితోనే సాధ్య మైనదని కంపెనీలో పెద్దపల్లి జిల్లా 2వ ర్యాంక్ సాధించిందని తెలిపారు. రూరల్ సెక్షన్ విభాగంలో 1, 2, 3, 4, 5 వ ర్యాంక్స్ ను పెద్దపల్లి జిల్లా సెక్షన్ లు కైవసం చేసుకున్నాయని, వాటిలో కాట్నపల్లి 1 వ, బసంత్ నగర్ 2వ, అంతర్గం 3వ, ఖిలావనపర్తి 4వ ఎలిగేడు 5వ ర్యాంక్స్ ను సాధించినట్లు తెలిపారు. అర్బన్ సెక్షన్స్ లో పెద్దపల్లి టౌన్ 5వ ర్యాంక్ సాధించిందని, సబ్ డివిజన్ రూరల్ విభాగంలో సుల్తానాబాద్ ఏడిఈ శ్రీనివాస్ కి 1వ ర్యాంక్, ధర్మారం ఏడిఈ విజయ్ గోపాల్ సింగ్ కు 5వ ర్యాంక్ దక్కగా, డివిజన్ లలో పెద్దపల్లి డిఈ అదనపు ఇన్చార్జి రవి 1 వ ర్యాంక్ సాధించారని తెలిపారు. ఏఈ, ఏడిఈ, సబ్ ఇంజనీర్స్, అకౌంట్స్ స్టాఫ్ అందరి కృషితోనే పెద్దపల్లి డివిజన్ డిఈ టెక్నికల్ బి. రవి కి 1 వ ర్యాంక్ వచ్చిందన్నారు. 16 జిల్లాలలో పెద్దపల్లి జిల్లా 2వ ర్యాంక్ రావడానికి కృషి చేసిన ప్రతీ ఉద్యోగికి సర్కిల్ తరుపున సూపరింటెండింగ్ ఇంజనీర్ మాధవరావు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పూర్వపు కరీంనగర్ జిల్లాలో రూరల్ సబ్ డివిజన్ లలో శ్రీరాంపూర్ ఏడిఈ మధుకర్ కు ర్యాంక్ దక్కింది. పూర్వపు కరీంనగర్ జిల్లాలో సబ్ డివిజన్ అర్బన్ లో రామగుండం ఏడిఈ రమేష్ కి ర్యాంక్ దక్కింది. మున్ముందు అందరూ కష్టపడి పెద్దపల్లి జిల్లాకు ఇంకా మంచి ర్యాంక్ లు తీసుకురావాలని, మన సంస్థను అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్దామని పెద్దపల్లి సూపరింటెండింగ్ ఇంజనీర్ మాధవరావు విద్యుత్ సంస్థ లో పనిచేస్తున్న ఉద్యోగులందరిని కోరారు. జిల్లాలో ర్యాంకులు సాధించిన అందరికీ పేరు పేరున శుభాకాంక్షలు తెలిపారు.

cinema

# మ్యాన్ ఆఫ్ ద మ్యాన్షన్ హౌజ్




నందమూరి బాలకృష్ణ ఓ పాపులర్ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా చేస్తున్నారు. అది కూడా ఆయనకు నచ్చిన బ్రాండ్ కావడం విశేషం. ఇంతకు ముందు ఆయన కొన్ని యాడ్స్ చేసినా... ఇది మాత్రం సమ్‌థింగ్ స్పెషల్ అని చెప్పాలి. బాలయ్య చేసిన కొత్త యాడ్ తాజాగా విడుదల చేశారు. బాలయ్య కు ఇష్టమైన డ్రింకింగ్ బ్రాండ్ ఏది? అనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అమెరికా వెళ్లినా సరే తన వెంట మ్యాన్షన్ హౌస్ తీసుకుని వెళతారని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆయన చిన్న అల్లుడు చెప్పిన విషయం తెలిసిందే. కానీ ఎప్పుడూ దాని గురించి బాలయ్య తన నోటి వెంట చెప్పింది లేదు. కానీ ఈసారి ఏకంగా ఈ బ్రాండ్ పై యాడ్ చేసి షాక్ ఇచ్చాడు. ఈ యాడ్‌లో బాలయ్య లుక్ అదిరిపోయింది. అయితే ఆహా తెలుగు ఓటీటీలో ఆయన హోస్ట్ గా చేసిన 'అన్‌స్టాపబుల్' టాక్ షోకి మ్యాన్షన్ హౌస్ అడ్వర్టయిజింగ్ స్పార్టర్ అయింది. అప్పుడు మొదటిసారి బాలయ్య నోటి వెంట మ్యాన్షన్ హౌస్ అని వచ్చింది. ఇప్పుడు డైరెక్ట్ గా ఆ సంస్థకు ఆయన ప్రచారం చేస్తూ ఒక వాణిజ్య ప్రకటన చేయడం విశేషం ప్రజంట్ ఈ యాడ్ వైరల్ అవుతుంది.



## సూపర్ స్టార్ బర్త్ డే కేక్ రూ. 465 కోట్లా.. ఇంత స్పెషల్ ఏంటి?

మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తెలుగు ప్రేక్షకులకి సుపరిచితమే. ఆయన నటించిన పలు చిత్రాలు తెలుగులో రీమేక్ అయ్యాయి. మోహన్ లాల్ తెలుగులో జనతా గ్యారేజ్ చిత్రంలో నటించి తెలుగు ప్రేక్షకులని ఎంతగానో అలరించాడు. అయితే మోహన్ లాల్ ఇప్పటికీ కుర్ర హీరోలకి పోటీ ఇస్తూ ప్రేక్షకులని అలరిస్తున్నాడు. ఇటీవల ఆయన సినిమాలు కూడా పలు రికార్డులు సాధించాయి. అయితే మోహన్ లాల్ బర్త్ డే సందర్భంగా తయారు చేసిన కేక్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. సూపర్ స్టార్ బర్త్ డే కేక్ విలువ అక్షరాలాల రూ.465 కోట్లు కాగా, ఇది విని అందరు ఆశ్చర్యపోతున్నారు. కేక్ ధర అంతనా, అంత స్పెషాలిటీ ఏంటని అందరు నోరెళ్లపెడుతున్నారు. అయితే విషయం ఏంటంటే.. కేక్ పై మోహన్ లాల్ రెండు సినిమాల వసూళ్లను అధికారికంగా ప్రదర్శించింది టీమ్. రెండిటినీ కలుపుకుంటే, అంత పెద్ద సంఖ్య నమోదైంది. ఎల్ 2 వసూళ్లు 265 కోట్లు, తుడరమ్ వసూళ్లు 200 కోట్లు కలుపుకుని మోహన్ లాల్ సంపాదించినది 465 కోట్లు అన్నమాట. ఈ వయస్సులోను బాక్సాఫీస్‌ని ఆ రేంజ్‌లో షేక్ చేసే సత్తా మోహన్ లాల్‌కే ఉందనడంలో అతిశయోక్తి లేదు. బాలీవుడ్ లో ఖాన్‌లు, బచ్చన్‌లు సాధించలేని వసూళ్లు ఆయన సినిమాలకి సాధించి చూపించాడు. ఈసారి ఆయన బర్త్ డేని గ్రాండ్ గా సెలబ్రేట్ చేసారు. ఒకదానిపై ఒకటిగా జత చేసి రెండు కేక్ లతో డబుల్ ధమాకా సెలబ్రేషన్స్ ని ప్లాన్ చేసారు. మోహన్ లాల్ కు డబుల్ విజయం దక్కిన నేపథ్యంలో రెండు అంచెల కేక్‌తో సెలబ్రేట్ చేశారు. కేక్ చూసి మోహన్ లాల్ కూడా ఫుల్ ఇంప్రెస్ అయినట్టు తెలుస్తుంది. ఇక మోహన్ లాల్ నటించిన L2: ఎంపురాన్ లో స్టీఫెన్ నేడుంపల్లిగా, తుడారుమ్ లో బెంజ్ గా (వ్యంగ్య పాత్ర) అతడు సత్తా చాటాడు. ఉత్కంఠభరితమైన ఫ్యామిలీ డ్రామాగా రూపొందిన –తుడారుమ్– బంపర్ హిట్ వసూళ్లతో అదరగొట్టింది. ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకులను ఆకట్టుకుని, రూ. 200 కోట్లు వసూలు చేసింది.

# సరిగమకు ది ప్యారడైజ్ ఆడియో హక్కులు




హిట్ 3తో సూపర్ హిట్ అందుకున్న నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ది ప్యారడైజ్. దసరా సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటంతో పాటలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా ఆడియో హక్కులు భారీ ధరకు అమ్ముడుపోయినట్లు తెలుస్తుంది. ప్రముఖ మ్యూజిక్ కంపెనీ సరిగమ మ్యూజిక్ రూ. 18 కోట్లకు 'ది ప్యారడైజ్' ఆడియో రైట్స్‌ని దక్కించుకున్నట్లు సమాచారం. నాని కెరీర్‌లో ఒక సినిమా ఆడియో హక్కులకు ఇంత పెద్ద మొత్తం రావడం ఇదే మొదటిసారని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా విడుదల కాకముందే ఆడియో హక్కులు ఇంత పెద్ద మొత్తానికి అమ్ముడుపోవడం చిత్ర యూనిట్‌కు ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. ఈ చిత్రం తెలుగుతో పాటు– హిందీ, తమిళ, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ మరియు స్పానిష్ భాషల్లో వచ్చే ఏడాది (2026) మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రం 1980ల కాలంలో హైదరాబాద్‌లో జరిగిన కొన్ని నిజమైన సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్నట్లు– సమాచారం. ఇది ఒక యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతోంది.

# నా కథ సినిమాగా వస్తూ చూడాలని ఉంది: భజ్జీ

భారత క్రికెట్ చరిత్రలో అత్యంత గొప్ప బౌలర్లలో హర్భజన్ సింగ్ ఒకరు. తన స్పిన్ బౌలింగ్‌తో పాటు–, కీలక సమయాల్లో బ్యాటింగ్‌తోనూ ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించాడు. 'టర్బనేటర్'గా పిలువబడే హర్భజన్ క్రికెట్ కెరియర్ సినిమాటిక్ గా ఉంటుందని దాన్ని వెండితెరపై చూపిస్తే వర్కవుట్ అవుతుందని కొందరి ఒపీనియన్. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో భజ్జీ తన జీవిత కథ సినిమాగా వస్తే చూడాలని ఉందన్నాడు. అంతేకాకుండా తన రోల్ కు పాత్రకు న్యాయం చేయాలని భావిస్తున్న ఇద్దరు హీరోల పేర్లను వెల్లడించాడు.అందుల్లో ఒకరు విక్కీ కౌశల్ మరొకరు రణవీర్ సింగ్. తన పాత్రకు వీరైతేనే బాగుంటుందని చెబుతున్నాడు. ఇప్పటికే కపిల్ బయోపిక్ 83లో రణ్ వీర్ సింగ్ కపిల్ దేవ్ గా కనిపించాడు. బహుశా ఇదే రన్వీర్ తన పాత్ర కూడా చేస్తే బాగుంటుందని భజ్జీ భావిస్తున్నాడేమో. గతంలో రణవీర్ సింగ్ '83' చిత్రంలో కపిల్ దేవ్ పాత్రలో ఒదిగిపోయి, ఆ పాత్రను ఎంత అద్భుతంగా పోషించగలడో నిరూపించుకున్నాడు. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద పెద్దగా విజయం సాధించకపోయినా, రణవీర్ నటనకు మాత్రం ప్రశంసలు దక్కాయి. మరోవైపు, విక్కీ కౌశల్ 'ఛావా' చిత్రంలో తన పాత్రలో సీరియస్ నెస్ ను చూపించాడు.బాక్సాఫీస్ వద్ద రూ. 600 కోట్లకు పైగా వసూలు చేసాడు. హర్భజన్ సింగ్ బయోపిక్‌లో తన పాత్రను ఎవరు పోషిస్తారో, ఆ చిత్రం ఎలా రూపుదిద్దుకుంటు–ందో చూడాలి. విక్కీ కౌశల్ తన ఇంటెన్సిటీతో కాని రణవీర్ సింగ్ తన ఎనర్జీతో భజ్జీ పాత్రలో మెప్పిస్తారో లేరో చూడాలి.



# రాజ్‌తో సమంత.. సతీమణి శ్యామాలి పోస్ట్ వైరల్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత వ్యాక్తిగత జీవితం గురించి రోజుకో వార్త వైరల్ అవుతూనే ఉంటోంది. ఎంతో ప్రేమించిన అక్కినేని నాగచైతన్యతో విడాకుల తర్వాత సింగిల్‌గా ఉంటుంది సమంత. నాగచైతన్య రెండో పెళ్లి చేసుకోని హ్యాపి లైఫ్ లీడ్ చేస్తున్నప్పటికి సమంత కూడా రెండో పెళ్లి చేసుకుంటే బాగుంటుందని అభిమానులు, సినీ ప్రియులు కోరుకుంటు–న్నారు. అయితే కొద్ది రోజులుగా దర్శకుడు రాజ్ నిడిమోదుతో తరచు కనిపిస్తోంది సామ్.. ఎక్కడికి వెళ్లిన సమంత పక్కన రాజ్ ఉంటున్నాడు. దీంతో ఆమె వైవాహిక జీవితం పై నెట్టింట రూమర్స్ గట్టిగానే ప్రచారం అవుతున్నాయి. అయితే రాజ్ నిడిమోరుకు ఇప్పటికే పెళ్లి అయ్యింది. ఇలాంటి టైం లో తాజాగా సమంత తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ షేర్ చేసింది. ఇందులో రాజ్‌పై సమంత వాలినట్టుగా కనిపిస్తుంది. దీంతో ఈ వార్తలు మరింత పుంజుకున్నాయి. వారి బాండింగ్ రోజు రోజుకి బలపడుతుందిగా అని కొందరు కామెంట్ చేస్తున్నారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. అయితే తాజాగా రాజ్ సతీమణి శ్యామాలి తాజాగా ఎక్స్ వేదికగా ఒక సందేశాత్మక పోస్ట్ పెట్టింది.. 'నా గురించి ఆలోచించి, విని, మాట్లాడేవారితోపాటు నన్ను కలిసి, నాతో మాట్లాడి నా గురించి రాసే వారందరికి ప్రేమ, ఆశీస్సులు పంపుతున్నా' అనే పోస్ట్ ను ఆమె షేర్ చేశారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్ గా మారింది. కొంతకాలంగా ఎలాంటి పోస్ట్ షేర్ చేయని ఆమె ఉన్నట్టుండి ఇలాంటి సందేశం ఎందుకు షేర్ చేశారా? అని, ఆమె కచ్చితంగా సమంతని ఉద్దేశించే మాట్లాడుతూంది అని కామోంట్ లు విపడుతున్నాయి.



# దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్‌లో ఎన్టీఆర్?

తాజా సమాచారం ప్రకారం సినీ పితామహుడిగా పరిశ్రమ కొనియాడే దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ లో నటించేందుకు తారక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం నడుస్తుంది. ఈ ప్రాజెక్టు వెనుక రాజమౌళి, కార్తికేయ, వరుణ్ గుప్తా ప్రమేయం కూడా ఉందని టాక్. అంతే కాదు.. ఇప్పటికే స్క్రిప్ట్ర కూడా సిద్ధం కాగా, అది విన్న జూనియర్ ఎన్టీఆర్ చాలా ఎగ్జైట్ అయి ఓకే చేశారట. అయితే భారతీయ చలన చిత్ర పరిశ్రమ ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ రెండేళ్ల కిందటనే 'మేడ్ ఇన్ ఇండియా' అనే సినిమా అనౌన్స్ చేయగా, దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి సమర్పణలో నితిన్ కక్కర్ మూవీని తెరకెక్కించబోతున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు, త్వరలో వెల్లడిస్తామని అప్పుడు చెప్పగా, ఆ తర్వాత దాని నోరు విప్పింది లేదు. కాని ఇప్పుడు ఉన్నట్టుండి ఇందులో ఎన్టీఆర్ నటిస్తారని వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. దాదాసాహెబ్ ఫాల్కే జీవితం చాలా పెద్దది. అలాంటి కథలను కచ్చితంగా ఇప్పటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. అందుకే జూనియర్ ఎన్టీఆర్ లాంటి నటు–డు అయితేనే ఈ ప్రాజెక్ట్ భాగా చేయగలరు. మరి ఇండియన్ సినిమా పుట్టుక, పెరుగుదలను తెలియజేస్తూ.. సినిమాలకి బీజం ఎక్కడ పడింది, ఎదిగే క్రమంలో ఎలాంటి ఒడిదుడుకులు ఎదుర్కోవలసి వచ్చింది అనేది చిత్రంలో చూపించనున్నారట.



# తమిళనాట పెద్ద హిట్ కొట్టిన టూరిస్ట్ ఫ్యామిలీ

ఈ మధ్య తమిళంలో పెద్ద సినిమాలకంటే చిన్న సినిమాలే తమ హావా చూపిస్తున్నాయి. ఈ ఏడాదిలో వచ్చిన లబ్బర్ పందు, మెయ్యాళగన్, కుడుంబస్తాన్, డ్రాగన్ చిత్రాలు సూపర్ హిట్‌లు అందుకున్నాయి. అయితే ఇదే కోవలో చిన్న సినిమాగా వచ్చి సూపర్ హిట్‌గా నిలిచింది టూరిస్ట్ ఫ్యామిలీ. తమిళ నటులు శశికుమార్, సిమ్రాన్ ప్రధాన పాత్రల్లో నటించగా.. యోగి బాబు, మిథున్ జై శంకర్, కమలేష్ జెగన్, ఎం.ఎస్. భాస్కర్, రమేష్ తిలక్, భగవతి పెరుమాళ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. అభిషన్ జీవింత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 1న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌ను అందుకుంది. ముఖ్యంగా ఈ సినిమా చూసిన ప్రేక్షకులు చాలా బాగుందని ప్రశంసిస్తున్నారు. తలైవర్ రజనీకాంత్‌తో పాటు–నటు–డు శివకార్తికేయన్ కూడా ఈ సినిమా చూసి చిత్రబృందంని ప్రత్యేకంగా పిలిపించుకుని అభినందించారు. ఇదిలావుంటే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. కేవలం రూ. 5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా రూ. 55 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. మరోవైపు తక్కువ బడ్జెట్‌తో రూపొందినప్పటికీ, 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన తమిళ చిత్రాలలో ఇది ఒకటిగా నిలిచింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. శ్రీలంకలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం కారణంగా ఒక తమిళ కుటు–ంబం తమ స్వస్థలాన్ని విడిచిపెట్టి భారతదేశానికి శరణార్థులు(స। ÷బిషగ।। )గా వస్తారు. అనంతరం వారు చెన్నైలో కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి ప్రయత్నిస్తారు. కానీ వాళ్లు ఎవరు అనేది చెప్పకుండా దాచిపెట్టాల్సి వస్తుంది. అలా దాచిపెడుతూ ఉండగా అనుకోకుండా రామేశ్వరం దగ్గర ఒక బాంబ్ బ్లాస్ట్ సంఘటన జరుగుతుంది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేయడం మొదలుపెడతారు. అయితే ఈ కేసుకి వీరికి సంబంధమేంటి.. శ్రీలంక నుంచి వచ్చిన ఈ ఫ్యామిలీకి ఎదురైన సమస్యలేమిటి అనేది ఈ సినిమా కథ.



# చెవిరెడ్డి భాస్కరరెడ్డి గాయబ్...



**తిరుపతి, మే15( వెలుతురు):**
వైసీపీలో కీలక నేతగా వెలుగొందిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అధికారంలో ఉన్నంత కాలం తెగ దూకుడు ప్రదర్శించారు. అలాంటి ఫైర్‌బ్రాండ్ కన్నీళ్లు పెట్టుకోవడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. తన స్వగ్రామం తుమ్మలగుంట ఆత్మీయసభలో మీకు అన్నీ చేశాను, కాని మీరు నా కొడుకును ఓడించారంటూ తన మనోవేదన వెళ్లగక్కిన సందర్భంలో ఆయన కళ్లు చెమర్చాయి. గత 11 నెలలుగా గ్రామస్తులలో ఎలాంటి సమావేశాలు పెట్టని అయన తాజాగా ఉన్నట్లుండి మీటింగ్ పెట్టారు. అసలు చెవిరెడ్డి ఎందుకు అంత అత్యవసరంగా ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారనేది చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలలో వైసిపి కీలక నాయకుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అంటే తెలియని వారుండరు. జగన్ ప్రభుత్వంలో తుడా చైర్మన్‌గా వ్యవహరించిన ఆయన మంత్రి పదవి దక్కించుకోలేక పోయినప్పటికీ.. చాలా మంది మంత్రుల కంటే ఎక్కువగానే చెలాయించారు. జగన్‌కు అత్యంత సన్నిహితుడైన చెవిరెడ్డి ఏకంగా తాడేపల్లిలోని జగన్ ప్యాలెస్‌లో తిరుమల దేవాలయ సెట్ వేయించి తన నాయకుడితో ఉగాది వేడుకలు నిర్వహింప చేసి తన వీరవిధేయత చాటుకుని విమర్శల పాలయ్యారు. 2014లో టీడీపీలోని అనైక్యతతో చంద్రగిరిలో సొంత సామాజికవర్గం గల్లా అరుణకూమారిని వ్యతిరేకించడంతో చెవిరెడ్డి మొదటిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తర్వాత 2019లో జగన్ గాలిలో సునాయాస విజయం సాధించారు. అయితే మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నియోజకవర్గంలో పట్టు కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. నియోజకవర్గం వ్యాప్తంగా పండుగలకు తాయిలాలు పంచడంతో పాటు ఇంటింటికి శుభాకాంక్షలు వెళ్ళేవి. దానికి తోడు వాలంటీర్ వ్యవస్థ రాక ముందే తానే నియోజకవర్గంలో అలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసుకుని మంత్రాంగం సాగించారు. అలా అన్నీ కలిసి వచ్చి 2019లోఆయన భారీ మెజార్టీతో గెలవగలిగారు. ఎన్నికల తర్వాత శాసన సభ విప్‌తో పాటు తుడా చైర్మన్ పదవి కూడా అయనకే దక్కింది. తుడా పదవిని అడ్డంపెట్టుకుని చెవిరెడ్డి పెద్ద తతంగమే నడిపారు. తన గ్రామ సమీపంలోని తుమ్మలగుంట చెరువును సగానికిపైగా పూడ్పించి.. తుడా నుంచి 60 కోట్లు పైగా ఖర్చు పెట్టి అత్యాధునిక వాకింగ్ ట్రాక్‌తో పాటు, అనేక విధాలుగా అభివృద్ధి చేసారు. చెరువును పూడుస్తున్నా చెవిరెడ్డి హవా చూస్తూ ఇరిగేషన్ శాఖ వారు నోరెత్తలేకపోయారంటారు. తుడా పరిధిలో ఇష్టా రాజ్యంగా బెంచీల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి, ఆ బల్లలపై తన పేరు వేయించుకుని చెవిరెడ్డి చేసిన ప్రచార అర్భాటం ఇప్పటికీ ప్రజల నోళ్లలో నానుతూనే ఉంది. దానికి తోడు రహాదారులకు సైతం వైఎస్‌తో పాటు తన పేరు పెట్టుకున్న ఘనత ఆయనది. తుడా అనేది కేవలం చంద్రగిరి నియోజకవర్గం వరకే అన్నట్లు పాలన సాగించారు. తుడా నిధులతో సొంత సర్వే టీములకు, వ్యక్తిగత సిబ్బందికి జీతాలు ఇప్పించుకున్నారన్న ఆరోపణలున్నాయి. వాటితో పాటు అనేక రకాలుగా తుడా నిధులు దుర్వినియోగం చేశారన్న అభియోగాలున్నాయి. తుడా నిధులతో తుమ్మల గుంట చెరువులో ఏర్పాటు చేసిన పార్కుపై ఇప్పటికీ వివాదాలు నడుస్తున్నాయి. పూర్వం చెరువు ఏలాగుందో అలా ఉంచాలని చాలామంది గ్రీన్ ట్రిబ్యునల్‌కువెళ్ళారు. ఇప్పటికే గ్రీన్ ట్రిబ్యునల్ అదేశాలతో అవిలాల చెరువును యాధావిధిగా ఉంచడానికి టీటీడీ ఇరిగేషన్ శాఖ అందులో ఉన్న నిర్మాణాలు తొలగిస్తోంది. ఇదే పరిస్థితి తుమ్మల గుంట చెరువులో ఏర్పాటు చేసిన పార్క్‌కు కూడా పట్టే కాలం దగ్గరలో ఉందని అంటున్నారుఎన్నికలలో ఎంపీగా ఒంగోలు నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు చెవిరెడ్డి. మరో వైపు చంద్రగిరిలో తన కూమారుడు మోహిత్ రెడ్డిని అభ్యర్థిగా రంగంలో దించారు. మోహిత్ భారీ తేడాతో టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని చేతిలో ఓటమి పాలయ్యారు. ఇప్పుడు పలు కేసులు, వివాదాలు చెవిరెడ్డిని చుట్టుముడుతున్నాయి. ఓటర్ల జాబితా తయారీలో అక్రమాలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే పులివర్తి నాని ఫిర్యాదుతో సీఐడీ కేసులు పెట్టి విచారిస్తోంది. తుడా నిధుల అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరుగుతున్నది. దాంతో పాటు పోలింగ్ తర్వాత పులివర్తి నానిపై పద్మావతి మహిళా యూనివర్సిటీలో జరిగిన దాడికి సంబంధించి హత్యాయత్నం కేసుల విచారణ సాగుతోంది. వాటితో పాటు తుమ్మలగుంట చెరువులో ఉన్న పార్క్‌ను ఇప్పటి వరకు చెవిరెడ్డి తన సొంత ఆస్తిలా భావిస్తూ వచ్చారు.. ఇప్పుడు దాన్ని తుడా నిర్వహణలో తీసుకోవాలని పై స్థాయిలో నిర్ణయం తీసుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో పావులు కదపడం మొదలు పెట్టారంట. గ్రామంలోని వారందరితో అత్యవసర ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి మరీ తాను అందర్నీ బిడ్డల కంటే ఎక్కువగా చూసుకున్నా, తన బిడ్డని ఓడించారంటూ సెంటిమెంట్ పండించే ప్రయత్నం చేశారంట. దాంతో పాటు పార్క్‌ను తుడా నిర్వహిస్తే దారుణంగా మారిపోతుందని దాని కోసం పోరాటం సాగిద్దామని పిలుపు నివ్వడం హాస్యాస్పదంగా మారింది. పార్క్ కట్టిన చెరువు ఇరిగేషన్ శాఖది, అయితే నిధులు తుడావి అయినప్పుడు నిర్వహణ అవి చేయాలి కానీ తన పరిధిలో ఉంచుకోవాలని ప్రయత్నించడంపై విమర్శలు వస్తున్నాయి. మొత్తం మీద సొంత ఆస్తి కోల్పోతున్నట్లు చెవిరెడ్డి తెగ ఇదై పోతున్నారని అందరూ సెటైర్లు విసురుతున్నారు. పక్కనున్న హాథీరాంజీ మఠం భూములలో గ్రామస్తులు కొంతమంది ఇల్లు కట్టుకున్నప్పుడు వాటిని చెవిరెడ్డి కూల్చి వేయించారు. ఇప్పుడు తన దాకా వచ్చే సరికి నొప్పి తెలుస్తోందని గ్రామస్తులు దెప్పిపొడుస్తున్నారు. మొత్తం మీద చెవిరెడ్డి కన్నీటి ఎపిసోడ్ ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది.

# కడప రెడ్డమ్మ పగ తీర్చేసుకున్నారుగా



**కడప, మే15( వెలుతురు):**
కడప జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యే మాధవి రెడ్డి కసి తీర్చుకున్నారు. కడపలో ఫైర్ బ్రాండ్ లీడర్ గా మాధవి రెడ్డి గెలిచారు. గెలిచింది ఒకేసారి అయినప్పటికీ ఆమె నిత్యం వార్తల్లో ఉంటున్నారు. కడప రెడ్డమ్మగా ఆమె దూకుడుతో వ్యవహరిస్తున్న తీరు కొన్ని సార్లు విమర్శలకు ఎదురవుతున్నప్పటికీ ఏమాత్రం వెనక్కు తగ్గడం లేదు. మాధవి రెడ్డి కడప జిల్లాలో టీడీపీలో ఫైర్ ఉన్న లీడర్ గా ఎదుగుతున్నారు. కడప జిల్లా వైసీపీ అధినేత జగన్ సొంత జిల్లా కావడంతో మాధవీ రెడ్డి కి టీడీపీ కూడా అదే స్థాయిలో ప్రయారిటీ ఇస్తుంది. పార్టీ అన్ని రకాలుగా అండగా నిలుస్తుంది. తాజాగా కడప మేయర్ సురేష్ బాబును పదవి నుంచి తొలగించి తన పవర్ ఏంటో మాధవిరెడ్డి చూపించగలిగారువైసీపీకి, సురేష్ బాబుకు సానుభూతి వస్తుందా? లేదా? అన్నది పక్కన పెడితే తాను అనుకున్నది సాధించడంలో మాధవి రెడ్డి ముందున్నారని మాత్రం చెప్పాలి. తాను శపథం చేసినట్లుగానే తనకు మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో వేదికపై కుర్చీ ఇవ్వనందుకు చివరకు మేయర్ కుర్చీనే లాగేశారు. మున్సిపల్ నిబంధనలను అడ్డుపెట్టి మేయర్ సురేష్ బాబును పదవి నుంచి తొలగించారు. మేయర్ సురేష్ బాబు తన కుటుంబ సభ్యులు డైరెక్టర్లుగా ఉన్న సంస్థకు అరవై లక్షల రూపాయల కాంట్రాక్ట్ పనులు అప్పగించారన్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా కడప మేయర్ సురేష్ బాబుపై వేటు వేసింది. దీంతో ఆయన కుర్చీ ఇవ్వనందుకు తన కుర్చీనే కోల్పోవాల్సి వచ్చింది. మొన్నటి ఎన్నికల్లో కడప జిల్లాలోనూ తెలుగుదేశం పార్టీ ఏడు నియోజకవర్గాల్లో గెలిచింది. పది శాసనసభ నియోజకవర్గాలున్న కడప జిల్లాలో తొలిసారి కూటమి పార్టీలకు ఇంతటి పెద్ద స్థాయిలో విజయం లభించింది. గతంలో ఇన్ని స్థానాలను టీడీపీ ఎప్పుడూ గెలవలేదు. మొన్నటి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుని సత్తా చాటింది. యితే కడప నియోజకవర్గంలో 1999లో గెలిచిన తర్వాత మళ్లీ టీడీపీ గెలిచింది 2024 లోనే. 1999 తర్వాత ఇక టీడీపీ అక్కడ గెలవలేదు. అంటే దాదాపు రెండున్నర దశాబ్దం కడప నియోజకవర్గంలో పసుపు జెండా ఎగురలేదనే చెప్పాలి. ఈసారి మాత్రం మాధవి రెడ్డి గెలిచి తన సత్తాను చాటారు. దీంతో ఆమెకు మంత్రి పదవి దక్కుతుందని భావించినా కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా అది సాధ్యం కాలేదు. మాధవీ రెడ్డి భర్త కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసులు రెడ్డి. తొలి నుంచి ఆయన కుటుంబం టీడీపీలోనే కొనసాగుతుంది. ఆర్థికంగా, సామాజికపరంగా బలమైన కుటుంబంగా పేరుంది. జగన్ సొంత జిల్లాలో అదీ కడపలో గెలవలేకపోయినా పార్టీ జెండాను రెడ్డప్పగారి కుటుంబం వదిలి పెట్టలేదు. ఈసారి మాత్రం తన సతీమణి మాధవరెడ్డికి టిక్కెట్ తెచ్చుకుని మరీ గెలిపించుకున్నారు. మాధవీ రెడ్డి గెలిచిన దగ్గర నుంచి స్పీడ్ గానే ఉన్నారు. కార్పొరేషన్ లో కుర్చీ కోసం చేస్తున్న గలాటా కూడా కొంత కాంట్రవర్సీగా మారినా ఆమె వెనక్కు తగ్గలేదు. కార్పొరేషన్ సమావేశంలోనే మాధవి రెడ్డి శపథం చేశారు. తనకు వేదికపై కుర్చీ వేయని నువ్వు కుర్చీలో ఉలా ఉంటావో చూస్తానంటూ వెళ్లిపోయారు. అనుకున్నట్లే మాధవి రెడ్డి అనుకున్నది సాధించారు.

**కాంట్రాక్టు పనులకు అప్పగించారని...**
మేయర్ ను సురేష్ బాబును ప్రభుత్వం తొలగించింది. మున్సిపల్ శాఖ నిబంధనలను ఉల్లంఘించి తమ బంధువులకు కాంట్రాక్టు పనులకు అప్పగించారన్న ఆరోపణలపై కడప మేయర్ సురేష్ బాబును ఆ పదవి నుంచి తొలగించింది. మున్సిపల్ చట్టాలను ఉల్లంఘించారని విచారణలో తేలిందని మున్సిపల్ శాఖ తెలిపింది. దీనిపై నోటీసులు ఇచ్చిన మున్సిపల్ శాఖ విచారణకు హాజరు కావాలని కోరింది. నిన్న సురేష్ బాబు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ శాఖ కార్యదర్శి ఎదుటహాజరయ్యారు. తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన సంస్థకు అరవై లక్షల రూపాయల కాంట్రాక్ట్ పనులకు అప్పగించారన్న ఆరోపణలపై ఆయనను తొలగిస్తూ నిర్ణయిం తీసుకున్నారు. ప్రభుత్వం సురేష్ బాబుపై అనర్హతవేటు వేసింది.

## బుగ్గన పార్టీ మారుతున్నారా..

**కర్నూలు మే15( వెలుతురు):**
వైసీపీ ప్రభుత్వంలో తిరుగులేని స్థాయిలో చక్రం తిప్పిన ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. వినిపించడం లేదు. 2024 ఎన్నికలలో బుగ్గన పరాజయం పాలయ్యారు. కర్నూలు జిల్లా డోన్ లో తెలుగుదేశం అభ్యర్థి కోట్ల విజయం సాధించారు. డోన్ లో తెలుగుదేశం జెండా ఎగరడం పదేళ్ల తర్వాత ఇదే తొలిసారి. చంద్రబాబు వ్యూహం ఫలించి కోట్ల విజయం సాధించారు. బుగ్గన పరాజయం పాలయ్యారు. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు ఆర్థిక మంత్రిగా చక్రం తిప్పి, ఐదేళ్లూ వరుసగా బడ్జెట్ ప్రవేశ పెట్టిన బుగ్గన ఆ ఓటమితో డోన్ లో అడ్రస్ లేకుండా పోయారు. అపర మేధావిలా అసెంబ్లీ లో వ్యవహరించిన ఆయన ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో తన వ్యాపార వ్యవహారాల కోసం జగన్‌కి హ్యాండ్ ఇచ్చే ఆలోచన చేస్తున్నారంట. అయితే కూటమి పార్టీలు నో ఎంట్రీ బోర్డు పెట్టడంతో ఏం చేయాలో తోచక అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోయారన్న టాక్ నడుస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డోన్ రాజకీయం ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంటుంది. గతంలో ఈ సెగ్మెంట్ లో ప్రస్తుతం తెలుగుదేశంలో ఉన్న కేఈ, కోట్ల కుటుంబాలే ప్రత్యర్థులుగా కొనసాగాయి. 1978 నుంచి 2009 వరకు ఆ రెండు ఫ్యామిలీ మధ్యే ఎలక్షన్ వార్ నడుస్తూ వచ్చింది.



2014లో వైసీపీ నుంచి ఎంట్రీ ఇచ్చిన బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అనూహ్యంగా కేఈ కృష్ణమూర్తిపై గెలుపొందారు. రెండోసారి కూడా గెలిచిన బుగ్గన ఆర్థిక మంత్రిగా అయిదేళ్లు చక్రం తిప్పారు రాజకీయ ప్రత్యర్థులైన దిగ్గజ కుటుంబాలు కేఈ, కోట్ల కుటుంబాలు గత ఎన్నికల సమయానికి ఒకే గూటి కిందకు చేరడం, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగడంతో బుగ్గనకు ఘోర పరాజయం తప్పలేదు. అదీ కాక నియోజకవర్గానికి అందుబాటులో ఉండకుండా అసెంబ్లీలో పిట్టకథలు చెప్తూ గడిపేసిన బుగ్గనపై డోన్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ ఓటమి తర్వాత బుగ్గన డోన్ వాసులకు నల్లపూసై పోయారు. ఆర్థిక శాఖ మంత్రిగా ఆయన అక్రమాలపై కూటమి సర్కారు దృష్టి సారిస్తోందన్న ప్రచారంతో భయపడి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారంటున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులను, వారి వ్యాపారాలను టార్గెట్ చేస్తూ బుగ్గన వేధింపులకు గురి చేశారన్న ఆరోపణలున్నాయి. అదే విధంగా బుగ్గనను ప్రజలు నేరుగా కలిసి తమ సమస్యలు చెప్పుకునే అవకాశం ఎప్పుడూ రాలేదు, అమరావతి, ఢిల్లీలోనే ఎక్కువ సమయం గడుపుతూ నియోజకవర్గంలో ప్రజలకు దూరమయ్యారు. అంతేగాక సొంత పార్టీ కేడర్‌ను కూడా బుగ్గన పట్టించుకోలేదని టాక్. వాటికి తోడు సొంత మండలం బేతంచెర్లలోనే బుగ్గన తీవ్రస్థాయిలో అరాచకాలకు పాల్పడ్డారంట. ప్రస్తుతం కేసుల భయం వెంటాడుతుండటంతో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వైసీపీని వీడి జగన్‌కు హ్యాండ్ ఇచ్చే ఆలోచనలో ఉన్నారంట. ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు అప్పుల కోసం ఢిల్లీ చుట్టూ తిరిగి అక్కడి పెద్దలతో అంతో ఇంతో పరిచయాలు పెంచుకున్న ఆయన.. బీజేపీలో చేరడానికి వారితో మంతనాలు సాగిస్తున్నారంట. అందుకే ఆయన వైసీపీ కార్యక్రమాల్లో కూడా కనిపించడం లేదనీ, ఎక్కువ టైమ్ ఢిల్లీలోనే గడుపుతున్నారని బుగ్గన అనుచరులు చెప్పుకుంటున్నారంట. బీజేపీలో చేరడానికి ఆయన చేస్తున్న ప్రయత్నాల సంగతి తెలిసి డోన్ కూటమి నేతలు తమ అధిష్టానాలపై తీవ్ర ఒత్తిడి తెచ్చారంట. దాంతో బుగ్గనకు కూటమి పార్టీల్లో ఎంట్రీకి డోర్స్ క్లోజ్ అయిపోయారంటున్నారు. ఆ క్రమంలో బుగ్గన ఆచూకీ ఆయన సొంత అనుచరులకే అంతుపట్టకుండా తయారైందంట.

# కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత

- ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ముష్కరుల హతం



**శ్రీనగర్, మే15( వెలుతురు):**
జమ్మూకశ్మీర్ అవంతిపొరాలో ఎన్‌కౌంటర్ జరిగింది. నాదర్, ట్రాల్ ప్రాంతాల్లో భద్రతాబలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎన్‌కౌంటర్ కొనసాగింది. అటవీప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న సమాచారంతో భద్రతాబలగాలు రంగంలోకి దిగాయి. ఈ నేపథ్యంలోగురువారం ఉదయం భద్రతాబలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో జైషే మహ్మద్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు హతం చేశాయి. కాగా జమ్మూకశ్మీర్‌లో గడిచిన 48 గంటల్లో ఇది రెండో ఎన్‌కౌంటర్. జమ్మూకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న అనుమానంతో భద్రతాబలగాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. అటవీప్రాంతాల్లో అణువణువు జల్లెడపడుతున్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. పహల్గాం నిందితులు, ఉగ్రవాదులను భద్రతాబలగాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆ వేటలో భాగంగానే ఎన్‌కౌంటర్లు జరుగు తున్నాయి. కొన్ని కొత్త ప్రదేశాల్లో ఉగ్రవాదులు దాగి ఉన్నట్లు– గుర్తించిన భద్రతా బలగాలు వారి కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. పాకిస్థాన్ నుంచి వచ్చిన చొరబాటు– ఉగ్రవాదులను మట్టుబెడుతున్నాయి. గురువారం ఉదయం టెర్రరిస్టుల కోసం గాలించగా నాదర్ , ట్రాల్ ప్రాంతాల్లో తారసపడ్డారు. భద్రతా బలగాలను చూసిన వెంటనే ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. వెంటనే భద్రతాబలగాలు కూడా ప్రతిగా కాల్పులు జరుపుతున్నాయి. అయితే ఈ కాల్పుల్లో ఓ ఉగ్రవాది మరణించినట్లు– సమాచారం. మరో ముగ్గురు నలుగురు ఉగ్రవాదులు ఉండవచ్చనే అనుమానాలు ఉన్నాయి. అవంతిపొరాలో ఎదురుకాల్పులపై కేంద్ర హోంశాఖ, రక్షణ శాఖ ఆరా తీసింది. రెండు రోజుల క్రితం కూడా షోపియాన్ ప్రాంతంలో జిన్‌పాథర్ కెల్లర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆపరేషన్ కెల్లార్ పేరుతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాదులు హతమవడంతో పాటు– భారీగా ఆయుధాలను స్వాధీనం చేస్తున్నారు. అంతేకాకుండా మందుగుండు సామాగ్రిని కూడా భద్రతాబలగాలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తానికి పహల్గాం దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను పట్టు–కోవాలనే సంకల్పంతో భద్రతాబలగాలు ముందుకు సాగుతున్నాయి.

# నాంపల్లి వద్ద రౌడీషీటర్ దారుణ హత్య



**హైదరాబాద్, మే15( వెలుతురు):**
నగరంలోని నాంపల్లిలో దారుణం చోటు–చేసుకుంది. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి వద్ద రౌడీషీటర్ హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే.. చాంద్రాయణగుట్టకు చెందిన అయాన్ ఖురేషీ ఓ కేసు నిమిత్తం నాంపల్లి కోర్టుకు వచ్చాడు. అనంతరం తిరిగి వెళ్తుండగా ఐదుగురు దుండగులు ఆయన్ను వెంబడించారు. క్యాన్సర్ ఆస్పత్రి వద్ద తొలుత బ్యాట్‌తో దాడి చేశారు. అనంతరం కత్తులతో గొంతు కోసి పొట్టలో పొడిచి చంపారు. హత్యకు ఉపయోగించిన బ్యాట్, కత్తులను ఘటనాస్థలంలోనే వదిలి పరారయ్యారు. సమాచారం అందుకున్న నాంపల్లి పోలీసులు.. ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన ఒక్కసారిగా కలకలం రేపింది. స్థానికులు బయాందోళనలకు గురయ్యారు.

# అమెరికాలో ప్రమాదానికి గురైన పర్వతారోహకులు

- భారతీయ సంతతికి చెందిన వ్యక్తి మృతి



**న్యూయార్క్, మే15( వెలుతురు):**
అమెరికాలో విషాద ఘటన చోటుచేసుకుంది. పర్వతారోణకు వెళ్లిన బృందంలో ముగ్గురు దుర్మరణం చెందారు. అందులో భారతీయ సంతతికి చెందిన ఒకరు ఉన్నట్లు గుర్తించారు. వాషింగ్టన్ రాష్ట్రంలోని నార్త్ క్యాస్కేడ్స్ పర్వతారోహణకు వెళ్లిన ఓ బృందం ప్రమాదానికి గురయ్యింది. ఈ ఘటనలో భారత సంతతికి చెందిన విష్ణు ఇరిగిరెడ్డి సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ప్రాణాలతో బయటపడిన మరో యువకుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు– తెలిసింది. సియాటెల్‌లోని ప్రముఖ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్న విష్ణు (48).. మరో ముగ్గురు స్నేహితులతో కలిసి పర్వతారోహణ కోసం నార్త్ ఎర్లీ వింటర్స్ స్పియర్స్ ప్రాంతానికి వెళ్లారు. దిగే సమయంలో ప్రతికూల వాతావరణం ఎదురయ్యింది. ఈ క్రమంలో వారి యాంకర్ పాయింట్ అదుపుతప్పి 200 అడుగుల లోతులో పడిపోయారు. అందులో ప్రాణాలతో ఉన్న ఓ యువకుడు మాత్రం 64కి.మీ మేర నడిచి.. ఎట్టకేలకు సురక్షిత ప్రాంతానికి చేరుకొన్నాడు. ప్రమాద విషయాన్ని అధికారులకు వెల్లడించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు.. హెలికాప్టర్ సాయంతో మృతదేహాలను బయటకు తీసుకువచ్చినట్లు– సమాచారం. భారత్‌కు చెందిన విష్ణు ఇరిగిరెడ్డి సియాటెల్‌లో స్థిరపడ్డారు. గ్రేటర్ సియాటెల్‌లో ఉన్న ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ ఫ్లూక్ కార్పొరేషన్‌లో ఇంజినీరింగ్ విభాగానికి ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. అక్కడ పేరుగాంచిన నిపుణుల్లో ఒకడిగా గుర్తింపు పొందడంతో పాటు స్థానికంగా నిర్వహించే కార్యక్రమాల్లో క్రియాశీలంగా వ్యవహరించేవారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com